అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 27-2-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 57 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

సిసోడియా అరెస్ట్

మద్యం కుంభకోణం కేసులో జైలుకు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి

- 8 గంటలపాటు సీబీఐ విచారణ
- బీజేపీ రాజకీయాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అరెస్టయ్యారు. ఆదివారం మధ్యాహ్నం సీబీఐ విచారణకు వెళ్లిన ఆయన్ను అధికారులు అరెస్టు చేశారు. అంతకుముందు సిసోడియాను దాదాపు 8 గంటలపాటు సీబీఐ అధికారులు ...2లో

పోరాడి..

మరణించిన పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి

- ప్రకటించిన నిమ్స్ వైద్యులు



(ఫైల్)



రోదిస్తున్న ప్రీతి తండ్రి ...



ప్రీతి భౌతికకాయాన్ని చూస్తూ బంధువుల కన్నీళ్లు

నవతెలంగాణ- హైదరాబాద్‌బ్యూరో

సీనియర్ వేధింపులు తట్టుకోలేక వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఆత్మహత్యాయత్నం చేసిన పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి పోరాడి ఓడింది. ఐదు రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో రాత్రి 9.10 గంటలకు తుదిశ్వాస విడిచినట్టు నిమ్స్ వైద్యులు ప్రకటించారు. కాకతీయ వైద్యకళాశాలలో పీజీ (అనస్థీషియా) మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ప్రీతిని సీనియర్ పీజీ విద్యార్థి సైఫ్ కొన్నాళ్లుగా వేధిస్తుండటంతో తాళలేక ఆమె హానికరమైన ఇంజెక్షన్ చేసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన ప్రీతికి.. తొలుత వరంగల్ ఎంజీఎంలో చికిత్స అందించి.. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకొచ్చారు. ఆమెను కాపాడేందుకు నిమ్స్ వైద్యుల బృందం విశ్వప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. అయితే ఆమె భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిమ్స్ ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి భారీ పోలీసు బందోబస్తు మధ్య తరలించేందుకు ప్రయత్నించగా ప్రీతి బంధువులు, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు అడ్డుకున్నారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, అక్కడే ఆందోళనలకు దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. రాత్రి 12 గంటలు దాటాక కూడా ప్రీతి మృతదేహాన్ని గాంధీకి తరలించేందుకు అంగీకరించలేదు. రెండు సార్లు అంబులెన్స్‌లోకి ఎక్కించి, ఆందోళనల నేపథ్యంలో తిరిగి ఆస్పత్రిలోకి తీసుకెళ్లారు. ఆందోళనకారులు అంబులెన్స్ తాళాలు లాక్కోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీనితో పోలీసులు, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు మంత్రి టీ హరీశ్‌రావుతో ఫోన్‌లో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రీతి మరణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో సమగ్ర విచారణ జరిపించాలనీ, నిమ్స్ ఆస్పత్రిలో ఆమెకు చేసిన వైద్యంపై కేస్ షీట్‌ను కుటుంబసభ్యులకు ఇవ్వాలనీ, ఎంజీఎం ఆస్పత్రి ప్రిన్సిపాల్, హెచ్ఓడీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ, నిమ్స్ ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. మరో వైపు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజీ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రీతి ఘటనకు కారకుడైన సైఫ్‌ను శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆమె స్వగ్రామం జనగామ జిల్లా కొడకొండ్ల మండలం గిర్నితండాలో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కేఎంసీ ప్రిన్సిపల్, హెచ్‌వోడీలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అత్యంత బాధాకరం..

ప్రీతి మరణం పట్ల హరీశ్ రావు సంతాపం

డాక్టర్ ప్రీతి మరణం పట్ల వైద్యారోగ్యశాఖ ...5లో

ఆ నిందితున్ని కఠినంగా శిక్షించాలి

- గిరిజన సంఘం అధ్యక్షులు ఎం ధర్మానాయక్

వివరాలు 3లో



3 నుంచి 30కి..

ప్రపంచ కుబేరుల సూచీలో పడిపోయిన అదానీ స్థాయి

- రూ.12 లక్షల కోట్ల సంపద ఆవిరి
- ఆ షేర్లను చూపి గతంలో లక్షల కోట్ల రుణాలు సేకరణ
- అమెరికా 'ఎన్‌రాన్' కుంభకోణం లాంటిది : ఆ దేశ మాజీ ఆర్థికమంత్రి సమ్మర్స్



గౌతం అదానీపై 'హిండెన్‌బర్గ్' నివేదిక సంధించిన ప్రశ్నలు..ప్రశ్నలుగానే మిగిలిపోతున్నాయి. అదానీ అక్రమాలపై ప్రధాని మోడీ నోరు విప్పటం లేదు. విచారణ జరపాలని కోరుతున్న ప్రతిపక్షాలపై ప్రధాని మాటల దాడికి దిగుతున్నారు. మరోవైపు స్టాక్‌మార్కెట్‌లో అదానీ కంపెనీల పతనం కొనసాగుతోంది. ప్రపంచ బిలియనీర్ల (శత కోటీశ్వరుల) సూచీలో గౌతం అదానీ 3వ స్థానం నుంచి 30వ స్థానానికి పడిపోయారు. స్టాక్ మార్కెట్‌లో ఆయన కంపెనీల సంపద రూ.12 లక్షల కోట్లు ఆవిరైపోయింది. దీనివల్ల గౌతం అదానీకి వచ్చిన ప్రత్యక్ష నష్టం ఏమీ లేదు. ఆ కంపెనీ షేర్ల విలువను చూసి..రుణాలు ఇచ్చిన సంస్థలు ఇప్పుడు పెద్ద ప్రమాదంలో పడ్డాయి. కేంద్రంలోని పాలకుల అండదండలు లేకుండా అదానీ గ్రూప్‌నకు లక్షల కోట్ల రుణాలు ఎలా దక్కుతాయి? అన్న ప్రశ్న అందరి మదిని తొలిచేస్తోంది

న్యూఢిల్లీ : ఈ ఏడాది జనవరి 24న హిండెన్‌బర్గ్ నివేదిక బహిర్గతం అయ్యాక..అదానీ వ్యాపార సామ్రాజ్యం పేకమేడలా కుప్పకూలటం మొదలైంది. భారతీయ స్టాక్ మార్కెట్లపైనా తీవ్ర ప్రభావం చూపింది. అదానీకి చెందిన పది లిస్టెడ్ కంపెనీల సంపద దాదాపు రూ.12 లక్షల కోట్లు ఆవిరైపోయినట్టు తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఓడరేవులు, విమానాశ్రయాలు, వంటనూనెలు, నిత్యావసర సరుకులు, ఎనర్జీ, సిమెంట్, డేటా సెంటర్స్...రంగాల్లో గౌతం అదానీ కంపెనీ వ్యాపారం నిర్వహిస్తున్నాయి. ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడైన గౌతం అదానీకి ..కేంద్రంలోని పాలకులతో గట్టి బంధాలున్నాయి. ప్రభుత్వ బ్యాంకులు, ఎల్ఐసీ నుంచి వేల కోట్లు రుణాలు దక్కటానికి అవే కారణం.

ఎన్‌రాన్ కుంభకోణం తలపిస్తోంది..

హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత గౌతం అదానీ మునిగిపోవటమేగాక..ఆయన కంపెనీలకు రుణాలు ఇచ్చిన సంస్థలూ దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఇది రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దేశవ్యాప్తంగా ఈ అంశంపై ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నా..మోడీ సర్కార్ మాత్రం మౌనం వహిస్తోంది. అమెరికాలో 2001లో 'ఎన్‌రాన్ కుంభకోణం' బయటపడ్డాక..ఎలాంటి పరిస్థితులు ...2లో

నిన్నొదలా...

- నిజం బయటకొచ్చే దాకా అదానీని నిలదీస్తాం.. : రాహుల్



రాయ్‌పూర్.: పార్లమెంట్‌లో పారిశ్రామికవేత్తకు మద్దతుగా బీజేపీ నేతలు వస్తున్నా..నిజం బయటకు వచ్చే దాకా అదానీని వదిలిపెట్టమనీ, అదానీ (గ్రూప్స్) అక్రమాలపై ...2లో

గుజరాత్‌లో ఎస్ఈజెడ్



గౌతం అదానీ గ్రూప్ కంపెనీలపై ఓ వైపు తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తుంటే, అహ్మదాబాద్‌లో అత్యంత విలువైన భూమిని కట్టబెట్టడానికి గుజరాత్ ప్రభుత్వం సిద్ధమైంది. ఎస్ఈజెడ్, టౌన్‌షిప్ నిర్మాణం కోసం అదానీ గ్రూప్ ...2లో

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం

బీజేపీకి అదానీ, అంబానీల సంక్షేమమే ముఖ్యం

- దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని, ఉద్యమానికి ఆయననే స్ఫూర్తిగా తీసుకున్నామని ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావ అన్నారు. బీసీల సంక్షేమం బీజేపీకి అవసరం లేదని, అదానీ, అంబానీల సంక్షేమమే ముఖ్యమని విమర్శించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అనంతరం కురుమసంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. టీఎస్ఆర్ గార్డెన్లో కురుమ సంఘం సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ఉగాది, శ్రీరామనవమి తర్వాత రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని, యూనిట్ కాస్ట్ కూడా పెంచామని చెప్పారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందన్నారు. బీసీల కోసం ఒక శాఖ ఏర్పాటు చేయలేదన్నారు. కేంద్రం బడ్జెట్లో రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. మెదక్‌లో కురుమ భవనం నిర్మిస్తామన్నారు. హైదరాబాదులో కురుమ భవనానికి రూ.రెండు కోట్లు అదనంగా కేటాయించామన్నారు. కొమురెల్లి మల్లన్నకు పట్టు వస్త్రాలు, తలంబరాలు సమర్పించిన ...5లో

భారత ఆర్థికం మరీ బలహీనం

అధిక వడ్డీ రేట్లతో ప్రయివేటు మూలధన పెట్టుబడి మరింత కష్టతరం: ఆర్బీఐ ఎంపీసీ సభ్యులు జయంత్ వర్మ్



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థపై ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సభ్యులు, అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ జయంత్ వర్మ్ ఆందోళన వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వృద్ధి 'చాలా బలహీనంగా' ఉన్నట్టు కనిపిస్తున్నదని చెప్పారు. పెరుగుతున్న ...5లో

ప్రతిపక్షాలన్నీ బీజేపీపై ఐక్యంగా పోరాడాలి

కాంగ్రెస్‌పార్టీ 85వ ప్లీనరీ ముగింపు సమావేశంలో ప్రియాంక



రాయ్‌పూర్: 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తాయని.. బీజేపీపై ఐక్యంగా పోరాడతాయని కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ప్రియాంకా గాంధీ అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్ వేదికగా కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశాల్లో భాగంగా... ఆదివారం కార్యకర్తలనుద్దేశించి ప్రియాంక గాంధీ , మాట్లాడుతూ.. ఇక ఒక్క సంవత్సరం మాత్రమే మిగిలిఉన్నదనీ.. ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వస్తాయనీ, అయితే కాంగ్రెస్‌పైనే ఎక్కువ అంచనాలు ఉన్నాయని అన్నారు. పార్టీ సందేశాన్ని, మోడీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీపై ఐక్యంగా పోరాటం చేయాలని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తూ కేంద్రం ...5లో

దేశానికి బీజేపీ విధానాలు ప్రమాదకరం

ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు : ఏఐఎఫ్‌బీ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్ట్ మతోన్మాద జాతీయవాదం దేశానికి ప్రమాదకరంగా మారిందని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) జాతీయ ప్రధాన కార్యదర్శి జి దేవరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ 19 వ జాతీయ మహాసభ ముగింపు సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో ఫార్వర్డ్ బ్లాక్‌తో కలిసివచ్చే వామపక్ష, ప్రజాస్వామ్య, ప్రగతిశీల పార్టీలతో కలిసి మోడీ ఫాసిస్ట్ విధానాలకు ...5లో

ఊరిస్తున్న గిరిజన బంధు

గిరిజనుల ఎదురు చూపులు

గిరిజనం బతుకు దుర్భరంగా మారుతోంది. పాలకులు మారినా తమ తలరాతలు మారటంలేదన్న ఆవేదన,ఆగ్రహం పెల్లుబుకుతోంది. సీఎం కేసీఆర్ ఇటీవల చేసిన ప్రకటన వారిలో కొంత ఊరట నిచ్చింది. అయితే దీనిపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టత రాలేదు. దీనికి కార్యాచరణ అవసరమని గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

- రుణాలందక అవస్థలు పడుతున్న యువత
- బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవటంపై అనుమానాలు
- హామీని అమలు చేస్తామంటున్న మంత్రి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనులను 'గిరిజనబంధు' పథకం ఊరిస్తున్నది. దళిత బంధు లాగానే గిరిజన బంధుకూడా అమలు చేస్తామంటూ పొయినేడాది సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ఆదివాసీ, బంజారాల ఆత్మీయ సభలో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లతోపాటు గిరిజన బంధు పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఐదు నెల్లు దాటినా గిరిజనబంధుపై స్పష్టత రాకపోవటంతో గిరిజనుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అమలుకు నోచుకోని పథకాలు..

గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు తగిన విధంగా లబ్దిదారులకు చేకూరటం లేదన్న విమర్శలున్నాయి. రాష్ట్రంలో 32 గిరిజజన తెగలున్నాయి.2011 జనాభా లెక్కల ప్రకారం 31.78 లక్షల జనాభా ఉండగా..తెలంగాణ సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం36,02,288మంది (9.91శాతం) గిరిజనులున్నారు. ఇందులో మైదాన ప్రాంత గిరిజనులు 20,44,039 (64శాతం) ఉండగా, మిగతా వివిధ తెగలతో కూడిన ఆదివాసీలున్నారు. వీరి అభివృద్ధికోసం ప్రభుత్వం తగిన విధంగా కృషి చేయాలి. పథకాల అమలు తీరుపై పరిశీలన పెరగాలి. అరకొర నిధులు కేటాయిస్తున్నా..వాటిని ఖర్చు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే దళిత బంధు మాదిరిగా గిరిజన బంధు ప్రకటించాలన్న డిమాండ్ ముందుకొచ్చింది.

పట్టాలెక్కని పథకం..

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన బంధు ప్రకటించినప్పటికీ..తగిన విధి విధానాలను ప్రకటించకపోవటంపై గిరిజనులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర బడ్జెట్‌లో ...5లో

సర్వాంగ సుందరంగా...

కరీంనగర్ సిగలో మానేరు రివర్ ఫ్రంట్‌కురూ.410కోట్లతో మెరుగులు

- ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఫౌంటెన్.. భారీ పర్యాటక ప్రాజెక్టు దిశగా అడుగులు
- బాల్ ఆన్ వాల్ ఫౌంటెన్ కాన్సెప్ట్‌తో భారీ ప్రదర్శనకు నిర్మాణాలు
- తీగల వంతెన నిర్మాణం పూర్తి, వాగులో పూర్తిదశలో రిటైనింగ్ వాల్స్
- కేబుల్ బ్రిడ్జిపై ఎల్ఈడీ తెరలపై యాడ్లు, పథకాల ప్రచారం





ఊహాచిత్రాలు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్‌లో సిగలో మానేరు రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ఓ మణిహారంగా మారనుంది. రూ.410కోట్లతో చేపడుతున్న ఈ పర్యాటక ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో ఇన్‌స్టాల్ చేయబోయే ఫౌంటెన్ ప్రపంచంలోనే మూడో అతి పెద్దది కావడం విశేషం. మొదటిది దక్షిణ కొరియాలోని సియోల్‌లో, రెండోది చైనాలోని షాంఘైలో ఉండగా.. మూడోది కరీంనగర్‌లోనే కావడం గమనార్హం. ఇప్పటికే నీటి పారుదల శాఖ నుంచి రూ.310కోట్లు, పర్యాటకశాఖ నుంచి రూ.100కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.70కోట్ల వరకు ఫౌంటెన్ నిర్మాణానికే వెచ్చిస్తున్నారు. ఆదివారం స్థానిక మంత్రి గంగుల కమలాకర్ భూమిపూజ కూడా చేశారు. ప్రస్తుతం కేబుల్ బ్రిడ్జి, దాని అప్రోచ్ ...5లో

సిసోడియా అరెస్టు అప్రజాస్వామికం

- మంత్రి కేటీఆర్, హరీశ్ రావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అరెస్టు అప్రజాస్వామికం, దుర్మార్గం అని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షులు, రాష్ట్ర మంత్రి కే తారకరామారావు, టీ హరీశ్ రావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షపార్టీల పట్ల వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఆక్షేపణీయమని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల్ని ప్రతిపక్షాలపైకి ఉసిగొల్పి దొంగచాటు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాబలం లేక అధికారంలోకి రాలేక ఈతరహా బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ కుట్రలు దేశంలో ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నారు. దీనికి పరాకాష్టే మనీష్ సిసోడియా అరెస్టు అని చెప్పారు. ఢిల్లీ మేయర్ ఎన్నికల్లో సుప్రీంకోర్టు ద్వారా చివాట్లు తిన్న తర్వాత ఎదురైన పరాజయాన్ని తట్టుకోలేక సిసోడియాను ఇప్పుడు అరెస్ట్ చేశారని అన్నారు.

బిజెపి అసమర్థ విధానాలు, అవినీతిని ప్రశ్నిస్తున్న బలమైన పార్టీలను ఎదుర్కోలేక పిరికి రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. బిజెపి తన పార్టీలోని అవినీతి నాయకులను సత్యహరిశ్చంద్రుని సహోదరులుగా చూపించి, ప్రతిపక్ష నాయకులను అవినీతిపరులుగా చిత్రీకరించే కుటిల ఎత్తుగడలు వేస్తున్నదని అన్నారు.

బీఆర్ఎస్‌కు దేశంలో ఆదరణ పెరుగుతుంది-మంత్రి వేముల

ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన, అభివృద్ధి సంక్షేమ పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్నదనీ, బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ కూడా పెరుగుతున్నదని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాల్కొండ నియోజకవర్గం చౌట్పల్లికి చెందిన బీజేపీ, బీఎస్పీ పార్టీల నుంచి పలువురు కార్యకర్తలు మంత్రి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సీఎం కేసిఆర్ తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా కావాలనే డిమాండ్ ప్రజల్లోంచి వస్తోందన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌యస్‌లో చేరిన ఆలిండియా ముస్లిం రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు

దేశ రాజకీయాల్లో భవిష్యత్తు బీఆర్‌యస్ పార్టీదేనని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి చెప్పారు. సూర్యాపేట జిల్లా సీనియర్ కాంగ్రెస్ నేత, ఆలిండియా ముస్లిం రిజర్వేషన్ కమిటీ పోరాట సమితి అధ్యక్షుడు యండి ఖాలేద్ అహ్మద్ ఆదివారం మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బిఆర్‌యస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణాలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన సరిహద్దు రాష్ట్రాల ప్రజలు తమ ప్రాంతాలను తెలంగాణాలో కలపాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ వెంకట నారాయణ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణరక్షక యాప్‌గా 'ఈ-సంజీవని'..

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ వైద్య సంప్రదింపులను సులభతరం చేసే 'ఈ-సంజీవని యాప్ ద్వారా ఇప్పటి వరకు 10 కోట్లకుపైగా భారతీయులు ప్రయోజనం పొందినట్లు ప్రధాని మోడీ తెలిపారు. భారత్ డిజిటల్ విప్లవ సామర్థ్యాన్ని ఈ యాప్ ప్రతిబింబిస్తోందన్నారు. ఆదివారం నిర్వహించిన 98వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. స్థానికంగా 'ఈ- సంజీవని' యాప్ ద్వారా అందుతున్న సేవలపై సిక్కింకు చెందిన ఓ వైద్యుడితో ఈ సందర్భంగా మాట్లాడారు. సామాన్యులు, మధ్యతరగతి, మారుమూల ప్రాంతాలవారికి ఇది 'ప్రాణరక్షక యాప్'గా మారుతోందని చెప్పారు. దేశానికి చెందిన యూపీఐ సింగపూర్ 'పే నౌ' మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందాన్నీ ఈ సందర్భంగా ప్రస్తావించారు.

వెనిజులా, బ్రెజిల్ మధ్య సహకారం

- మరింత ముందుకు : మదురో

కారాకస్ : బ్రెజిల్‌తో తమ దేశ సహకారం మరింత ముందుకు వెళుతుందని వెనిజులా అధ్యక్షులు నికోలస్ మదురో తెలిపారు. 'బ్రెజిల్-వెనిజులా మధ్య దౌత్య సంబంధాల పునరుద్ధరణకు మార్గం తెరిచి ఉంది. ఇరు దేశాల మధ్య సోదర భావం, సహకారంలో కొత్త దశను నేను ఆవిష్కరిస్తాను' అని మదురో ట్వీట్ చేశారు. బ్రెజిల్‌కు వెనిజులా రాయబారిగా మాన్యుయెల్ వాడెల్‌ను శుక్రవారం నియమించిన సందర్భంగా మదురో ఈ ట్వీట్ చేశారు. సంబంధాల పునరుద్ధరణలో భాగంగానే ఇరు దేశాల రాయబార కార్యాలయాలను పునఃప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 2019లో బోల్సోనారో అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి బ్రెజిల్-వెనిజులా మధ్య సంబంధాలు క్షీణిస్తూ వచ్చాయి. ఇటీవల బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడంతో, ఇరు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్నాయి.

సవాళ్లను అధిగమిస్తాం : మల్లికార్జున ఖర్గే

రాయిపూర్ : కాంగ్రెస్ పార్టీ అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని, వాటిని ఐక్యత, క్రమశిక్షణ, సంకల్పంతో అధిగమిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశాలు ముగిసాయని, ఇది నూతన కాంగ్రెస్ ఆవిష్కరణకు దిశానిర్దేశం చేసిందని ఆయన తెలిపారు. ఇక్కడ మూడు రోజుల పాటు జరిగిన ప్లీనరీ సమావేశం ముగింపు సందర్భంగా ఆయన ఆదివారం ప్రసంగించారు. జాతీయ స్థాయిలో మన ప్రవర్తన పార్టీలో ప్రతిస్థాయిలో ఉన్న కోట్లాది మంది సహచరులపై ప్రభావం చూపుతుందని ఖర్గే చెప్పారు. కాలంతో పాటు అనేక విషయాలు మారతాయని, ప్రజల ఆకాంక్షలు, అంచనాలు మారతాయని, కొత్త సవాళ్లు పుట్టుకొస్తాయని, కొత్త మార్గాలు కూడా కనిపిస్తాయని అన్నారు.

మరో 30 నెలల్లో బీబీనగర్ ఎయిమ్స్

- కేంద్ర ఆరోగ్యశాఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణం మరో 30 నెలల్లో పూర్తవుతుందని కేంద్ర ఆరోగ్యశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణం కోసం రూ.1,366 కోట్లతో ఆమోదం పొందిందనీ, 2022 జూలైలో 36 నెలల్లో పూర్తి చేసేలా టెండర్ ఖరారైందని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే రూ.350 కోట్లు విడుదల చేసినట్టు వెల్లడించారు. దశల వారీగా పనుల ప్రగతి ఆధారంగా మిగిలిన నిధుల విడుదల ఉంటుందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా మాణిక్‌కదం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అనుబంధ కిసాన్ సెల్ (భారత రాష్ట్ర కిసాన్ సమితి) మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా మాణిక్‌కదంను ఆ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు నియమించారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. మాణిక్ కదం మహారాష్ట్ర పర్బని ప్రాంత నివాసి అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు ఆర్టీసీ డయల్ యువర్ ఆర్ఎమ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీ రంగారెడ్డి రీజియన్ పరిధిలోని ఎమ్‌జీబీఎస్, జూబ్లీ బస్టేషన్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్ నుంచి బయల్దేరే బస్సు సర్వీసులకు సంబంధించి ప్రయాణీకుల సమస్యల్ని పరిష్కరించేందుకు సోమవారం డయల్ యువర్ ఆర్ఎమ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్ఎమ్ ఏ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్ 1,2, పికెట్, మియాపూర్-1, బీహెచ్‌ఈఎల్, పరిగి, తాండూర్, వికారాబాద్ డిపోలకు సంబంధించిన సమస్యల్ని కూడా ప్రయాణీకులు ఫోన్ ద్వారా ఆర్ఎమ్‌కు నేరుగా చెప్పవచ్చు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య 99592 26241 నెంబర్‌కు ఫోన్ చేసి, ప్రయాణీకులు తమ సమస్యలు, సలహాలు, సూచనలు చేయవచ్చని తెలిపారు.

ఉపాధి, సమాన హక్కుల కోసం పోరాటం

ముగిసిన డీవైఎఫ్ఐ మహిళా సమ్మేళనం

- ఏప్రిల్ 5 జరిగే కిసాన్ మజ్దూర్ ర్యాలీలో భాగస్వామ్యం కావాలని నిర్ణయం



న్యూఢిల్లీ : 'ఉపాధి , సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా పోరాటం చేయాలని డీవైఎఫ్ఐ అఖిల భారత మహిళా సమ్మేళనం పిలుపు ఇచ్చింది. ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్ (హెచ్‌కేఎస్)లో రెండు రోజుల పాటు జరిగిన డీవైఎఫ్ఐ అఖిల భారత యువతుల సమ్మేళనం ఆదివారం ముగిసింది. 17 రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. మోడీ పాలనలో ప్రభుత్వం అనుసరిస్తున్న వివిధ మహిళా వ్యతిరేక విధానాల వల్ల మహిళల జీవితం మరింత కష్టతరంగా మారిందని సమావేశం తీర్మానించింది. బేటీ బచావో బేటీ పడావో అంటూ నినాదాలు చేస్తున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. మహిళల అణచివేతను అరికట్టాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న ఉద్యమాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించింది. దేశంలో నిరుద్యోగం ఎప్పటికప్పుడు అత్యధికంగా పెరుగుతోందనీ, లేబర్ మార్కెట్‌లో మహిళలు వివక్షకు గురవుతున్నారని పేర్కొంది. 2010 నుంచి 2020 మధ్య ప్రపంచ బ్యాంక్ చేసిన పరిశోధన ప్రకారం దేశంలో పనిచేసే మహిళల సంఖ్య 26 శాతం నుంచి 19 శాతానికి పడిపోయిందనీ, 2021లో గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్‌లో భారతదేశం 28 స్థానాలు పడిపోయిందని తెలిపింది. 156 దేశాలలో భారతదేశం 140 స్థానంలో ఉన్నదని పేర్కొంది. ఈ నేపథ్యంలో 'ఉపాధి కోసం పోరాటం, సమాన హక్కుల కోసం పోరాటం' అనే నినాదంతో పోరాటం చేయాలని పిలుపు ఇచ్చింది.

ఈ సదస్సును అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఎ ఎ రహీం అధ్యక్షత వహించి సదస్సులో ప్రసంగించారు. డీవైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య సమావేశ నివేదికను సమర్పించారు. దాని ఆధారంగా చర్చలు జరిగాయి. చర్చలకు మీనాక్షి ముఖర్జీ సమాధానమిచ్చారు. సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్, ఎంఎ బేబి ప్రతినిధులను ఉద్దేశించి పలు అంశాలపై వారు ప్రసంగించారు. గ్రీష్మా అజయ్ఘోష్, చింతా జెరోమ్, ఎస్ భారతి, ధ్రువజ్యోతి సాహాతో కూడిన కన్వెన్షన్ ప్రిసిడియంకు మీనాక్షి ముఖర్జీ నాయకత్వం వహించారు.

బీజేపీ ప్రభుత్వాలు సమాజంలో మనుస్మృతిని కొనసాగించడం, వరకట్నం వంటి పితృస్వామ్య నిబంధనల గురించి ఉత్తర భారత రాష్ట్రాల ప్రతినిధులు తమ ఆందోళనను పంచుకున్నారు. పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న మహిళా వలస కూలీలు అక్కడ కూడా వేధింపులకు గురవుతున్నారని చర్చల్లో ప్రతినిధులు పేర్కొన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా, ప్రయివేటు రంగంతో సహా అన్ని రంగాల్లో ప్రసూతి సెలవులు, అన్ని ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం వంటి సంస్కరణల నేపథ్యంలో దేశవ్యాప్తంగా రుతుక్రమ సెలవులు కల్పించడం కోసం డీవైఎఫ్ఐ బలమైన ఉద్యమాలు చేపడుతుందని తీర్మానించారు. స్వతంత్ర ప్రచారాలు, కార్యక్రమాలతో పాటు మహిళా అణచివేత, ఇతర సమస్యలపై ఉమ్మడి ఉద్యమాలు కూడా చేపట్టాలని నిర్ణయించారు. యువతుల హక్కుల కోసం పోరాడే క్రమంలో సంఘాన్ని కూడా బలోపేతం చేయాలని నిర్ణయించారు.

కిసాన్ మజ్దూర్ ర్యాలీలో భాగస్వామ్యం

ఏప్రిల్ 5న జరిగే మజ్దూర్ కిసాన్ ర్యాలీలో పాల్గొనాలని డీవైఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయించింది. దేశంలోని రైతులు, కార్మికులను ప్రభావితం చేసే సమస్యలు యువతకు కూడా సమానంగా ఉన్నాయని పేర్కొంది..

ఈశాన్యంలో పోలింగ్ డే

నేడే మేఘాలయ, నాగలాండ్ అసెంబ్లీ ఎన్నికలు

- బరిలో 552 మంది.. 34 లక్షల మందికి పైగా ఓటర్లు
- సర్వం సిద్ధం చేసిన ఎన్నికల అధికారులు
- మార్చి 2న త్రిపురతో పాటు ఈ రెండు రాష్ట్రాల ఫలితాలు

షిల్లాం, కోహిమా : ఈశాన్య రాష్ట్రాలు మేఘాలయ, నాగలాండ్‌లలో నేడు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రెండు రాష్ట్రాల్లో 60 చొప్పున ఉన్న అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. నాగలాండ్‌లో ఒక స్థానం ఏకగ్రీవమైంది. మేఘాలయలో ఒక స్థానంలో అభ్యర్థి మరణించారు. దీంతో ఈ రెండు రాష్ట్రాల్లో 59 చొప్పున అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ఎన్నికల అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ చేశారు. రెండు రాష్ట్రాల్లో పలు పార్టీల నుంచి మొత్తం 552 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. 34 లక్షల మందికి పైగా ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలను పూర్తి చేసుకున్న మరో ఈశాన్య రాష్ట్రంతో పాటు ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చే నెల 2న వెలువడనున్నాయి.

మేఘాలయలో 369 మంది అభ్యర్థులు

మేఘాలయలో ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 21.4 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 10.8 లక్షల మంది మహిళలు ఉన్నారు. పలు ప్రధాన పార్టీలు, ఇండిపెండెంట్లు కలుపుకొని మొత్తం 369 మంది అభ్యర్థులు బరి ఉన్నారు. వీరిలో 36 మంది మహిళలు ఉన్నారు. ఎన్నికలు సాఫీగా సాగడానికి మేఘాలయలో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీ సంఖ్యలో కేంద్ర బలగాలు మోహరించాయి. మొత్తం 60 సీట్లలో బీజేపీ, కాంగ్రెస్ లు తమ అభ్యర్థులను నిలిపాయి. అధికార ఎన్‌పీపీ 57 మంది అభ్యర్థులను బరిలో ఉంచింది. టీఎంసీ 36 మందిని పోటీలో పెట్టింది. 44 మంది ఇండిపెండెంట్లు అసెంబ్లీ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో మొత్తం 3482 పోలింగ్ స్టేషన్లలో దాదాపు 900 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎఫ్ఆర్ ఖర్కోంగర్ చెప్పారు. బంగ్లాదేశ్‌తో అంతర్జాతీయ సరిహద్దును వచ్చేనెల 2 వరకు మూసివేయాలని ఆదేశించినట్టు తెలిపారు.

నాగలాండ్‌లో 183 మంది అభ్యర్థులు

మరో ఈశాన్య రాష్ట్రం నాగలాండ్‌లో 59 స్థానాలకు గానూ 183 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 13 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అధికార నేషనలిస్టు డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ), బీజేపీ కూటమి 40:20 నిష్పత్తిలో తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. 2003 వరకు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్‌కు ప్రస్తుతం సభలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. ప్రస్తుతం ఆ పార్టీ 23 మంది అభ్యర్థులను పోటీలో పెట్టింది. 19 మంది ఇండిపెండెంట్లు పోటీ చేయనున్నారు.

3 నుంచి 30కి...

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడ్డాయో ఇప్పుడు భారత్‌లోనూ అదే సంభవించవచ్చునని అమెరికా మాజీ ఆర్థికమంత్రి లారీ సమ్మర్స్ అభిప్రాయపడ్డారు. కొద్ది రోజుల క్రితం 'వాల్‌స్ట్రీట్ వీక్'తో మాట్లాడుతూ, "భారత్‌లో ఎన్‌రాన్ తరహా పరిస్థితులు ఏర్పడొచ్చు. జీ-20 సమావేశాలకు నేతృత్వం వహిస్తున్న ఆ దేశం వైపు ఇప్పుడు అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు" అని వివరించారు. అమెరికాలో ప్రముఖ ఇంధన సంస్థల్లో ఒకటైన 'ఎన్‌రాన్ కార్పొరేషన్' 2001లో తన ఆదాయాలను పెంచి చూపింది. అంతేగాక నష్టాలను దాచిపెట్టింది. ఈ విషయం బయటపడటంతో ఆ సంస్థ షేరు విలువలు భారీగా క్షీణించి..దివాళా తీసింది.

రూ. 6.6లక్షల కోట్ల సంపద ఆవిరి

ఫ్రాన్స్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న అదానీ గ్యాస్ లిమిటెడ్ మార్కెట్ విలువ గత నెలరోజుల్లో 80.68శాతం పడిపోగా, అదానీ గ్రీన్ ఎనర్జీ 74.62 శాతం మేర నష్టపోయింది. జనవరి 24వ తేదీ నుంచి ఇప్పటివరకు అదానీ ట్రాన్స్‌మిషన్ విలువ 74.21 శాతం పడిపోయింది. అదానీ పవర్, అదానీ విల్మర్, సిమెంట్ యూనిట్స్, మీడియా, అదానీ పోర్ట్స్, సెజ్‌ల మార్కెట్ విలువ గణనీయంగా తగ్గిపోయింది. హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడి కాకముందు 120 బిలియన్ డాలర్ల (సుమారుగా రూ.9.9లక్షల కోట్లు) సంపదతో ఉన్న అదానీ గ్రూప్ ఛైర్మెన్ గౌతం అదానీ ఏకంగా 80.6 బిలియన్ల (రూ.6.6 లక్షల కోట్లు) సంపదను కోల్పోయారు. అంతేకాదు, ప్రపంచ బిలియనీర్ సూచీలో 30వ స్థానానికి జారిపోయారు. వ్యాపార రంగంలో పోటీదారైన ముకేశ్ అంబానీ ఆసియాలోనే మూడవ అత్యంత సంపన్నుడిగా కొనసాగుతుండగా, ప్రపంచ సంపన్నుల జాబితాలో 10వ స్థానంలో ఉన్నారు. ఆయన ప్రస్తుత సంపద విలువ 6.7 లక్షల కోట్లు (81.7 బిలియన్ డాలర్లు).

గుజరాత్‌లో ఎస్‌ఈజెడ్

(మొదటిపేజీ తరువాయి)

94వేల చదరపు మీటర్ల భూమి కావాలని ప్రభుత్వాన్ని కోరినట్టు ఆ రాష్ట్ర సీఎం భూపేంద్ర పటేల్ అసెంబ్లీలో ప్రకటించారు. ఇదిగాక, గాంధీనగర్‌కు సమీపంలోని జాస్పూర్ గ్రామంలో 202 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన వ్యవసాయేతర భూమిని ఇవ్వాలని అదానీ గ్రూప్ బీజేపీ సర్కార్‌ను కోరింది. అహ్మదాబాద్‌కు సమీపంలో ఖోదియార్ గ్రామ పరిధిలో ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్‌ఈజెడ్)ని, జాస్పూర్‌లో టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని అదానీ గ్రూప్ తెలిపింది.


నిన్నొదలా...

(మొదటిపేజీ తరువాయి)

తాము ప్రశ్నలు అడుగుతూనే ఉంటామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. అదానీ అంశంపై ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన రాహుల్, అదానీ మొత్తం దేశ సంపదను తాకట్టు పెట్టి దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆరోపించారు."ప్రధానికీ అదానీకీ బంధం ఏమిటని మేం పార్లమెంటులో అడిగినప్పుడు మా ప్రసంగం మొత్తం కట్ చేశారు. అదానీ నిజాలు బయటకు వచ్చే వరకు మేం పార్లమెంటులో వేలసార్లు అడుగుతాం, మేం ఆగం.." అని 85వ ప్లీనరీ సమావేశంలో ఆయన అన్నారు.."అదానీ కంపెనీ దేశాన్ని ముంచేస్తోందనీ, 'దేశంలోని మొత్తం మౌలిక సదుపాయాలను లాక్కుంటోందని అని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆరోపించారు."దేశ స్వాతంత్ర్యం కోసం యుద్ధం ఒక ఈస్టిండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగింది, ఎందుకంటే అది మన సంపదను దోచుకున్నది. అని వివరించారు.అదానీ,బీజేపీ కలయికతో చరిత్ర పునరావతమవుతోందనీ, ఇది దేశానికి వ్యతిరేకమైన పని అని, అలా జరిగితే కాంగ్రెస్ పార్టీ మొత్తం వ్యతిరేకిస్తుందని అన్నారు..

భుజ్ భూకంపం.. మానని గాయం

- వేలాది మంది మృతి.. లక్షలాది మందికి గాయాలు
- ఆపన్న హస్తం కోసం గుజరాతీల ఎదురు చూపులు
- గుర్తు చేస్తున్న టర్కీ, సిరియా భూకంప పరిస్థితులు



న్యూఢిల్లీ : ఇటీవల టర్కీ, సిరియా దేశాలను భూకంపాలు వణికించాయి. ముఖ్యంగా, టర్కీ దేశం ఈ ప్రకృతి వైపరీత్యానికి తీవ్ర ధన, ప్రాణ, ఆస్థి నష్టాన్ని చూసింది. ఎటు చూసినా ఆందోళనకర పరిస్థితులు ఆ దేశంలో నెలకొన్నాయి. ఈ పరిస్థితులే ఇప్పుడు 2001లో గుజరాత్‌లో సంభవించిన భయానక భూకంప రోజులను గుర్తు చేస్తున్నాయి. ముఖ్యంగా, భుజ్ కేంద్రంగా ఏర్పడిన భూకంపం అక్కడి ప్రజలకు మానని గాయాన్ని మిగిల్చింది. 2001 జనవరి 26న ఉదయం 8-9 గంటల ప్రాంతంలో.. రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. ఈ ప్రమాద ఘటనలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది గాయాలపాలయ్యారు. అనేక మంది శిథిలాల కింద చిక్కుకొని సాయం కోసం ఆర్తనాదాలు చేశారు. భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ముఖ్యంగా భూకంప కేంద్రమైన భుజ్‌లో ఈ నష్టం తీవ్రంగా ఉన్నది. అక్కడి పరిస్థితులు హృదయ విదారకంగా మారాయి. రిపబ్లిక్ డే రోజు వేడుకలు జరుపుకుంటున్న ఒక స్కూల్ భవనం కూలిపోవడంతో దాదాపు విద్యార్థులందరూ మరణించారు. అనేక మంది చిన్నారులు శిథిలాల కింద చిక్కుకున్న దృశ్యాలు కంటతడి తెప్పించాయి. భుజ్‌లో పరిస్థితి తీవ్రతను తెలియజేసే ఘటన ఇది ఒకటి. ఇలా అనేక ఘటనలు భూకంపం మిగిల్చిన గాయాలే. ఈ విపత్కర పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అనేక వారాల సమయం పట్టింది. బాధితులకు పునరావాసం కల్పించడానికి అనేక నెలల సమయం పట్టింది. అప్పటి పరిస్థితుల్లో గుజరాత్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఏ మాత్రమూ సరిపోలేదు. ఇటు రాష్ట్రంలో ప్రధాన నగరమైన అహ్మదాబాద్‌కు దేశ, విదేశాల నుంచి సహాయ సామాగ్రి, ఆహార ధాన్యాలు, ఇతరత్రా అవసరమైన వస్తువులు వచ్చి చేరాయి. సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంధ సంస్థలు, పౌర సంఘాలు, యువత, విద్యార్థులు.. ఇలా సకల జనులు గుజరాత్‌కు ఆపన్న హస్తం అందించడానికి ముందుకు కదిలారు. చందాల రూపంలో తమకు తోచిన సాయాన్ని అందించారు. అధికారిక లెక్కల ప్రకారం గుజరాత్ భూకంపంలో 20 వేల మంది మరణించగా, 1.6 లక్షల మంది గాయపడ్డారు.

గుజరాత్‌లో స్వల్ప భూకంపం

గాంధీనగర్ : గుజరాత్‌లో భూకంపం సంభవించింది. ఆదివారం మధ్యాహ్నం 4.3 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. రాజ్‌కోట్‌కు 270 కిలోమీటర్ల దూరంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. మధ్యాహ్నం 3:21 గంటలకు భూకంప కేంద్రం నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ట్వీట్ చేసింది. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గతవారం గుజరాత్‌లోని అమ్రేలి జిల్లాలో రెండు రోజుల్లో మూడు చిన్నపాటి ప్రకంపనలు నమోదయ్యాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్మోలాజికల్ రీసెర్చ్ (ఐఎస్ఆర్) అధికారి ఒకరు చెప్పినట్లు తెలిసింది. భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లల్లోంచి రోడ్లపైకి పరుగులు తీశారు.

సిసోడియా అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. అనంతరం అదుపులోకి తీసుకొని, అరెస్టు చేసినట్టు సీబీఐ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో సీబీఐ కేంద్ర కార్యాలయ పరిసరాల్లో ఢిల్లీ పోలీసులు 144 సెక్షన్ విధించారు.కాగా బీజేపీ చేస్తున్న రాజకీయాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఆప్ అధినేత,ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు.

పలుకోణాల్లో విచారణ...

విచారణ సమయంలో మద్యం పాలసీ గురించి వివిధ కోణాల్లో సిసోడియాను సీబీఐ అధికారులు ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దినేశ్ అరోడా, ఇతర నిందితులతో గల సంబంధాలపై ఆరా తీశారు. వివిధ సందర్భాల్లో చేసిన ఫోన్ కాల్స్ గురించి అడిగినట్టు తెలుస్తోంది. అయితే, మనీశ్ సిసోడియా సమాధానాలతో సంతృప్తి చెందని సీబీఐ అధికారులు.. ఆయన విచారణకు సహకరించడం లేదనీ, కీలక అంశాల్లో ఆయన చెప్పిన సమాధానాలతో పొంతన కుదరకపోవడంతో అరెస్టు చేశామని చెబుతున్నారు. సిసోడియా నుంచి కీలకమైన సమాచారం రాబట్టాలంటే కస్టోడియల్ విచారణ అవసరమని అన్నారు.సోమవారం సిసోడియాను సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చనున్నది.

సిసోడియా ట్వీట్..

మరోవైపు సీబీఐ విచారణకు ముందు ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా చేసిన ట్వీట్ సంచలనంగా మారింది. "నేను ఈ రోజు సీబీఐ విచారణకు మరోసారి హాజరవుతున్నా. విచారణకు పూర్తిగా సహకరిస్తా. మరికొన్ని నెలలు జైలులోనే ఉండాల్సి వచ్చినా.. లెక్కచేయను. నేను భగత్‌సింగ్‌ను అనుసరించే వ్యక్తిని" అని పేర్కొన్నారు.

ఈ కేసులో సిసోడియాను సీబీఐ గతంలోనూ విచారించింది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో సిసోడియా హస్తం ఉన్నట్టు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో కేసు నమోదు చేసిన సీబీఐ దర్యాప్తు చేపట్టింది. సిసోడియా సన్నిహితుడైన విజయ్ నాయర్‌ను అరెస్టు చేసింది. ఆయనతో పాటు అభిషేక్ బోయినపల్లి, శరత్ చంద్రారెడ్డి, బినోయ్ బాబు, సమీర్ మహేంద్రు సహా ఏడుగురిని నిందితులుగా పేర్కొంటూ సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. అటు ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు కొనసాగిస్తోంది.

అరెస్టు ఊహించిందే..: ఆప్

మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను సీబీఐ అధికారులు కస్టడీలోకి తీసుకున్న కొద్ది నిమిషాల్లోనే ఆయన్ను అరెస్టు చేస్తారని తమకు తెలుసని ఆప్ పేర్కొంది. సీబీఐ పూర్తిగా కేంద్రం ఆదేశాల మేరకే పనిచేస్తోందని దుయ్యబట్టింది. మనీశ్‌ను అరెస్టు చేస్తారని తమకు ఎప్పటినుంచో తెలుసని ఆప్ ఎమ్మెల్యే సురభ్ భరద్వాజ్ అన్నారు. దర్యాప్తు సంస్థలు ఎలా పనిచేస్తాయో ముందే చెప్పగలిగే పరిస్థితులు ఉండటం విచారకరమన్నారు. సిసోడియా అరెస్టు నియంతత్వానికి పరాకాష్ఠగా ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అభివర్ణించారు. "మోడీజీ.. మీరు మంచి మనిషిని, గొప్ప విద్యాశాఖ మంత్రిని అరెస్టు చేయించడం మంచి పద్ధతి కాదు. దేవుడు కూడా మిమ్మల్ని క్షమించడు. ఏదో ఒకరోజు మీ నియంతృత్వం అంతమవుతుంది" అని విమర్శించారు.

ఇటలీ తీరంలో పడవ మునిగి 43 మంది మృతి

- ఆ మూడు దేశాలకు చెందిన శరణార్థులే.. ఇటలీ కోస్ట్‌గార్డ్స్

రోమ్ : ఇటలీ తీరానికి శరణార్థులతో వస్తున్న పడవ ఆదివారం తెల్లవారుజామున మునిగిపోవడంతో కొన్ని నెలల చిన్నారిసహా 43 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పడవలో ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్‌కు చెందిన శరణార్థులున్నారనీ, వారిలో 80 మందికిపైగా ప్రాణాలతో బయటపడ్డారు ఇటలీ కోస్ట్‌గార్డు అధికారులు తెలిపారు. 20 మీటర్ల పొడవున్న బోటులో తప్పనిసరి పరిస్థితుల్లో కిక్కిరిసి ప్రయాణించారు ఇటాలియన్ ప్రీమియర్ జార్జియా మెలోని పేర్కొన్నారు. అలల ఉధృతికి సముద్రంలోని బండరాళ్లను బోటు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బోటు మధ్యకు విరిగిపోవడంతో శరణార్థులు నీటిలో మునిగిపోయారు. క్రోటోన్ ప్రావిన్స్‌లోని కలాబ్రియా గ్రామం సముద్రతీర రిసార్ట్ అయిన స్టెకాటో డి కుట్రో ఒడ్డుకు కొట్టుకువచ్చిన 28 మృతదేహాలను అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ డైవర్లు వెలికితీశారు. ఈ బోటు ఎక్కడి నుంచి బయల్దేరిందో తెలియరాలేదు.

జునైద్, నసీర్ హత్యలకు వ్యతిరేకంగా హర్యానా, రాజస్థాన్‌ల్లో నిరసనలు

న్యూఢిల్లీ : గోగూండాల చేతిలో జునైద్, నసీర్ దారుణ హత్యలకు వ్యతిరేకంగా హర్యానా, రాజస్థాన్ నలుమూలల నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. జునైద్, నసీర్‌లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 24న హర్యానాలోని ఫిరోజ్‌పూర్ జిర్కా వద్ద వేలాది మంది ప్రదర్శన చేశారు. హర్యానా పోలీసులకు మెమోరాండం అందచేశారు. పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవడం, ప్రభుత్వ మద్దతు వంటి కారణాలతోనే ఇలాంటి హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. కొన్నేళ్లుగా భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ గూండాలు ముస్లిములను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగుతున్నారని విమర్శించారు. బస్సులు, టెంపోలపై జాతీయ జెండాలను ప్రదర్శిసూ.. 'జునైద్, నసీర్‌లకు న్యాయం చేయాలి' అని నినాదాలు చేశారు. గోగూండాలు చేసిన ఇతర హత్యలపైనా న్యాయ విచారణ జరిపించాలని, జునైద్, నసీర్ కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, ఇద్దరి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని మెమోరాండంలో డిమాండ్ చేశారు. గోగూండాలు అపహరించిన కారుపై విచారణ జరపాలని కోరారు. గోగూండాలు చేసిన ఇతర దాడుల్లోనూ ఈ కారును ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజస్థాన్‌లోని ఘట్మీకలో నిరసనలు కొనసాగుతున్నాయి. మృతులు జునైద్, నసీర్‌ల స్వగ్రామమైన ఇక్కడ ఒక టెంటులో గత రెండు వారాల నుంచి శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. 'పార్లమెంట్‌లో మా స్వరం వినిపిస్తారని కాంగ్రెస్‌కు ఓటు వేశాం. కానీ వారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? ఈ రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని నిశ్శబ్దంగా ఉండమంటుంది' అని గ్రామస్థులు విమర్శించారు. శాంతికి భంగం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ రాజస్థాన్ పోలీసులు ఈ ఆందోళనలకు నోటీసులు ఇచ్చారు. అయినా గ్రామస్థులు ఈ ఆందోళన కొనసాగిస్తున్నారు.

మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇక్కడి ముస్లిం ముసాఫిర్ఖానా వెలుపల రాజస్థాన్ ముస్లిం ఫోరమ్ సభ్యులు, ఇతర సంఘాలకు చెందిన వ్యక్తులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అంబేద్కర్ రైట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దశరథ్ హినునిమా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గోగూండాలపై చెప్పుకోదగ్గ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. గతంలో హత్యకు గురైన కన్హయ్యలాల్ కుటుంబానికి, ప్రస్తుత జునైద్, నాసిర్ కుటుంబాలకు మధ్య ప్రభుత్వం చూపిస్తున్న తేడాను విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీలో కూడా కొన్ని విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి.

భారత్‌లో డెన్మార్క్ యువరాజు పర్యటన

న్యూఢిల్లీ : డెన్మార్క్ యువరాజు ఫ్రెడెరిక్ ఆంద్రే హెన్రిక్ క్రిస్టియన్, యువరాణి మేరీ ఎలిజబెత్ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు చేరుకున్నారు. మార్చి 2 వరకు వారు భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తారని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ పర్యటన డెన్మార్క్-భారత్‌కు మధ్య స్నేహబంధం, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి దోహదపడుతుందని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి ట్విట్టర్ వేదికగా తెలిపారు. రెండు దశాబ్దాల తర్వాత తొలిసారి డెన్మార్క్ రాచకుటుంబం భారత్‌లో పర్యటిస్తోందని పేర్కొన్నారు. దీనిలో యువరాజు వెంట ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి లార్స్ లోకీ రస్ముస్సేన్, పర్యావరణ శాఖ మంత్రి మాగ్నస్ హ్యూనిక్, ఇంధన శాఖ మంత్రి లార్స్ అగార్డ్ కూడా ఉన్నారు. 'ఈ పర్యటనలో వీరు తొలుత ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధనకడ్‌తో భేటీ కానున్నారు. ఆ తర్వాత కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నిర్వహించే 'ఇండియా-డెన్మార్క్: పార్టనర్స్ ఫర్ గ్రీన్ అండ్ సస్టైనబుల్ ప్రోగ్రెస్' కార్యక్రమం ప్రారంభ సమావేశంలో పాల్గొంటారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోనూ సమావేశమవుతారు. ఆగ్రా, చెన్నైలో పర్యటించి.. మార్చి 2న తిరిగి డెన్మార్క్ బయలుదేరుతారు' అని విదేశాంగశాఖ అధికారులు తెలిపారు.

ప్రీతిని వేధించిన నిందితున్ని కఠినంగా శిక్షించాలి

- గిరిజన సంఘం అధ్యక్షులు ఎం ధర్మానాయక్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రీతిని వేధించిన నిందుతున్ని కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం అధ్యక్షులు ఎం ధర్మానాయక్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. ప్రీతి ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనీ, నిందుతుడిపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఆదివారం నిమ్స్ ఆస్పత్రిలో ప్రీతి కుటుంబాన్ని కలిశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ప్రీతికి మెరుగైన వైద్యం అందించాలనీ, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కాలేజీల్లో విద్యార్థులపై ర్యాగింగ్ చేసే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

వడ్డెరవృత్తిదారులకు రుణాలివ్వాలి

- వడ్డెర వృత్తిదారుల సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వడ్డెరవృత్తిదారులకు రుణాలివ్వాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఇడగొట్టి సాయిలు, పల్లపు.విఘ్నేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర వృత్తిదారుల బతుకులు నేటికీ బాగుపడలేదని పేర్కొన్నారు. పాలకులు వడ్డెర్ల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా వెనుకబడి ఉన్నారనీ, సమాజానికి దూరంగా బతుకుతున్నారని తెలిపారు. వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేదా? అని ప్రశ్నించారు. వారి అభివద్ధికి కేవలం మూడు కోట్ల రూపాయలిచ్చి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారుగా 4వేల సొసైటీలున్నప్పటికి వాటి ద్వారా ఒక్క పైసా ఖర్చు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డెర వృత్తిదారులు చనిపోతే కనీసం ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించడం లేదని తెలిపారు. అత్యంత వెనుకబడిన వృత్తిదారులకు వడ్డెర బంధును ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్ రూము ఇండ్లని ఇవ్వాలని కోరారు. రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలనీ, వడ్డెర వృత్తిదారులకు ప్రతి నియోజకవర్గంలో ఒక గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దండుగుల నరసింహులు, దండుగుల బాలయ్య, ఇ. కురుమయ్య, దండుగుల జంగయ్య ఈడగొట్టి చిన్నఓడ్డన్న, తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు

- మంత్రి కొప్పుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో నిర్మిస్తున్న 125 అడుగుల బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ట్యాంక్ బండ్ సమీపంలో 11.5 ఎకరాల్లో నిర్మితమవుతున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. విగ్రహానికి సంబంధించి 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. విగ్రహం చుట్టూ ఎలివేషన్, స్మృతివనం, సెంట్రల్ లైబ్రరీ, ఫౌంటెన్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయన్నారు. మార్చి చివరి నాటికి నిర్మాణం పనులు పూర్తి అవుతాయని తెలిపారు. ఏప్రిల్‌లో అంబేద్కర్ జన్మదిన వేడుకల సందర్భంగా విగ్రహాన్ని ప్రారంభించనున్నట్టు వెల్లడించారు.

టీడీపీ తెలుగు రాష్ట్రాలకు చారిత్రక అవసరం

- ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి
- మార్చి 29న టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : చంద్రబాబు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

తెలుగు జాతి చరిత్ర ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ చిరస్థాయిగా ప్రజల గుండెల్లో ఉంటుందని టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. టీడీపీ మనుగడ ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో చారిత్రక అవసరమన్నారు. తెలుగుదేశం తెలంగాణ కార్యాలయం ఎన్టీఆర్‌భవన్‌లో టీటీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమాన్ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. తెలుగువారిలో ఎన్టీఆర్ ఆత్మాభిమానం పెంచారనీ, దానికి ఆత్మవిశ్వాసం తోడైతే ప్రపంచాన్నే తెలుగువారు జయించవచ్చని మనమంతా ముందుకెళ్లామని అన్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రారంభించిన పార్టీ టీడీపీయేనన్నారు. హైదరాబాద్ సికింద్రాబాద్ లకు ధీటుగా మూడో నగరం సైబరాబాద్ నిర్మించాం, హైటెక్ సిటీ అభివద్ధి చేశాం. నాలెడ్జ్ హబ్‌గా రాష్ట్రాన్ని మార్చాం.. 20ఏండ్ల క్రితం మనం వేసిన పునాదులపైనే తెలంగాణ ఈనాడు అభివద్ధి పథంలో నడుస్తున్నది. సంస్కరణలకు నాంది పలికాం, ఎన్నో విధాలుగా ప్రోత్సాహకాలిచ్చాం.అప్పట్లో బయోటెక్నాలజీ అంటే అర్థం కాలేదు, ఈ రోజు అదే కరోనా వ్యాక్సిన్ తయారీకి వేదికైంది.. హైదరాబాద్‌లో హజ్ హౌజ్ కట్టాం, మైనార్టీ కార్పోరేషన్ పెట్టాం, వక్ఫ్ భూములు కాపాడాం, మత కలహాలు లేకుండా చేశాం, శాంతిభద్రతలు కాపాడాం.. అని ఆయన చెప్పారు. రాష్ట్ర విభజన జరిగిపోయింది, ఇక విమర్శలు అనవసరం.. 40 ఏండ్లుగా అభివద్ధి చేసుకున్నాం. ఇంకా అభివద్ధి ఎలా చేయాలా అనే ఆలోచించాలి. అంతే తప్ప పరస్పర విమర్శలతో కాలం వధా చేయడం అనవసరమని అభిప్రాయపడ్డారు. కాసాని జ్ఞానేశ్వర్ తెలంగాణ పార్టీ అధ్యక్షుడిగా అయ్యాక పార్టీ పరుగులు తీస్తున్నది. చిన్నచిన్న విభేదాలున్నా విమర్శించుకోవడం మంచిది కాదనీ, కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ నేతలను అధినేత చంద్రబాబు ఆదేశించారు. మొన్న నాయీ బ్రాహ్మణులకు తొలిసీటని ప్రకటించిన కాసాని నేడు రెండో సీటు ఇప్పుడు ప్రకటిస్తున్నాం, అది రజకులకే అన్నారు. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తేవడమే ఆ మహనీయుడు ఎన్టీఆర్‌కు మనం అందించే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ పునరంకితం కావాలని చంద్రబాబు పిలుపిచ్చారు. ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వడం భారతదేశానికే గర్వకారణం అంటూ, ఆయనకు భారతరత్న అవార్డు ఇవ్వాలన్న తెలుగువారి డిమాండ్ నెరవేర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మార్చి 29న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలను ఇక్కడే ఘనంగా నిర్వహిస్తున్నామనీ, పరేడ్ గ్రౌండ్లో కాసాని జ్ఞానేశ్వర్ భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నారనీ, దానిని పెద్దఎత్తున విజయవంతం చేయాలని చంద్రబాబు పార్టీ నాయకులను కోరారు.

మతోన్మాద బీజేపీని గద్దె దింపుతాం

పేదల సొమ్మును పెద్దలకు పంచుతున్న కేంద్రం

- దేశాన్ని ముక్కలు కాకుండా చూడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులది
- ప్రజాసమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 23 నుంచి జాతాలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ - గోదావరిఖని

మతోన్మాద, బడా పెట్టుబడిదారీ విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని రాబోవు ఎన్నికలలో గద్దెదింపుతామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఐ(ఎం) పెద్దపల్లి జిల్లా ప్లీనం సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏ.ముత్యంరావు, ఏ.మహేశ్వరి అధ్యక్షతన ఆదివారం గోదావరిఖని శ్రామిక భవన్‌లో నిర్వహించారు. ముందుగా జిల్లా కార్యదర్శి వై.యాకయ్య జెండావిష్కరణ చేశారు. అనంతరం తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నరేంద్రమోదీ నాయకత్వంలో మతోన్మాద, కార్పొరేట్ బడా పెట్టుబడిదారీ విధానాలను అతివేగంగా అమలుచేస్తోందన్నారు. దేశ సంపదను అదాని, అంబానీ లాంటి వారికి కట్టబెడుతుందని విమర్శించారు. పేదల సొమ్మును పెట్టుబడి దారులకు అప్పగిస్తోందన్నారు. లక్షల కోట్ల రూపాయలు సంపన్నులకు ఇస్తూ పేదలను దోపిడీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరుకు మాత్రమే లక్షల కోట్ల రూపాయల బడ్జెట్.. అందులో పేదల అభివృద్ధి కోసం కేటాయింపులు లేవని అన్నారు. కొన్ని రంగాలకు కేటాయింపులు తగ్గించేసి ఆ రంగాలను నిర్వీర్యం చేసే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మతం పేరుతో హిందూ రాష్ట్రాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో హిందు, ముస్లిం, క్రిస్టియన్ల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ చీలికలు తెచ్చే విదంగా ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. పాకిస్థాన్, చైనా దేశాలను చూపించి ఇక్కడి ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రావడానికి బీజేపీ నాయకులు ఎంత ఘోరానికైనా ఒడిగడుతారన్నారు. బీజేపీ, సంఘ్ పరివార్ లక్ష్యం కేంద్రంలో అధికారంలోకి రావడం మాత్రమే కాదని దేశాన్ని హిందూ రాష్ట్రంగా నిర్మించాలనేది వారి కోరిక అని అన్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులనే బీజేపీ శత్రువులుగా భావించి తప్పుడు ప్రచారం చేస్తుస్తోందని చెప్పారు. దేశాన్ని ముక్కలు చేయడమే వారి ముఖ్య ఉద్దేశమన్నారు. అందుకే దేశాన్ని ముక్కలు కానివ్వకుండా చూడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటీవల కాలంలో బీజేపీ తప్పుడు విధానాలను ఎండగడుతూ ముందుకు వెళ్తుందని తెలిపారు. ఈ విధానం ఇకపైనా కొనసాగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా రాష్ట్రంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలు పరిష్కరించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 23 నుంచి జాతాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ మతోన్మాద, పెట్టుబడిదారీ విధానాలను అవలంబిస్తుంటే.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కనీస వేతనాల జీఓలు విడుదల చేయకుండా ప్రయివేటు కంపెనీల యజమానుల కొమ్ము కాస్తూ వారికి లాభాలు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని మార్చి 6న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ఎం.రమాచారి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రూ.500కోట్ల పెట్టుబడులు

కోర్నింగ్, ఎస్‌జీడీ ఫార్మా సంస్థలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టనున్నట్టు కోర్నింగ్, ఎస్‌జీడీ ఫార్మా సంస్థలు ఆదివారం ప్రకటించాయి. రూ.500 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టేందుకు ఈ సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఫార్మాస్యూటికల్ ప్యాకేజింగ్ సామాగ్రి ఉత్పత్తిలో పెట్టుబడులు పెట్టనున్నాయి. బయో ఏషియా -2023 సదస్సులో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కె.తారక రామారావుతో సమావేశం అనంతరం విషయాన్ని ఫార్మా సంస్థలు ప్రకటించాయి. ప్రైమరీ ప్యాకేజింగ్ సరఫరా గొలుసును సురక్షితం చేయడం ద్వారా తెలంగాణలో ఫార్మా పరిశ్రమను బలోపేతం చేస్తామని ఎస్‌జీడీ ఫార్మా ఎండీ అక్షయ్ సింగ్ అన్నారు. సుమారు రూ.500కోట్లతో ఉద్దేశించిన ఈ ప్రాజెక్టుతో మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 150 మందికి ఉద్యోగాలు, 300 కంటే ఎక్కువ మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని వివరించారు. 2024లో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభిస్తామని, ఎస్‌ఈడీ ఫార్మా సహకారంతో తెలంగాణలో అడుగుపెడుతున్నందుకు సంతోషిస్తున్నామని కోర్నింగ్ సంస్థ ఎండీ సుధీర్ పిళ్లై పేర్కొన్నారు. ఫార్మాస్యూటికల్ ప్యాకేజింగ్ నాణ్యతను మెరుగుపరుస్తూనే కిష్టమైన ఔషధాల పంపిణీని వేగవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈఫార్చ్యూన్ 500 కంపెనీ అయిన కోర్నింగ్, ఎస్‌ఈడీ ఫార్మా ప్రపంచ స్థాయి ఫెసిలిటీని ఏర్పాటు చేయనుండటంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఫార్మాస్యూటికల్ సింగిల్ యూజ్ టెక్నాలజీలో సామర్థ్యాలను విస్తరించేందుకు తెలంగాణలో రూ.200 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు అమెరికాకు చెందిన ఫాక్స్ లైఫ్ సైన్సెస్ ప్రకటించింది. తక్కువ ఖర్చుతో కస్టమ్ మెడికల్, ఎస్‌యూటీ ఫార్మాలో వినియోగదారులకు మద్దతిచ్చేందుకు ప్రపంచ స్థాయి ఫెసిలిటీని అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామని ఫాక్స్ లైఫ్ సైన్సెస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఏక్నాథ్ కులకర్ణి పేర్కొన్నారు.

వైద్య పరికరాల కంపెనీల ప్రతినిధులతో మంత్రి...

బయో ఏషియా-2023 సందర్భంగా మంత్రి కేటీఆర్ వైద్య పరికరాల కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. వైద్య పరికరాల తయారీలో దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలవడమే తమ లక్ష్యమని తెలిపారు. పరిశ్రమలకు అనుకూలంగా విధానాలున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా యుకెలో హెడ్ క్వార్టర్స్ కలిగిన రియల్ ఎస్టేట్ సర్వీసెస్ సేవిల్స్ హైదరాబాద్ ది స్ప్రింట్ రిపోర్ట్‌ను విడుదల చేసింది. దీనిపై మంత్రి స్పందిస్తూ, ఈ రిపోర్టు వ్యాపార హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంలో ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని తెలుపుతున్నదని అన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

మోసాల బారిన పడొద్దు : గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలు మోసాల బారిన పడకుండా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ సూచించారు. ఆదివారం హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్ సిబ్బందికి నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవగాహనా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఎక్కడ పొదుపు చేసుకోవాలో తెలియకపోవడంతో తరచూ మోసపోతుంటామని హెచ్చరించారు. అవగాహన లేని వారిని మోసగాళ్లు గుర్తించి ఒక గ్రాము బంగారానికి 10 గ్రాముల బంగారం ఇస్తామంటూ రకరకాలుగా ప్రలోభపెడుతుంటారని తెలిపారు. ఇలాంటి వారికి దూరంగా భవిష్యత్ అవసరాల కోసం డబ్బును జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలని కోరారు. కరోనా, లాక్‌డౌన్ సందర్భాల్లో గ్రామీణ భారతదేశంలోని లక్షలాది కుటుంబాలను ఈ పొదుపు చేసుకునే అలవాటే బతికించిందని అభిప్రాయపడ్డారు. గతంలో పొదుపు చేసుకునేందుకు ఇబ్బందులుండేవని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆర్థికంగా ఐదో స్థానం నుంచి మూడో స్థానానికీ, అదే సమయంలో ఐదు ట్రిలియన్ల బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్నదని తెలిపారు. జీవితం ఒక సవాలంటూ, ఇబ్బందులెదురైనప్పుడు ముందుకెళ్లిన వారినే విజయం వరిస్తుందని చెప్పారు. పిల్లల జన్మదిన వేడుకలు, వివాహ మహోత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆశిస్తుంటారనీ, పిల్లల కోరికలు తీర్చేందుకు భవిష్యత్తులో ఇబ్బందులు పడకుండా బీమా కంపెనీలు కూడా వచ్చాయని తెలిపారు. గవర్నర్ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ మాట్లాడుతూ పదవీ విరమణ తర్వాత సౌకర్యంగా జీవిచేందుకు వీలుగా పొదుపునకు సంబంధించిన అవగాహన పెంచేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కుటుంబ ఆదాయం పెంచుకోవడం, విద్య, వైద్యం వంటి ప్రాధాన్యత కలిగిన వాటికే ఖర్చు చేస్తూ అనవసరమైన వాటికి ఖర్చులను తగ్గించుకోవడం తదితర అంశాలను శిక్షణలో తెలుసుకోగలుగుతారన్నారు. అదే సమయంలో పొదుపు చేయించుకునే వాటికి ఉన్న చట్టబద్ధత, పొదుపు చేసిన దానికి అధిక మొత్తంలో తిరిగి ఇచ్చే సంస్థలేవి? అనే వాటిపై అవసరమైన వారికి వ్యక్తిగతంగా కౌన్సిలింగ్ కూడా ఇస్తారని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ రీజినల్ హెడ్ సిద్ధార్థ్ చటర్జీ, సౌత్ జోన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సంపద సృష్టిలో కుటుంబాలను భాగస్వాములను చేసే లక్ష్యంతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పొదుపు, పెట్టుబడి, సంపద మధ్య తేడా తెలుసుకోవాలని సూచించారు. మూడు లక్షల మందికి అవగాహన కల్పించినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన గవర్నర్ తమిళిసై

- వైభవంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు
- హాజరైన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



నవతెలంగాణ-పటాన్‌చెరు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో శుక్రవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఉత్సవాల్లో తెలంగాణ, హర్యాన గవర్నర్లు తమిళిసై సౌందరరాజన్, బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. ఆదివారం ఉదయం పటాన్‌చెరులోని మహంకాళి ఆలయం నుంచి 72 బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మతల్లికి సమర్పించారు. గవర్నర్ తమిళిసై బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు సంధ్యా నందీశ్వర్ గౌడు రూ.25 లక్షలతో చేయించిన ఆభరణాలు అమ్మవారికి తొడిగించారు. గవర్నర్లు తమిళిసై, బండారు దత్తాత్రేయ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

త్వరలో 500 ఎలక్ట్రిక్ బస్సులు

శివార్లలో విద్యార్థుల కోసం అదనంగా 100 ట్రిప్పులు

- విద్యార్థినుల కోసం ప్రత్యేక బస్సులు : టీఎస్ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్ వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ శివారు ప్రాంతాలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం అదనంగా వంద ట్రిప్పులు ఆర్టీసీ బస్సుల్ని నడుపుతామని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్‌డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. దీనికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యే లోపు హైదరాబాద్ సిటీలోకి 500 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్ని ప్రవేశపెడతామన్నారు. ఆదివారంనాడాయన టీఎస్ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ అధికారులతో బస్‌భవన్‌లో సమావేశం అయ్యారు. శివారు ప్రాంతాల్లో విద్యార్థుల రద్దీ, ఏర్పాటు చేస్తున్న బస్సుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, సామాజిక బాధ్యతగా విద్యార్థుల రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శివారు ప్రాంతాలను 12 కారిడార్‌లుగా విభజించి 350 వరకు బస్సులను నడుపుతున్నామనీ, ఇబ్రహీంపట్నం క్లస్టర్‌లో విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉందనే విషయం సంస్థ దష్టికి వచ్చిందని తెలిపారు. "ఆ కారిడార్‌లోని కాలేజీలకు దాదాపు 44 వేల మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. వారిలో 3వ వంతు బస్‌పాస్‌లు తీసుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అందుకు అనుగుణంగా వారంరోజులుగా 8 ట్రిప్పులను అదనంగా నడుపుతున్నాం. రద్దీ ఎక్కువగా ఉంటే మరిన్ని బస్సులను నడిపేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం." అని తెలిపారు. ఇబ్రహీంపట్నం కారిడార్‌లో అదనంగా 30 ట్రిప్పులు నడపాలని ఆదేశించారు. విద్యార్థినుల కోసం ప్రత్యేక బస్సులను హైదరాబాద్ శివారు విద్యాసంస్థల వరకు ఏర్పాటు చేయాలని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామనీ,. త్వరలోనే అవి అందుబాటులోకి వస్తాయని చెప్పారు. విద్యార్థులు పుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని, ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని కోరారు. సమావేశంలో టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్స్) పీవీ మునిశేఖర్, సీపీఎం కష్ణకాంత్, సీటీఎం జీవనప్రసాద్, చీఫ్ ఇంజనీర్ (ఐటీ) రాజశేఖర్, హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్ఎంలు వరప్రసాద్, వెంకన్న పాల్గొన్నారు.

జీవో 51ని రద్దు చేయాలి

- గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య
- రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో కొనసాగిన పాదయాత్ర



నవతెలంగాణ-మహేశ్వరం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 51ని రద్దు చేసి, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన పాలకుర్తిలో ప్రారంభమైన పాదయాత్ర ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో కొనసాగింది. మహేశ్వరం మండల కేంద్రం నుంచి సిరిగిపురం మీదుగా హర్షగూడ నుంచి తుక్కుగూడ మున్సిపాలిటీకి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో చాగంటి వెంకటయ్య మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఏండ్లుగా తక్కువ వేతనాలకు పనిచేస్తున్నా వారి వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్‌లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 28న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. పాదయాత్ర 311 కిలో మీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సీఐటీయూ మహేశ్వరం కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కర్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు, వర్కింగ్ ప్రెసిడెంట్ గణపతిరెడ్డి, మహేష్, వినోద్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, సోమయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎస్.రాజు, జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ జి.కవిత, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, రుద్రకుమార్, అల్లి దేవేందర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరి పురస్కారాలు విశిష్టమైనవి



నవతెలంగాణ-కల్చరల్

కొలకలూరి పురస్కారాల ప్రధానోత్సవ సభ ఆదివారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో జరిగాయి. కొలకలూరి మధుజ్యోతి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య టి కిషన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారాలు నాలుగు విశ్వవిద్యాలయాలు ఇస్తున్న గొప్ప పురస్కారాలుగా భావించాలన్నారు. కొలకలూరి భగీరథీ కవితా పురస్కారాన్ని యార్లగడ్డ రాఘవేంద్ర (పచ్చికడుపు వాసన), కె. ఆనందాచారి (ఇక ఇప్పుడు), కొలకలూరి విశ్రాంతమ్మ నాటిక పురస్కారాన్ని ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ (ఆకెళ్ళ నాటికలు), కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారాన్ని ఎం.దేవేంద్ర (తెలంగాణ కథ- వర్తమాన జీవన చిత్రణ), ఎ.ఎ.నాగేంద్ర (రాచపాలెం సాహిత్య విమర్శ - సమగ్ర పరిశీలన) స్వీకరించారు. పురస్కారాల కింద ఒక్కొక్కరికి రూ.15 వేలు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేసి స్వీకర్తలను సత్కరించారు.

అంతా బాగానే వుంది....

అంతా బాగానే వుంది -
గాయపడటానికి ఈ దేహం నాది కాదు
కోల్పోవడానికి ఈ సంపద నాది కాదు
గుప్పిట్లో పట్టుకున్న క్షణాలు
జ్ఞాపకాలుగా జారిపోతుంటాయి
నువ్వు నేను, నీది నాది అనుకున్నవన్నీ
కన్నీటి చుక్కలుగా ఆవిరై పోతుంటాయి
అన్నీవుండి అంగ వస్త్రాలు కనుమరుగై
మరుగున వున్న నగ్నత్వం ఎదురుపడినపుడు
అంతా సహజంగానే వున్నట్టనిపిస్తుంది !
చూపుకు దూరమైన క్షణాన అల్లికలు
మరిచి పోవడం సహజమే
చూపు దూరమైన క్షణాన దగ్గరితనం
మరుపు రావడం సహజమే
సహజత్వాలు సహజంగా వుండడం కూడా బాగానే వుంది
అసహజత్వాల గుంపులో సహజత్వం
కాటగలిసిపోవడం కూడా సహజమే..
అంతా బాగానే వుంది
నాదనుకున్న నేల మరుభూమికి మారి నాదవుతున్నందుకు
అస్తిత్వాలకు వారసత్వాలు దారులు వేసి
మరలుతున్నందుకు - బాగానే వుంది
విలాసాలు నావనుకున్నప్పుడు విలాపాలు
స్వంతమవుతుంటాయి
స్వంతమనుకున్న నావి పరాయీకరణంగా
రూపుదాల్చుతూ వుంటాయి
ఐనా, నేను నేను గానే వున్నాను; నువ్వు నువ్వుగానే వుండు
సమయానికనువుగా పిలుపులో స్వరం మారినా,
నా పాత పేరులోనే తియ్యదనం వుంది
కొత్త బంధాలు వెలుగుతూ ఉద్వేగపరిచినా,
సంధ్యా సమయంలో కాంతిని కోల్పోతూ వుంటాయి
పచ్చని నారుమడి నుండి బీడు భూమిలోకి
నెట్టివేయబడుతున్నా -
అన్నీ సహజంగానే వున్నట్టు
భ్రమలు ఆవహిస్తూ వుంటాయి
ఐనా బాగానే వుంది .. అంతా బాగానే వుంది
ప్రయాణంలో చిట్టచివరి క్షణం
శిథిలాలై మిగిలిన పురాస్మృతులతో సమాధిలోకి వెళ్లడం
చాలా చాలా బాగానే వుంది

- డా. రూప్ కుమార్ డబ్బీకార్, 91778 57389

కూలుతున్నది చరిత్రే

ఎత్తైన
ఆ భూరుహాల నీడల దాపున్నే
నిద్ర-

మృదువైన
ఆ పూల బాసల ఎద మీదనే
తూనీగల వేడిముచ్చట్లు-

సొగసైన
ఆ కలలపున్నమి తలాపున్నే
ఎర్రకవాతు-

నడవాల్సిన ప్రాగ్దిశను మోస్తూ
సుతారమైన ఆ గాలి లయల్లోనే లోయల్లోనే
ఉరిమిన వసంత మేఘం-

ఒకరిద్దరం కాదు
వందలు వేలు
చేతుల్లో జెండాలతో
ఛాతీ మీద ఆశయాలతో
గొంతు నిండా నినాదాలతో
కర్కశత్వాన్ని
అశ్రుం చేసే
అమరత్వం సాధించే పొలిమేర చేరుకున్నాం
మనుషుల పటం రూపుదాల్చిందిక్కడే-

అనుకున్నట్టే తెల్లవారేది
పంచుకున్నట్టే
ఎవరి పౌరుషాన్ని
వాళ్ల భుజాలకెత్తుకున్నాం
ఎవరి కర్తవ్యాల్ని
వాళ్ల వీపున వేసుకున్నాం-

ఒక్కో బృందం
ఒక్కో దిక్తటికి
ఒక్కో ఆవేశం
ఒక్కో కాంతి సంవత్సానికి
అప్పుడు చూడాలి
వెనుక నుంచో ముందు నుంచో
పక్కల నుంచో పైనుంచో వేకువ
అంచునుంచో
'వాళ్ల గెలుస్తున్నారు'అనే
ధీర తటిల్లతాంత వాక్యం
ప్రతి నాలుక మీదా
ప్రకృతి నుదురు మీదా
జాగృత లిపి-

పొద్దు నెత్తిమీదుంది
ఎక్కడా ఏదీ గురి తప్పకుండా గతి
మారకుండా
కోటను ఎక్కాం
కొమ్ముగొట్టాం-

మాపుకు ముందో మహత్తర సన్నివేశం
అంతఃపురం తలుపులు బార్లా
తెరచుకున్నాయి
అహంకారం శీర్షాసనం వేసింది
దురాగతం గుండె వ్రయ్యలయ్యింది
చరిత్రకు కొత్త పుటను కుట్టింది కలం
కళలకు గజ్జెకట్టాయి ఊర్లు-

వెనుకట ఎప్పుడో చార్వాకుల కాలం నాడు
కాలిబాటలో పురుడు పోసుకున్న
నెత్తుటిపాట
బడిపిల్లలకో నెమలీక అయ్యింది
ఆ ఊరేగింపుతో
భూమి
సామాన్యుడి చుట్టూ తిరగడం మొదలైంది-

మా తాత చెప్పిన
ఈ ఒక్క కతే ఇంత బాగుంటే
ఇంకెన్ని కతలు
చెట్ల కింద తపస్సులో కూర్చున్నవో-

అభివృద్ధి మాట అటుంచితే
చెట్లను కూలుస్తుంటే
నాకెందుకో
చరిత్రను కూలుస్తున్నట్టే అనిపిస్తుంది.


- డా.బెల్లి యాదయ్య, 9848392690

పాద స్పర్శ

మా తాత తరం సదువుకోలే
ఆ పాదాల స్పర్శ కోసం
పడిగాపులు కాసి కాసి
తన ముచ్చట తీర్చుకునే
మా అయ్య తరం కాసింత సదివినా
పాదాల మర్మము పసిగట్టినా
నిజం సెప్పే దమ్ము లేక వాటి
స్పర్శ కోసం పాకులాడుతుండే
సదువుకున్న ఇగురం ఈతరానికున్న
పాపపు పాదాల చెంతకు చేరకున్నా
రంగులు మార్చే పాదాల పోకడకు
పోటెత్తుతున్న మంద గుంపును చూసి
అవసరమో లేక అవకాశ బలహీనమో
ఈ తరాన్ని అయస్కాంతములా
ఆ పాదాల చెంతకు లాగుతాయెమో
నరనరాల్లో బానిస భావం నింపుకున్న
నేటి తరాన్ని కిందేసి తొక్కడానికి
ఆ పాదాలకు పట్టేది ఎంత సేపు ?
పాద స్పర్శ కు రాయి మనిషిగా
మారింది నాటి చరిత్ర అయితే
ఈ పాద స్పర్శ కై మనిషి రాయిగా
మిగలడం నేటి వాస్తవ చరిత్ర.

- దుర్గమ్ భైతి, 9959007914

మూలంకన్నా అనువాదం గొప్పగా ఉండొచ్చా?



మూలం కన్నా అనువాదం గొప్పగా ఉండటం మంచి దేనా? అనువాదకునికి వచ్చే ప్రశంసలలో, అనువాదం అనువాదంలా లేదు మూలంలాగానే ఉంది అనేది అత్యంత సంతృప్తికరమైనది. మూలంలోని ఆత్మ (spirit) అనువాదంలో ప్రతిబింబిత మైంది. అనువాదం చాలా సాఫీగా హాయిగా సాగింది. అనువాదం గొప్ప గా ఉంది... మొదలైనవి కూడా అనువాదకునికి ఆనందాన్నిచ్చే ప్రశంసలే. నిజా నికి ఈ మూడింటిలోని సారాంశం మొదటిదైన 'అనువాదంలాగా లేదు' అనే వ్యాఖ్య కు చాలా వరకు వర్తిస్తుంది. ఇక అనువాదం మూలం కన్నా గొప్పగా ఉంది అనే ప్రశంసకు అనువాదకులు పొంగిపోతారు. కానీ నిజా నికి అది అనుచితమైన లేదా దోషభూయిష్ఠమైన (improper or defective) అనువాదాన్ని సూచిస్తుంది. కాబట్టి, వాస్తవానికి అటువంటి వ్యాఖ్య అనువాద కుడిని చింతింపజేయాలి!

మూలం ఏ స్థాయిలో ఉంటే అనువాదం అదే స్థాయిలో ఉండటం (అంటే అంతే గొప్ప గా ఉండటం) అవసరం. కొంచెం అటుయిటుగా ఉంటే ఫరవాలేదు కాని, ఒక ఔత్సాహిక (amateur) కవి రాసిన దాన్ని చేయి తిరిగిన సుప్రతిష్ఠిత కవి రచన స్థాయికి తీసుకువెళ్లే విధంగా అనువదించకూడదు. స్వర్గీయ నోముల సత్యనారాయణ ఈ వ్యాస రచయితతో "మీరు మూలం కన్నా బాగా అనువదిస్తున్నారు. అది మంచి విషయం కాదు" అని రెండు మూడుసార్లు చెప్పారు. మరొక పేరు మోసిన అనువాదకుడు కూడా ఒక జూమ్ మీటింగ్‌లో అనువాదకులం దరినీ ఉద్దేశిస్తూ ఇదే మాట అన్నారు. వీరిద్దరి ఉద్దేశంతో నేను ఏకీభవిస్తున్నాను.


ఇక్కడ శీర్షిక నుంచి కొంచెం పక్కకు జరిగి, అనువాదం గురించి సాహితీపరులలో ఉండే ఒక అభిప్రాయాన్ని క్లుప్తంగా చర్చించాలనుకుంటున్నాను. అదేమిటంటే, వచనాన్ని అనువదించడం కంటె కవిత్వాన్ని అనువదించడం కష్టమైన పని అని అంటుంటారు చాలా మంది. జనరల్‌గా చూస్తే ఈ వ్యాఖ్య సరైనదే. కవిత్వంలోని భావ సౌకుమార్యాన్ని, భావోద్వేగాన్ని, భావశబ్లతను తర్జుమా చేయడం అంత సులభంకాదు. పైగా మూలకవి తాలూకు మూడ్‌ను, టోన్‌ను, స్టైల్‌ను(శైలిని) లక్ష్యభాషలోకి కచ్చితత్వంతో తీసుకుపోవాలి. ఇది సులభమైన విషయం కాదు. ఎందుకంటే, కవితా పంక్తులు సంపూర్ణ వాక్యాలు కావు. వాటిలో కొన్ని సార్లు కర్త, కర్మ లేదా మరి కొన్ని భాషాంగాలు ఉండకపోవచ్చు. నిజానికి ఈ అంశమే కవిత్వానికి శోభను చేకూరుస్తుందని చెప్పవచ్చు. కవితా పంక్తి సంపూర్ణ వాక్యం కాకపోవడమనేది వ్యాకరణ పరంగా అనువాదాన్ని సులభతరం చేస్తుంది. కానీ దీనికి విరుద్ధంగా, వచనంలో ఉండే సంపూర్ణ వాక్యాలు వ్యాకరణపరమైన కచ్చితత్వాన్ని డిమాండ్ చేస్తాయి. దాన్ని వంద శాతం కరెక్టుగా నెరవేర్చడం సులభం కాదు. లక్ష్య భాష అనువాదకుని మాతృభాష కానప్పుడు ఈ ఇబ్బంది మరింత ఎక్కువగా ఉంటుంది. దీనికి ఉదాహరణలుగా ఎన్నో సూక్ష్మాంశాలను చూపవచ్చు. At - in; ago - back; each - every; that - which; talk to - talk with; from - since - for; agree to - agree with; every day - everyday; so - hence - therefore; alright - all right; already - all ready; overwhelmed by - overwhelmed with; tired of - tired with; came by - came on - came in; send by - send through; sometime - some time - sometimes... వీటిలో ఏది సందర్భం ప్రకారం సరైనదో చెక్ చేసుకోవాలి. ఇట్లాంటివి వందకు పైగానే ఉంటాయి! ఏదో ఒక పదాన్ని పెట్టి రాస్తే వచనంలో వంద శాతం కచ్చితత్వం రాదు. ఈ సమస్య కవిత్వానువాదంలో అంతే తీవ్రంగా ఉండదు. కారణం మళ్లీ అదే. కవితా పంక్తులు సంపూర్ణ వాక్యాలు కాకపోవడం. దీనికి తోడు ఆంగ్ల కవిత్వంలో వ్యాకరణ దోషాలను వచనంలోని దోషాలను తీసుకున్నంత సీరియస్‌గా తీసుకోరు విమర్శకులు. అనువాదకుడు కూడా కవి అయి వుంటే అతనికి కవిత్వానువాదంలో ఇబ్బంది కొంచెం తక్కువగా ఉండే అవకాశముంది. వ్యాకరణపరమైన కచ్చితత్వాన్ని కవిత్వంలో కన్న వచనంలోనే ఎక్కువ ముఖ్యమైనదిగా భావిస్తారు ఆంగ్లభాషలో. కవిత్వంలో సౌందర్యాన్ని సాధించడం కోసం సంక్షిప్తీకరణ (abridgement or shortening) అవసరం కనుక - అంటే పంక్తులు సాధ్యమైనంత తక్కువ నిడివిని కలిగి ఉండాలి కనుక - వ్యాకరణాన్ని వచన రచనలో పట్టించుకున్నంతగా కవితా రచనలో పట్టించుకోరు. ఉదాహరణకు ఒక కవితా పంక్తిలో ఒకే రకానికి చెందిన నామవాచకాలు గానీ విశేషణాలు గానీ వరుసగా వస్తే, చివరి పదానికి ముందు and పెట్టకపోయినా దాన్ని సీరియస్‌గా తీసుకోరు. ఈ కవితా పంక్తిని పరిశీలించండి: He was angry, upset, sad. కానీ దీన్నే వచనంలో రాసినప్పుడు లేదా అనువాదంగా పొందుపరచినప్పుడు, upset తర్వాత కామా, and తప్పక రాయాల్సిందే. రాయకపోతే అది భాషాదోషం కిందికి వస్తుంది. అదే విధంగా articles ను ముఖ్యంగా The ని (దీన్ని బ్రిటీష్ ఇంగ్లిష్ ప్రకారం definitive article అనీ, అమెరికన్ ఇంగ్లిష్ ప్రకారం definite article అనీ అంటారు) కవితలో కచ్చితంగా



ఎలనాగ

పాటించాల్సిన అవసరం లేదు. సందర్భాన్ని బట్టి కొన్నిసార్లు దాన్ని/వాటిని మానుకోవచ్చు. కానీ వచనంలో మాత్రం తప్పక రాయాలి. ఆంగ్ల భాషలో The వాడకం అన్నింటికన్న కష్టమైనది. దీని గురించి సి.పి.బ్రౌన్, "తెలుగు ప్రాంతంలో The ని ఎక్కడ వాడాలో ఎక్కడ వాడకూడదో పదివేల మందిలో ఒక్కరికి కూడా సరిగ్గా తెలియదు" అన్నాడు. ఇది ఈ వ్యాసరచయిత విషయంలో సైతం వాస్తవం. ఆయన అలా అన్నందుకు మనం ఉడుక్కోవాల్సిన అవసరం లేదు!

ఇంకొక చర్చనీయమైన విషయాన్ని ప్రస్తావిస్తాను. అదేమిటంటే, కొన్ని రచనలు అనువాదానికి లొంగవు అనే అభిప్రాయం. దీన్ని మొన్నమొన్నటి దాకా ఎక్కువ మంది ఖండించలేదు. కానీ ఇప్పుడు ఖండిస్తున్నారు. అనువాదకునికి సత్తా ఉంటే ఏ రచననైనా చాలా వరకు సంతృప్తికరంగా అనువదించవచ్చు అనే అభిప్రాయం రోజురోజుకు మరింతగా బలాన్ని పుంజుకుంటోంది. జేమ్స్ జాయిస్ ఇంగ్లిష్‌లో రాసిన Ulysses నవల చైతన్య స్రవంతి (Stream of Consciousness) శిల్పంలో ఉంది. దీన్ని అనువదించడం కష్టం. కానీ ఈ నవల ఫ్రెంచ్, చైనీస్ మొదలైన ఎన్నో భాషలలోకి అనూదితమైంది. మరి అది ఎలా సాధ్యమైంది? ఈ మధ్యనే అంతర్జాతీయ బుకర్ ప్రైజ్‌ను పొందిన గీతాంజలి శ్రీ నవల రేత్ సమాధి. దీన్ని ఇంగ్లండుకు చెందిన Daisy Rockwell ఆంగ్లంలోకి అనువదించారు. అప్పట్నుంచి అనువాదం గురించిన చర్చలు ఇంటర్నెట్‌లో పుంఖానుపుంఖంగా వెలువడు తున్నాయి. రేత్ సమాధిలో కూడా భాష అక్కడక్కడ కొరకరాని కొయ్యగా ఉన్నదనీ, అయినా మూల రచ యిత్రితో సంప్రదింపులు జరుపుతూ దాన్ని చాలా వరకు సంతృప్తికరంగా అనువదించాననీ చెప్పారు అను వాదకురాలు. కాబట్టి అనువాదకునికి తగినంత ప్రతిభ, సామర్థ్యం ఉంటే, కొన్ని రచనలు అనువాదానికి లొంగవు అనే అభిప్రాయం వీగిపోతుంది, అంటున్నారు. ఇది వాస్తవమే అనిపిస్తున్నది. అనువాదం గొప్పగా ఉండాలంటే ముందు భాష మీద మంచి పట్టు ఉండటం చాలా అవసరం. స్వంత (అనువాదాలు కానటువంటి) రచనల్లో భాషాపరమైన కచ్చితత్వం ఉంటేనే అనువాదాల్లో కూడా accuracy సిద్ధిస్తుంది.



కవన వెన్నెల కల

- డా. నాళేశ్వరం శంకరం, 9440451960

ఎవరూ ఎవరికి సహకరించరు గానీ
ఎవరికి వారు సహకరించే వాళ్ళను సమకూర్చుకుంటారు.
తన లోపని దాన్ని వాళ్ళతో పంచుకునేట్లు ప్రవర్తిస్తారుగానీ
లోపలి దానికి వెలుపలి ప్రతినిధులుగా మారుతారు
అన్ని విధాల శాయశక్తులా
వాళ్ళ వాళ్ళ భావనా బంట్రోతులై పోతారు
కొంతకాలం వాళ్ళని స్నేహితులంటారు గానీ
తర్వాత తర్వాత శిష్యులై పోతారు
ఆ తర్వాతే ప్రియశిష్యులుగా రూపమెత్తుతారు

ఈ తొమ్మిది పాదాలు చాలు ముప్పా శ్రీనివాసరావు కవిత్వానికి ఎంతటి క్యాన్వాస్ ఉందో తెలుస్తుంది. కవిత్వం అంటే పదాడంబరం కాద. అలంకారాలు, ప్రతీకలు కాదు. కవిత్వంలో కవిత్వం ఏతాత్వికతను విప్పి చెబుతుందో అదే కవిత్వం. ముప్పా అచేతనుడు కాదు. శ్రీరంగం శ్రీనివాసరావు నుంచి ముప్పా శ్రీనివాసరావు రూపుదిద్దుకున్న కవి. డొంక తిరుగుడు లేని కవి. నిబద్ధంగా మొదలైన కవి. లోలోపల భావోద్విగ్న బలం ఉండబట్టే గొప్పగా గెటాన్ అవుతున్నాడు. లోపలి కవితా ప్రపంచాన్ని సువిశాలం చేసుకోదగిన సృజనాత్మకత ఔన్నత్యాన్ని విస్తారంగా పెంచుకుంటూ వస్తున్నాడు. చాలా ఏళ్ల క్రితం దేవిప్రియ వెంట రమ్మంటే శమ్మం వెళ్లాను. ఆ రోజు తొలిసారిగా ముప్పా శ్రీనివాసరావును చూసాను. నాకు ఖమ్మమంటే ఒక అఫ్సర్ ఒక సీతారాం. ఒక ప్రసేన్ తప్ప మరొకరు తెలియదు. ముప్పా నేటికి వారితోనే కాదు అనేక కవులతో విస్తరిస్తూ వచ్చాడు. ముప్పా కవిత్వం తప్ప ఆయన పెద్దగా తెలిసిన వాణ్ణి కాదు. నేటికి కూడా ఆయన కవన కళతో ఉన్న బంధమే ఎక్కువ. ఆయనకు ఎన్ని బంధాలు సాహిత్య వారసులతో ఉన్నాయో తెలియదు.

చలం, శ్రీశ్రీ ఉద్యమాలు ఎన్ని విస్తరించినా విశ్వనాథ కాలం తిరగబడుతూనే ఉంది. కుబుసం విడిచిన సహస్రఫణ్‌గా రూపొందుతుంది కదా! అగ్రరాజ్యాల ధనసర్పం దానికి తోడవుతుంది కదా! ఈ సంక్షిప్త, సంక్షుభిత పరిస్థితిని తనదైన నిఘా గుణంతో వ్యంగ్యంగా అధిక్షేపిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

అప్రమత్తంగా ఉందాం
అందిన కాడికి ఏసుకుందాం
పేరు పాలకులకు
పెత్తనం మాత్రం ఎల్లవేళలా మనకే
విముక్తి వియ్యంకులు అయితీరాలి

ప్రపంచమంతా విస్తరించిన ధనధిపత్య క్రూరత్వాన్ని ఎత్తి చూపడంలో బలమైన వ్యంగ్యం ఉంది. ముప్పా ఇంటి పేరు వ్యంగ్యం కావచ్చు. పానుగంటి సాక్షి సంపుటాలను నమిలి జీర్ణం చేసుకున్న కవి కావచ్చు.

శ్రీనివాస్ ఒకే విధమైన కవిత్వం రాయడు. అరసం, విరసం, స్త్రీవాద, దళిత వాద, బహుజనవాద రంగులన్నీ ఆయన కవిత్వంలో ప్రకాశవంతంగా అగుపిస్తాయి. ఆయనలో కవిత్వం మొక్కలా చిగురిస్తుంది. మారాకులు వేస్తుంది. కాలం వెంట నడుస్తుంది. మనుగడ సాగిస్తుంది. సముద్రంలోని అలలు కొన్ని తన అంతర్భాగంలో తల దాచుకుంటాయి గానీ మరికొన్ని నేలను ముద్దాడి అదృశ్యమవుతాయి గానీ మనలో ఎప్పటికప్పుడు దృశ్యమానమవుతున్నట్లే ముప్పా కవిత్వం ఉంటుంది. కొన్ని అలలు - ఒడిసి పట్టుకుని సంభాషణ కవిత్వంలో దర్శనమిస్తాయి. ఆ దర్శనమిచ్చే కవిత్వంలోని కొన్ని కొన్ని పాదాలు మనలో సరికొత్త భావనకు స్ఫూర్తినిస్తాయి.

రెండు చేతులతో శ్రామికులు ఏకమైతే తప్ప పనితనపు నైపుణ్యం ప్రపంచానికి తెలియదు. శ్రమ సౌందర్య పూల పరిమళ గాలిలో ప్రపంచం నడవాలి కదా! "మనిషిని మనిషిగా మార్చేయ్యడానికి ఎవరైనా నాలుగు కవితా వాక్యాలు ఇస్తారా" అని అడుగుతాడు కవి. ఆయనను మనిషిని మనిషిగా మార్చే కవన గుళికలు ఉన్న కవిగా నేను తప్పక చెబుతాను. సగం పూరు నిద్రపోకుండా పైశాచిక భాషని అనువదిస్తున్నదన్న స్పృహ కవికి ఉండబట్టే రైతు సేద్యగుణం ఆయన కవన సేద్యానికి ఉంది. చాలా కవితలు ప్రజలెత్తిన బోనంలాగే ఉన్నాయి. కాలం కన్నీళ్లు ఒక రకంగా లేవు. దొంగ కన్నీళ్ళే అందరి ప్రశంసలు పొందుతున్న కాలం కదా! సగటు మనిషి కన్నీళ్ళను గ్లోబల్ గ్రామం చూరుకింద కుంభవృష్టిలా కురుస్తున్నా పట్టించుకోని యాంత్రికతను బద్దలుకొట్టే చింతబరిగెల్లాంటి కవితా విల్లంబులు ఆయన దగ్గర ఉన్నాయి. పోగొట్టుకున్న దాన్ని గుర్తించడంలోనే కాదు పొందుతున్న దాంట్లో ఏది సున్నితమైందో సువిశాలమైందో చూపుతాడు.

శ్రీనివాస్ కవితలు నన్నెందుకో ప్రేమతో పలకరిస్తాయి. బాల్యం అక్కున చేర్చుకుంటుంది, సరళీకరణ ఆర్థిక విధానాల వల్ల విధ్వంసమవుతున్న జీవితం ఆలింగనం చేసుకుంటుంది. ఆయన కవిత్వంలో ప్రజా వ్యవస్థ ఉంది. దాన్ని దిగమింగే వ్యవస్థ ఉంది. బాధ్యతా రాహిత్యంగా దిగమింగే వ్యవస్థ విధ్వంసాన్ని ఎత్తిచూపడంలోని సృజనాత్మక భావోద్విగ్నత పాఠకుని హృదయానికి విడమరిచి చెబుతుంది. సంపన్నుల కాలుష్య భూతాన్ని ఎందెందు ఎంత వుందో విడమరిచి చూపుతుంది. గతం మీది కన్నా వర్తమానం మీదే దాని అమానవీయతను సంఘటనలు సంఘటనలుగా సందర్భాలు సందర్భాలుగా కథనం చేయడం వల్ల పాఠకుని హృదయం జూలు దులుపుతుంది.



శ్రీనివాస్‌కు కవిత్వం తెలుసు. యాక్టివిస్టుగా జీవించాల్సిన తత్వం తెలుసు. ఆవేశాల మిశ్రమంలోంచే సహజ రంగుల్ని వెతుక్కునే బుద్ధినీ హృదయాన్ని తాత్త్విక గుణానుభూతిని వెతుక్కునే స్వభావాన్ని మనలో నింపాలన్న ఆయన ప్రయత్నం నాకెందుకో నచ్చింది. భావానుభవ అమృతాన్ని రోజూ సేవించే ఛాయ్‌లాగా ఆయన కవితతు తాపుతాయి. వెలుగుల మెత్తదనం అల్లుకుపోతుంది. కొన్ని కొన్ని పద విరుపులు నాకు అర్థంకాలేదు గానీ కొన్ని కొన్ని ద్రవీభూతం చేశాయి. కవి తనకేమీ తెలియనట్టు రాస్తాడు గానీ ఏదో నేర్చుకోమన్నట్టుగానే నేర్పుతుంది ఆయన కవిత్వం. ముప్పా కవితలు కొన్ని సాగదీసినట్లు కాసేపు అనిపిస్తుంది కానీ ఏదో భావజాల శక్తేదో పరిపూర్ణత వైపు నడుపుతుంది. రంగనాయకమ్మ శైలిలోని సాగదీసే తత్వం శ్రీనివాస్ కవిత్వంలో ఉందేమో మనసుపెట్టి పట్టుకుంటే మంచిది. సాధారణ పాఠకునికి సాగదీసే క్యాన్వాస్ అవసరమేమో గుర్తించాలి.

ముప్పా రాసిన దయ్యాల మాణిక్యమ్మ ముసలమ్మ మరణం రాసిన కట్టమంచి గుర్తుకువచ్చాడు. అలా జ్ఞాపకం రావడం వల్లే ఆనుకుంట నేను మాణిక్యమ్మ పనితనంలో ఈదగలిగాను. కుందుర్తి, శీలా వీర్రాజు వచన కథా కావ్యాలగుణం శ్రీనివాస్‌లో ఎగిరి గంతేసినట్లుంది. బీజప్రాయమైన కథను తీసుకుని ప్రబంధ కవులు వర్ణనలు చేసినట్లే మాణిక్యమ్మ లేదు గానీ శ్రీశ్రీ భిక్షువర్షీయసి లాగా ఉందనిపిస్తుంది. మాణిక్యమ్మ గురజాడ పూర్ణమ్మకు వారసురాలు. గురజాడ వస్తువు వేరు. రూపం వేరు. అలాగే శ్రీశ్రీ భిక్షువర్షీయసీ వస్తువు వేరు. వారి కవితల పక్కన నిలబడదగిన కవిత దయ్యాల మాణిక్యమ్మ అని చెప్పాలని ఉంది. కవి 'దయ్యాల మాణిక్యమ్మ కాదామె, ధైర్యాల మాణిక్యమ్మ' అంటూనే 'నేనిప్పుడు అందరికీ పంచుతోంది ఆమె నాకిచ్చిన ప్రేమలో వాటాయే కదా' అంటాడు. ఇది సాధారణ సరళ పాదాలే గానీ వీటిలో కవిత్వం గుబాళించింది. మాణిక్యమ్మ మనుమడి ప్రేమలోని వాటాను ప్రపంచానికి పంచడం కాదు ప్రతి మనుమడు చేస్తున్న పనీ చేయాల్సిన పనీ అదే మరి.

శ్రీనివాస్ అమ్మ మీదే కాదు భార్య మీద అంత బాగా రాసిన కవిత 'గెలుపంతా ఆమెదే' నన్న కవిత. స్త్రీవాదులు కవికి తప్పక అభిమానుల్ని చేసే కవిత. 'నన్ను నేను ఎన్నిసార్లు భాగించుకున్న స్వార్థ శేషం మిగుల్తూనే వుంద'న్న భావన ఆధిపత్య పురుషుల్లోంచి తొలిగిపోతేనే దాంపత్య బంధాలు గట్టిపడతాయనే హెచ్చరిక కూడా ఈ కవిత చేసింది.

శ్రీనివాస్ వైరాయణం రామాయణమంత విస్తృతమైన వచన కవితా శతకం లేదా శతక కావ్యం. ఇది ఆంగ్లంలోకి అనువాదమైతే బాగుండు. ప్రపంచ కవుల్ని కదిలించిన కరోనా మీది కవిత్వం ఇది. దేవీప్రియ రోజుకో రన్నింగ్ కామెంట్రీ రాసాడు. ఆయన చెల్తే చెల్తే లాంటిదైనా ఆయన కామెంట్రీలు వేరు. శ్రీనివాస్ కరోనా కామెంట్రీలు వేరు. కవి దేశం కాని దేశం వెళ్ళి లాక్‌డౌన్‌లో చిక్కుకుని చేసేది ఏమీ లేక రోజూ రోజూ 'కరోనా... జన్మమేనీది' అంటూ రాసి దాదాపు మూడు వేల పాఠకులకు వాట్సాప్ ద్వారా దాని తాలుకు కలిగిన సంభాషణా త్మక సవ్వడిని ఎత్తిచూపాడు. ఏ కావ్యం సంపాదించుకోలేని పాఠకుల్ని వైరాయణం సంపాదించుకుంది. కరోనా కవన ధ్వని సంభాషణలో కవి తంతా సాగింది. క్యాన్వాస్ విస్తృతంగా వ్యాపించింది. ఒక చోట 'ఆకాశం రెక్కలు లేని వలస పక్షి. భూగోళం పాదాలు లేని ప్రయాణికురాలు. సూర్యుడు కళ్ళు లేని చూపుకాపరి. చంద్రుడు చర్మం లేని స్పర్శ జ్ఞాని. అన్నీ ఉన్నాయనుకున్న మనుషుల నిప్పుడు అరుగులు దాటి, అరడుగు వెయ్యలేని అంధకారంలోకి నెట్టేస్తుంది కదా! కరోనా... కారణ జన్మమే నీది' అంటూ తోచిందల్లా రాసాడు గానీ అందరికీ తోచింది అదే మరి. కవి కదా! ఈ వచన కవితా శతకాన్ని ముగిస్తూ- 'నదులు కన్న కలలు పంట పొలాలలో; కవులు కన్న కలలు మనుషుల్లో ఫలిస్తాయి. మా శేషేంద్ర కల నిజమైతే నేడో రేపో కనబడకుండా కొట్టుకుపోతావు. ఎంతయినా కరోనా... మారణ జన్మమే నీది' అంటాడు. ఒక వ్యాక్సిన్ విఫలమైన వేళ వేలకొలది ప్రభవించును. కరోనా నీవు మరణించక తప్పదు అంటాడు. ఒక్కో వచన కవితా శతక పద్యం వేమన శతక పద్యాలకు సమీపమైనవే.

కవి నిత్యం ముల్లకంచలను దాటే శక్తినీ సమాజాన్ని పరిశుభ్రం చేసుకునే నైపుణ్యాన్ని అందించాలి. కవి సూర్యుడి లాంటి వాడు. సామాజిక చీకటిలోయల్లోకి వెలుగుల్ని ప్రసరింపచేయాలి. శ్రీనివాస్ కవిగా సఫలీకృతుడవుతున్నాడనీ భావిస్తున్నాను. ఆధునిక సమస్త వ్యామోహాల కాలుష్యాల నుంచి తట్టుకునే శక్తినీ భ్రమల ప్రపంచాన్ని ధిక్కరించే సాహసాన్నీ నిరంతరం స్వేచ్ఛగా నిర్భయంగా మునుముందుకు నడిచే యోధుని నడకనీ మరింత అందుకుని పరిణత కవిగా సాగాలని చెప్పాల్సిన అవసరం లేకపోయినా చెప్పాలనిపిస్తుంది. వస్తు ఐక్యతలోను ఊహాశక్తిలోను భాషలోను నిర్మాణ సామర్థ్యంలోనూ కవిత్వపు ఎత్తుగడలోను, ప్రతీకల్ని వాడడంలోనూ నడకలోనూ ముగింపులోనూ రాబోయే కాలానికి సైతం నిలబడే కవిత్వం రాయాలని ఆకాంక్షిస్తున్నాను.

మహిళా దినోత్సవం సందర్భంగా 5న 'అంతరంగ' ఆవిష్కరణ సభ

తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో కదన రంగంలో ప్రతిభతో ముందడుగు వేస్తున్న మహిళామణుల 'అంతరంగ ఆవిష్కరణ' మార్చి 5 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమం నిర్వహించాలని తలపెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా తాము సాహిత్య కళా రంగంలోకి రావటానికి గల కారణాలను, నిర్వహించిన కృషిని మహిళా లోకానికి స్ఫూర్తిని అందించాలని కోరుతున్నారు. ఆసక్తి కలిగిన మహిళలు మార్చి 1లోగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. వివరాలకు 9490099083, 7396125909, 9618683519, 9573162399, 9441815722, 9704226681 నంబర్లందు సంప్రదించవచ్చు.

పూల పందిరి

ముఖాల మీద
చల్లని నీళ్ళు చిలకరించి
నిద్ర లేపుతుంది

పూల పాదుకు
నీళ్ళు పొస్తూ
పూలకు ఈ సుకుమారమంతా
ఎక్కడి దనుకునేరు?
పొద్దుటి మంచు తెమ్మర
ప్రకృతి చల్లదనం చలువే
మధ్యహన్నాలు
ఈ చల్లదనం లభిస్తుందా మీకు ?

లేవండిక లేవండి
ఆరుబయట అలా వ్యాహళికి వెళ్ళి రండి
ఈ పూల బడాయంతా
పొద్దుటి చల్లదనం చలువే
వారసత్వపు నీడే
ప్రకృతి పూల పందిరి అనేది

నాన్నల చమట సౌకర్యాలు
సంజీవినీ అమృతం.
అమ్మల తేనె పలుకులు
ఉరుకులు, పరుగులతో
దార్లన్నిటికి ప్రణమిల్లి రండి మీకు
ఆరోగ్య సౌభాగ్యం . - హనీఫ్ సయ్యద్

పలకరించొద్దు


ఎలావున్నావని అడగొద్దు నన్ను
కొలాంగ్ నదిలో తేలుతూ వస్తోంది
తలలేని అమ్మాయి, నా మృతదేహం కోసం.
నలభై రెండు గంటలుగా పడివుంది,
అది గౌహతి రహదారి పక్కన.
నేనింకా కళ్లు తెరిచే వున్నాను
నా మృత్యువు కూడా తన కళ్లు తెరిచే వుంది
పక్కనే చెరువులూ నదులను తలపించే బురద
గుంటల్లో
బొలెడన్ని చేపలు గిలగిలకొట్టుకుంటున్నాయి
హే, నా అశ్వికుడా, విశ్రాంతి తీసుకో.

అస్సామీ : నీల్మణి ఫూకన్
తెలుగు : దేశరాజు

ఒరిగామి కాగిత మడతలు

ఒరిగామి అనేది ప్రాచీన జపాన్ కళ. కాగితాలను మడిచి జంతువుల ఆకృతో పువ్వుల ఆకృతో కలగజేస్తే దానిని 'ఒరిగామి' అంటారు. ఈ ఒరిగామి కళలో కాగితాలను వివిధ ఆకృతుల్లో మడవటమే ఉంటుంది. కానీ కాగితాల కత్తిరింపులు ఉండవు. జపాన్ భాషలో 'ఒరి' అంటే మలచడం అనీ, 'కమి' అంటే కాగితం అని అర్థం. అందుకే ఈ కాగితాల కళకు 'ఒరిగామి' అనే పేరు వచ్చింది. పూర్వకాలపు కళలు ఏమైనా ఒక తరం నుంచి మరో తరానికి అందేవే. ఒరిగామి గురించి రాసిన పుస్తకం 1797వ సంవత్సరంలోనే ప్రచురింబడింది. దీనిలో ఒరిగామి చిత్రకళకు సంబంధించిన ఎన్నో సూత్రాలు సూచనలు ఉన్నాయి. కాగితంతో కళాకృతులు ఎన్నో రకాలుగా మలచవచ్చు. ఐరోపా, చైనాలలో కూడా ప్రత్యేకమైన కాగితపు మడతల సంప్రదాయాలు ఉన్నాయి. జపాన్‌లో 7వ శతాబ్దం నాటికే కాగితం తయారీ తెలిసింది. బాగా అభివృద్ధి చేయబడిన కాగితం తయారీ సాంకేతికతను 'నాగషిసుకి' అంటారు. ఒరిగామితో తయారైన క్రేన్ బొమ్మ ప్రసిద్ధి చెందినదిగా గుర్తింపబడింది. 'యున్‌హాలీ' రచించిన 'ఘోస్ట్‌వెయిట్' అనే ఫిక్షన్‌లో కథాంశం అంతా ఒరిగామి చుట్టూ తిరుగుతుంది. అయితే మనం ఈరోజు అలాంటి కొన్ని అలంకరణ వస్తువులు చేసుకుందాం...





ఒక వాల్ హ్యాంగింగ్ చేద్దాం

ఇది చెయ్యడం కష్టంగా ఏమీ ఉండదు. చిన్నప్పుడు స్కూల్లో గాల్లోకి, పక్కనున్న పిల్లల మీదకి ఎగురవేసే రాకెట్లు మనమే చేశాం గుర్తుందా! పుస్తకంలో కాగితం చించి నాలుగు మడతలు వేసి రాకెట్‌ను చేసి పైకి ఎగురవేశాం కదా. అలాగే ఇప్పుడు పొడుగ్గా ఉన్న గట్టి పేపర్‌ను తీసుకోవాలి. దానిని దగ్గరదగ్గరగా చీర కుచ్చిళ్ళలా మడిచి వదిలి విసనకర్ర వలె వస్తుంది. ఎంత వెడల్పు కావాలో చూసి సరిపోకుంటే మరో పేపర్‌ను మడిచి దీనికి కలిపి అతికించుకోవాలి. అప్పుడు అర్థచంద్రాకారంలో ప్రిల్స్ పేపర్‌లా వస్తుంది. ఇలా తయారయ్యాక ఒక అట్టపెట్టెలో నుంచి అర్థచంద్రాకారపు పేపర్‌కు సరిపోయేలా




కత్తిరించాలి. ఈ అట్టను కాగితం కింద పెట్టి అతికించాలి. దీనివల్ల అది గట్టిగా ఉంటుంది. పేపర్‌ను మడిస్తే అర్ధ చంద్రాకారపు ప్రిల్స్ వచ్చినట్టుగా చిన్న పేపర్‌ను మడిస్తే చిన్న అర్ధచంద్రాకారం వస్తుంది. ఇలా చిన్న అర్ధ చంద్రాకారాలు మూడు తయారు చేయాలి. ఇప్పుడు పెద్ద అర్ధ చంద్రాకారానికి కిందుగా వేలాడేలా మూడు రిబ్బన్ల వంటి కాగితాలు అతికి, వాటికి అర్ధ చంద్రాకారాలు అతకాలి. వేలాడుతూ ఇవి చక్కగా కనిపిస్తాయి. దీనిని గోడకు అతికించుకుంటే అందంగా కనిపిస్తాయి.

పక్షిని ఎగరేద్దాం

ఇవన్నీ చేయడానికి పది నిమిషాల కన్నా ఎక్కువ సయమం తీసుకోవు. చిన్నప్పుడు మనం వంటింట్లో వాడే నాలుగు గిన్నెల సెట్, మడుచుకుని ఉన్న కమలం, రాకెట్లు ఎన్నో చేశాం. అప్పుడు దాని పేరు ఒరిగామి అని తెలియదు. కానీ అందరూ చేసిన వాళ్ళే. ఇంకా పడవ, కత్తిపడవ, మనీ పర్సు కూడా చేసే వాళ్ళం. ఇప్పుడు పాత వాటిని గుర్తు చేసుకుంటుంటే ఎన్నో బాల్య జ్ఞాపకాలు. సాధారణమైన ఒక కాగితాన్ని జంతువుగానో, బుట్టగానో ఒక వస్తువుగానో, పువ్వుగానో మార్చడం ద్వారా మనసు ఎంతో ఆనందానికి లోనవుతుంది. ఒరిగామి పిల్లలకు నేర్పించడం ద్వారా వాళ్ళకు మ్యాథ్స్‌లోని సూత్రాలు ఈక్వేషన్స్ అర్థమవుతాయి. వ్యాసం, వ్యాసార్థం, కోణాలు, ఐ మూలగా మడవడం వంటివెన్నో తెలుస్తాయి. రెండు రంగుల్లో రెండు పక్షుల్ని చేద్దాం. ఒకటి పింక్ కలర్ కాగితంతో, మరొకటి వంకాయి రంగు కాగితంతో చేద్దాం. ఫొటోను చూస్తే పేపర్‌ను ఎలా మడవాలో తెలిసిపోతుంది. పేపర్‌ను పక్షి ఆకారంలో మడిచాక కన్ను అతికించుకోవాలి. ఒరిగామి కళలో చాలా రకాల పద్ధతులున్నాయి. యాక్షన్ ఒరిగామి, ప్యూర్‌లాండ్ ఒరిగామి, మాడ్యులర్ ఒరిగామి అనే పద్ధతులున్నాయి. వీటిలో ఇంకా వెట్‌ఫోల్డింగ్, కిరిగామి, స్ట్రిప్ ఫోల్డింగ్ అని మరికొన్ని రకాలున్నాయి.

సీతాకోక చిలుకలు

వీటిని తయారు చేసి గోడమీద అతికిస్తే సీతాకోక చిలుకలు వచ్చి వాలినట్టుగా కనిపిస్తాయి. వీటికి ఏ రంగు కాగితాలనైనా ఉపయోగించవచ్చు. సీతాకోక చిలుకలు బహువర్ణాలలో ఉంటాయి. కాబట్టి ఏ రంగైనా వాడవచ్చు. నేను నిండు బులుగు రంగులో కాగితాన్ని తీసుకుని కుచ్చులుగా మడిచాను. ఈ కుచ్చులు సీతాకోక చిలుక రెక్కలుగా పనికొస్తాయి. శరీరం కొరకు కాగితం నిలువుగా కొద్దిగా మడిస్తే చాలు. దీనికి చివర కళ్ళను దిద్దాలి. రెండు రెక్కలను తయారు చేసి రెండు వైపులా అతికించుకోవాలి. ఇవన్నీ అయ్యాక తల భాగంలో రెండు యాంటిన్నాలను పెట్టుకోవాలి. రెండు మూడు సీతాకోక చిలుకల్ని చేసుకుని గోడకు అతికించుకోవాలి. ఒకటి పెద్దది, ఒకటి చిన్నదిగా చేసుకుంటే బాగుంటుంది. కేవలం మడతల ద్వారానే ఒరిగామి కళను చూపించవచ్చు.



ఒరిగామి చేప

ఒరిగామి కళలో కత్తెర, కత్తిరింపు రెండూ ఉండవు, చైనా, యూరోప్‌లకు కూడా ఈ కళ వ్యాపించింది. ఈ కళ గురించి చరిత్రకారులు చక్కని గుర్తింపులతో రాశారు. అన్ని కళలకు వలెనె ఒరిగామిలో కూడా సంప్రదాయితకు తోడుగా ఆధునికత వచ్చి చేరింది. 20వ శతాబ్దం వచ్చే వరకు ఎన్నో మార్పులకు లోనయింది. మత పరమైన పండుగలకు ఇళ్ళు గుళ్ళు అలంకారాలలో పేపర్ బొమ్మలనే వాడేవారు. పిల్లలు ఆడుకోవడానికి పేపర్ బొమ్మలను వాడేవారు. వాటిలో ఎంతో కొత్తదనం వచ్చి నూతన హంగులతో ఈ కళ విలసిల్లడం మొదలయింది. నలుచదరంగా ఉన్న పేపరును మడిచి చేపను చేయవచ్చు. ఇక్కడ చేప శరీరం నలుచదరంగా ఉంచి తోక రెక్కలు వచ్చేలా మడుచుకుంటే సరిపోతుంది. రెండు చేపల్ని చేసి ఎదురెదురుగా పెట్టుకుంటే బాగుంటుంది.

గౌను చేద్దాం

గబ్బిలాలు, కుందేళ్ళు, ఒంటెలు, రామచిలుకలు ఇలా ఎన్ని జంతువులనయినా ఒరిగామిలో చేయవచ్చు. అయితే ఇప్పుడు గౌనును కాగితాల మడతలతో చేద్దాం. నడుము భాగం దగ్గర మాత్రం నలుపు స్కెచ్ పెన్నుతో ఒక గీత గీసుకుంటే బాగుంటుంది. ఈ ఫొటోను చూస్తేనే ఎలా



మడవాలో తెలిసి పోతుంది. పేపర్ గౌన్లను తయారు చేసి అద్దాల షోకేస్‌లో పెట్టండి. ఈ మధ్య స్కూళ్ళలో వెరైటీ కాన్సెప్ట్‌లతో డ్రెస్సుల పోటీలు పెడుతున్నారు. ఆయా సమయాల్లో పేపర్ డ్రెస్సు, క్యారీ బ్యాగుల డ్రెస్సులు తయారు చేసి పిల్లలకు వేస్తూ పోటీలలో పాల్గొంటున్నారు. అలాగే ఈ పేపర్ గైనును తయారు చేయండి.

– డాక్టర్ కందేపి రాణీప్రసాద్

ఇట్ల చేద్దాం



పావుకప్పు మెంతుల్ని నానబెట్టి మొలకలు వచ్చేలా చేయాలి. ఆపై ఆరబెట్టి పొడి చేసి దాన్ని కొబ్బరి నూనెలో మరగనివ్వాలి. ఈ నూనెను తలకు పట్టించి అరగంట తర్వాత షాంపూతో తలస్నానం చేస్తే జుట్టు పట్టులా మెరుస్తుంది.

అవసరం మేరకే వాడండి...



వృత్తిపరంగా లేదా టైంపాస్ కావట్లేదంటూ.. ప్రస్తుతం చాలామంది డిజిటల్ ప్రపంచమే లోకంగా గడుపుతున్నారు. కానీ ఎంతలా దీనికి అలవాటు పడితే మన ఆరోగ్యంపై అంత ప్రభావం పడుతుంది. అంతేకాదు ఇది కుటుంబ బంధాలను సైతం దెబ్బతీస్తుంది. పనిలో నాణ్యతను తగ్గిస్తుంది. చదువుపై ఆసక్తినీ కోల్పోయేలా చేస్తుంది. కాబట్టి అవసరమైనంత మేరకు మాత్రమే గ్యాడ్జెట్స్‌ని వినియోగించుకోవాలి.

- ఒకవేళ టైంపాస్ కోసమే డిజిటల్‌ని ఆశ్రయిస్తున్నట్లయితే దానికి ప్రత్యామ్నాయ మార్గాలు బోలెడున్నాయి. మీకు నచ్చిన అంశాలపై దృష్టి పెట్టచ్చు. మీ కుటుంబ సభ్యులతో కలిసి సమయం గడపచ్చు. ఆటలు, పాటలు, కళలు.. వంటి అంశాల్లో మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చు. ఇక వృత్తిరీత్యా ఆన్‌లైన్‌లో ఉండేవాళ్లు తమ పని పూర్తైన తర్వాత ఇలాంటి అంశాలపై శ్రద్ధ పెట్టచ్చు. ఆలోచించాలే గానీ ఇలాంటి ఆప్షన్స్ బోలెడున్నాయి. వీటివల్ల డిజిటల్ ప్రపంచం నుంచి కాస్త విరామం దొరకడంతో పాటు శరీరానికి, మనసుకు విశ్రాంతి లభిస్తుంది.
- వారాంతాల్లో మీరు కూడా మీ గ్యాడ్జెట్స్‌కి వీక్లీ-ఆఫ్ ఇచ్చేయండి. మరీ రోజంతా అంటే కష్టమనుకుంటే కనీసం ఓ పూటైనా వాటిని కనికరించండి. ఆ సమయంలో హాయిగా నిద్రపోండి. కాసేపు వ్యాయామం చేయండి. కుటుంబ సభ్యులతో కబుర్లు చెప్పండి. ఇలా కనీసం వారానికొకసారైనా అలవాటు చేసుకున్నారంటే మీలోని ఒత్తిళ్లు, ఆందోళనలు అన్నీ హుష్‌కాకి అయిపోవాల్సిందే. శరీరానికైనా, మనసుకైనా ఇంతకుమించిన రిలాక్సేషన్ ఏముంటుంది చెప్పండి.
- చాలామంది ఖాళీగా కూర్చున్నారంటే చాలు.. చేతులు ఫోన్ దగ్గరికే పరుగులు పెడతాయి. అదే మనం అనుకున్న పనులన్నింటినీ ఓ ప్లాన్ ప్రకారం పూర్తిచేశామంటే ఖాళీగా, బద్ధకంగా కూర్చునే అవసరమే రాదు. కాబట్టి ప్రతి ఒక్కరికీ రోజువారీ ప్రణాళిక తప్పనిసరి. దాని ప్రకారమే వ్యాయామం, ఆఫీస్ పని, ఇంటి పని, పిల్లల బాధ్యత, కుటుంబంతో గడపడం, నిద్రపోవడం.. వీటన్నింటినీ బ్యాలన్స్ చేసుకోవచ్చు.. తద్వారా డిజిటల్ ప్రపంచంలో విహరించే సమయాన్ని కూడా తగ్గించుకోవచ్చు.
- ఫోన్, ల్యాప్‌టాప్ ఇలా వీటిని మన ఖాళీ సమయాల్లో కూడా వెంటే ఉంచుకోవడం వల్ల పదే పదే వాటిపైకే మన దృష్టి మళ్లుతుంది. అందుకే డిజిటల్ డీటాక్స్‌లో భాగంగా వాటిని మన కంటికి కనిపించనంత దూరంగా పెట్టేయడం మంచిది. తద్వారా మనం చేసే ఇతర పనులపై పూర్తి శ్రద్ధ పెట్టచ్చు.
- డిజిటల్ డీటాక్స్‌ని ఇంట్లో మీరొక్కరే పాటిస్తూ.. ఇతరులు విచ్చలవిడిగా గ్యాడ్జెట్స్‌తోనే గడుపుతున్నారనుకోండి.. మీకూ వాటిపైకే మనసు మళ్లుతుంది. కాబట్టి ఈ పద్ధతిని ఇంట్లో అందరూ పాటించేలా ఒక నియమం పెట్టుకోండి. కావాలంటే 'ఈ పద్ధతిని ఎవరు ఎక్కువ సేపు పాటిస్తారో చూద్దాం..!' అంటూ ఓ ఛాలెంజ్ విసురుకోండి. ఈ సమయంలో అందరూ కలిసి ఏదో ఒక గేమ్ ఆడడం, వంటలో ఒకరికొకరు సహాయపడడం.. వంటివి చేయచ్చు. ఇలా చేయడం వల్ల మనసుకు ప్రశాంతంగా ఉంటుంది.. అనుబంధాలూ దృఢమవుతాయి.

పోరాడి..

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి టి.హరీశ్ రావు సంతాపం ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. మృత్యువుతో పోరాడుతూ డాక్టర్ ప్రీతి తుది శ్వాస విడవడం అత్యంత బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఆమెను కాపాడేందుకు నిమ్స్ వైద్య బందం నిర్విరామంగా, శక్తి వంచన లేకుండా శ్రమించిందని



తెలిపారు. పూర్తి ఆరోగ్య వంతురాలై వస్తుందని అనుకున్న డాక్టర్ ప్రీతి, తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోవడం... మనసును తీవ్రంగా కలిచి వేసిందని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు పేర్కొన్నారు. హరీశ్ రావుతో పాటు పలువురు మంత్రులు సంతాపాన్ని తెలిపారు. అంతకు ముందు నిమ్స్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రీతి రాత్రి 9.10 గంటలకు మరణించినట్టు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.

ప్రీతి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా: మంత్రి ఎర్రబెల్లి

నిమ్స్‌లో చికిత్స పొందుతూ కన్నుమూసిన కేఎంసీ వైద్య విద్యార్థిని ప్రీతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ ప్రకటన చేస్తున్నట్టు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు.

ప్రీతి మతి పట్ల సీఎం కేసీఆర్ ఆవేదన, విచారం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. "ప్రీతి ఘటన అత్యంత దురదృష్టకరం, బాధాకరం. ఎవరూ పూడ్చలేని దు:ఖంలో ఆ కుటుంబం ఉంది. ప్రీతి ఘటనపై విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో తేలిన దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తాం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటాం. ప్రీతి ఆత్మశాంతించాలని ఆదేవుడిని ప్రార్థిస్తున్నా. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేస్తున్నా" అని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.

ఊరిస్తున్న గిరిజన బంధు

(మొదటిపేజీ తరువాయి)

గిరిజన బంధుకు నిధులు కేటాయించకపోవటంతో పథకాన్ని పట్టాలెక్కిస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రతియేటా బడ్జెట్లో గిరిజనులకు కేటాయించిన విధంగానే ఈ ఏడాది కూడా కేటాయింపులు ఉండటం విశేషం. వారి జనాభా నిష్పత్తి ప్రకారం ప్రతి ఏటా 29శాఖలు కలిపి గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధి పద్దు కింద గతేడాది రూ.13,412 కోట్లు కేటాయించగా 2023-24లో రూ.15,233 కోట్లు కేటాయించింది. గిరిజన సంక్షేమ శాఖకు గతేడాది రూ.2,847 కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది రూ.3,965 కోట్లు కేటాయించింది. దీంతో గిరిజనుల అభివద్ధి సంక్షేమానికి ఖర్చు చేసే సంక్షేమ శాఖకు కేవలం రూ.3,965 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకోవటమేంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో పక్క వివిధ శాఖల్లో కేటాయిస్తున్న గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధులు గిరిజనుల కోసం ఖర్చు చేయకుండా వేలకోట్లు ఇతర పథకాలకు దారి మళ్ళిస్తుందన్న ఆరోపణలున్నాయి. ఇది సబ్ ప్లాన్ చట్టానికి తిలోదకాలు ఇవ్వడమేనని గిరిజన సంఘాలు విమర్శిస్తున్నాయి. ఇదిలా ఉంటే..గిరిజన బంధుకు ఎక్కడనుంచి ఖర్చు చేస్తారో స్పష్టత ఇవ్వాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేషన్ల లోన్లు ఇవ్వటం లేదు..

ఎస్సీ, బీసీ కార్పొరేషన్లలో మాదిరిగానే గిరిజన కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లు అందటం లేదు. గిరిజన యువత కోసం తీసుకొచ్చిన డ్రైవర్ ఎంపవర్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం మూడేండ్లుగా అమలు చేయడం లేదు. ఈ పథకానికి కేటాయించటం లేదు.దీనికోసం సుమారు లక్ష మందికి పైగా దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. ఎనిమిదేండ్లలో 34,873 మందికి మాత్రమే ఈ పథకం కింద లబ్దిపొందారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ఎకానమిక్ సపోర్ట్ స్కీం(ఈఎస్ఎస్)ను కూడా అమలు చేయడం లేదు. ఈ ఎనిమిదేండ్లలో 1,120 మందికి మాత్రమే ఈ పథకం కింద లబ్ది చేకూరింది. ఈ నేపథ్యంలో గిరిజనబంధు ప్రకటించి మిగతా పథకాలకు చెక్ పెడతారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

హక్కు పత్రాలు జారీ చేస్తేనే..

గిరిజన బంధుపథకాన్ని ప్రకటించిన సమయంలోనే భూమి లేని గిరిజనులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని సీఎం చెప్పిన విషయం తెలిసిందే. దీన్ని బట్టి ముందుగా పోడు భూములకు పట్టాలివ్వనిదే అర్హుల గుర్తింపు ప్రక్రియ ముందుకు సాగేలా కనిపించడం లేదు. పోడు భూముల హక్కు పత్రాల జారీలో జరుగుతున్న ఆలస్యమే ఇప్పుడు ఈ పథకం అమలుకు అడ్డంకిగా మారిందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించినట్టుగా గిరిజన బంధును అమలు చేసి తీరుతామంటూ గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడిస్తున్నారు. దీనిపై గిరిజనులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని చెబుతున్నారు.

భారత ఆర్థికం మరీ బలహీనం

(మొదటిపేజీ తరువాయి)

శ్రామిక శక్తి ఆకాంక్షలను తీర్చడానికి దేశానికి అవసరమైనదాని కంటే ఆర్థిక వృద్ధి తక్కువగా ఉండొచ్చని అన్నారు. పెరుగుతున్న ఈఎంఐ చెల్లింపులు గృహ బడ్జెట్‌లపై ఒత్తిడిని పెంచుతాయని తెలిపారు. ఎగుమతులు ప్రపంచంలో పలు అంశాల కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. అధిక వడ్డీ రేట్లు ప్రయివేటు మూలధన పెట్టుబడిని మరింత కష్టతరం చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక ఏకీకరణలో ఉన్నదనీ, దీంతో ఇటువైపు నుంచి ఆర్థిక వ్యవస్థకు మద్దతు తగ్గుతుందని వర్మ అన్నారు. ఈ అంశాల కారణంగా మన జనాభా సందర్భం, ఆదాయ స్థాయిని బట్టి పెరుగుతున్న మన శ్రామికశక్తి ఆకాంక్షలకు అనుగుణంగా దేశ ఆర్థిక వృద్ధి తక్కువగా ఉండవచ్చని తాను ఆందోళన చెందుతున్నానని ఆయన తెలిపారు.కరోనా మహమ్మారి, ఉక్రెయిన్ యుద్ధం నుంచి సరఫరా షాక్‌లు క్రమంగా ప్రపంచ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు రాబోయే నెలల్లో ప్రభావాన్ని చూపుతాయని అన్నారు. ప్రపంచం యుద్ధంతో జీవించడం నేర్చుకుంటున్నదనీ, అదే సమయంలో ద్రవ్య పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా వృద్ధిని ప్రమాదంలో పడేస్తున్నాయని ఆయన చెప్పారు. 2022-23 ద్వితీయార్థం అధిక ద్రవ్యోల్బణ సంవత్సరం అని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం (సీపీఐ) అంచనాను ఆర్బీఐ 6.7 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. జనవరిలో భారత రిటైల్ ద్రవ్యోల్బణం 6.52 శాతంగా ఉన్నది. రిజర్వ్‌బ్యాంక్ స్వల్పకాలిక రుణ రేటును పెంచడంపై స్పందిస్తూ ఈ నేపథ్యంలో విరామం సరైనదని వర్మ అన్నారు.

గతేడాది మే నుంచి స్వల్పకాలిక రుణ రేటును పెంచుతున్న రిజర్వ్ బ్యాంకు.. రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. రెపో రేటు ఇప్పుడు 6.5 శాతంగా ఉన్నది. దేశ ఆర్థిక వ్యవస్థపై ఒకపక్క మోడీ సర్కారు గొప్పలు చెప్పుకుంటున్నది. 5 లక్షల డాలర్ల ఆర్థిక వ్యవస్థను తయారు చేస్తామని, ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో టాప్ 10లో ఉన్నామని ప్రచారాలు చేసుకుంటున్నది. అయితే, అదానీ వంటి బడా స్నేహితుల ప్రయోజనాలకు మోడీ సర్కారు ప్రాధాన్యతనిస్తున్నదని ఇప్పటికే పలువురు ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.

సర్వాంగ సుందరంగా...

(మొదటిపేజీ తరువాయి)

రోడ్డు పూర్తి కాగా.. వాగులో ఇరువైపులా రిటైనింగ్ వాల్స్ చివరి దశకు చేరుకున్నాయి. ప్రతిరోజూ 50కిపైగా యంత్రాలతో పనులు సాగుతుండగా.. మరో ఏడాదిలో మానేరు రివర్‌ఫ్రంట్ అందుబాటులోకి రానుంది. ఐదేండ్ల కిందట ముఖ్యమంత్రి కేసీఆర్ దిగువ మానేరు జలాశయం చెంతన సుందరమైన పర్యాటక ప్రాంతాన్ని అహ్మదాబాద్‌లోని సబర్మతి తరహాలో నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు నీటిపారుదల, పర్యాటక శాఖలను సమన్వయపరుస్తూ ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. ప్రస్తుతం ఎల్ఎండీ గేట్ల నుంచి దిగువకు ఉన్న నీటి ప్రవాహానికి ఇరువైపులా 10కిలోమీటర్ల మేర భారీ ప్రహరీలు నిర్మించారు. నీటి మట్టం నుంచి రెండు దిక్కులా 4.8 మీటర్ల ఎత్తులో పాదచారులు నడిచేందుకు.. పర్యాటకులు కూర్చుని వీక్షించేందుకు బెంచీలు ఏర్పాటు చేస్తారు. అలుగునూర్ వంతెన నుంచి తీగల వంతెన దాటిన కొద్దిదూరం వరకు 2.3 కిలోమీటర్ల మేర ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే రిటైనింగ్ వాల్ నిర్మాణంతోపాటు ఇరువైపులా పెద్దఎత్తున చదును చేశారు. మొత్తంగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణ వ్యయం రూ.410 కోట్లు కాగా, మొదటి దశలో రూ.308 కోట్లతో పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం సగం మేర 210 మీటర్ల దూరం బ్యారేజీ.. దానికి ఆనుకుని 190 మీటర్ల గోడతో కూడిన చెక్‌డ్యామ్‌ను నిర్మించారు. వాగుకు ఇరువైపులా పలుచోట్ల నీటిని తాకేలా మెట్లనూ నిర్మించబోతున్నారు. భారీ ఫౌంటెన్ నిర్మాణానికి ఆదివారం మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్ సహా రాష్ట్ర స్థాయి అధికారులు భూమిపూజ చేశారు.

ప్రపంచంలో మూడో అతిపెద్ద బాల్ ఆన్ వాల్ ఫౌంటెన్

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద బాల్ ఆన్ వాల్ ఫౌంటెన్‌ను నిర్మించేందుకు మూడు అంశాల ఆధారంగా ప్లాన్ రూపొందించారు.

మొదటిది : వాగు అంచున రోబోటిక్, ఫ్లేమ్ జెట్లు, మధ్యలో వాటర్ స్క్రీన్ ఏర్పాటు చేయనున్నారు. ఫ్రేమ్ అంచున ఇంటిగ్రేటెడ్ ఆర్‌జీబీ లెడ్ లైట్లతో సుమారు ఇది 10 మీటర్లతో 2డీ కదిలే రోబోటిక్ జెట్‌లు ఏర్పాటు చేస్తారు. విభిన్న రంగుల లైటింగ్‌తో బహుళ ఆకృతులను రూపొందించడానికి జెట్‌లు ఉండనున్నాయి. వావ్ ఎఫెక్ట్‌ని సృష్టించడానికి ఫ్రేమ్‌లో 48 కదిలే హెడ్ లైట్లతో ఓ పేలుడు విసిరేలా భారీ జ్వాల ప్రదర్శించనున్నారు. ఇది కదిలే నీరు, మంటలతో పాటు విభిన్న నమూనాలను ప్రదర్శిస్తుంది. సందర్శకులను అలరించడానికి 40వేల ల్యూమెన్స్ ప్రొజెక్టర్‌ను ఉపయోగించి ప్రత్యేకంగా రూపొందించిన ఫిల్మ్‌ను ప్రొజెక్ట్ చేస్తారు. ఫౌంటెన్, వాటర్ స్క్రీన్ (బాల్ ఆన్ వాల్) ప్రదర్శన సుమారు 10 నుండి 12 నిమిషాల పాటు ఉంటుంది.

రెండోవది : 10మీటర్ల పొడవు.. 30మీ. వెడల్పుగల గోడపై ప్రొజెక్షన్ మ్యాపింగ్, ఆపైన లామినార్ జెట్‌లు ఉంటాయి. ఫ్రేమ్ బేస్ వద్ద 30మీటర్ల పొడవు.. 10మీటర్ల ఎత్తు గోడ ఉంటుంది. దానిపై ప్రొజెక్షన్ మ్యాపింగ్ ప్లాన్ చేస్తారు. ప్రొజెక్షన్ మళ్లీ నీటి తెరపై కథను కొనసాగించడానికి ప్రత్యేకంగా రూపొందించిన 22వేల ల్యూమెన్స్ ప్రొజెక్టర్లను ఏర్పాటు చేస్తారు. కథలో కొంత భాగాన్ని నీటి తెరపైన, కొంత భాగాన్ని దిగువ గోడపై చూపెట్టనున్నారు. షోలో అదనపు ఎలిమెంట్‌గా కిరణాలు, యానిమేషన్లతో లేజర్ షోను రూపొందించడానికి 12 డబ్ల్యూ (ఆర్‌జీబీ) లేజర్‌ను ఉపయోగించనున్నారు.

మూడోవది: 30మీటర్ల గోడకు ముందు నదిలో 100మీటర్ల ఎత్తు, 30మీ పొడవుతో ఫ్లోటింగ్ మ్యూజికల్ ఫౌంటెన్ (బాల్ ఆన్ వాటర్), 10మీటర్ల ఎత్తు 30మీటర్ల పొడవుతో ఫ్లోటింగ్ ఫౌంటెన్‌లో డయా సర్క్యులర్ ఫ్లోటింగ్ ఫౌంటైన్‌లు ఉంటాయి. సుమారు 12మీటర్ల ఎత్తులో 355 ఛేజింగ్ జెట్‌లు, 2డి మూవింగ్ రోబోటిక్ జెట్‌లు, సుమారు 10మీటర్ల ఎత్తులో మరిన్ని జెట్‌లు ఉండనున్నాయి. ఈ మొత్తం ప్రోగ్రామ్‌లో సంగీతంతోపాటు కదలికలను అభినందించడానికి వాటర్ జెట్‌లపై యానిమేషన్‌లతో లేజర్ షో ప్రదర్శించనున్నారు.

ప్రపంచస్థాయి టూరిజం స్పాట్‌గా కరీంనగర్
బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్

మానేరు రివర్ ఫ్రంట్‌కు ఇరువైపులా పార్కులు, వాటర్ ఫౌంటెన్లు, థీమ్‌పార్కులు, వాటర్ స్పోర్ట్స్, మ్యూజికల్ ఫౌంటెన్స్, ఆటస్థలాలు, గార్డెన్స్ ఇలా అనేక రకాల పర్యాటక అంశాలు రూపుదిద్దుకుంటున్నాయి. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఫౌంటెన్‌ను ఈ ప్రాజెక్టులో నిర్మించబోతున్నాం. తీగల వంతెనపై నాలుగు భారీ ఎల్ఈడీ తెరలూ ఏర్పాటు చేయబోతున్నాం. ఈ మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యాక ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా కరీంనగర్ నిలవనుంది.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

మొట్టమొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ అని చెప్పారు. కొమురెల్లి మల్లన్నగుడికి చైర్మెన్‌గా సంపత్ కురమను చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్, ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, చంటి క్రాంతి కిరణ్, మాణిక్‌రావు, కలెక్టర్ శరత్, నాయకులు నగేష్ యాదవ్, డాక్టర్ శ్రీహరి, బీరయ్య యాదవ్, ఐసి.మోహన్, జూలకంటి ఆంజనేయులు, పోచారం రాములు, డీసీఎంఎస్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలన్నీ బీజేపీపై ఐక్యంగా పోరాడాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యక్ష దాడులకు దిగుతోందని మండిపడ్డారు. బీజేపీతో పోరాడే ధైర్యం కార్యకర్తలకు ఉన్నదనీ, దేశం కోసం ఆ ధైర్యాన్ని ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. రైతాంగ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారిస్తోందని అన్నారు. ప్లీనరీలో తీసుకున్న నిర్ణయాలను కొత్త తరాలకు తెలియజేయాలని కోరారు. మండల స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని అన్నారు. విద్వేషపూరిత రాజకీయాలను అధిగమించి, సంఘీభావంతో ప్రేమపూర్వక రాజకీయాలు చేద్దామని కార్యకర్తలను కోరారు.

దేశానికి బీజేపీ విధానాలు ప్రమాదకరం

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా భారీ ఎత్తున ఉద్యమాలు నిర్మించాలని మహాసభ తీర్మానించినట్టు తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో మితవాద దాడికి తెరలేచిందన్నారు. మితవాద నయా-ఉదారవాద ఆర్థిక విధానాల కలయిక, హిందుత్వ దాడులు దేశ పురోగతికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిని వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులతో కలిసి ఎదుర్కోవటమే మార్గమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలనుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి జాతీయ భద్రతా సమస్యను ఎజెండా మీదికి తెస్తున్నదన్నారు.ప్రభుత్వ రంగ ఆస్తులని అదానీ, అంబానీ లాంటి మోసగాళ్లకు కారుచౌకగా కేంద్ర ప్రభుత్వం అమ్ముతున్నదని విమర్శించారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు అడ్డూఅదుపు లేకుండా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలపై మోయలేని భారాల్ని మోపుతున్నదని చెప్పారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేక చేతులెత్తేశారనీ, తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు గాలి మాటగా మిగిలాయని విమర్శించారు. మహిళలు, విద్యార్థులు, విద్యావేత్తలు, రచయితలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీల భయంభయంగా బతుకుతున్నారని చెప్పారు. వారి కోసం ఉన్న రాజ్యాంగపరమైన రక్షణలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫాసిజం, ద్వేషం, విభజన, ప్రజా వ్యతరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీని ఓడించాల్సిన కర్తవ్యం ముందుకొచ్చిందని చెప్పారు. సమావేశంలో ఏఐఎఫ్‌బీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌వీ ప్రసాద్, ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి, మహాసభల ఆహ్వాన సంఘం సభ్యులు సుందర రామరాజు, కె. తేజదీప్ రెడ్డి, బి. రాములు యాదవ్, జి. వంశీధర్ రెడ్డి, కొమ్మూరి వెంకటేష్ యాదవ్, ఆవుల శ్రీకాంత్ యాదవ్, సయ్యద్ తౌఫిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా దేవరాజన్ ఎన్నిక..

ఈ మహాసభలలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నూతన జాతీయ కార్యదర్శి జి. దేవరాజన్ ఎన్నికకాగా ఆయనతోపాటు పార్టీ జాతీయ చైర్మెన్‌గా నరేన్ చటర్జీ, వైస్ చైర్మెన్‌గా పీవీ కతిరవన్, కేంద్ర కార్యదర్శులుగా అసిమ్ సిన్హా, దాలిరం, జ్యోతి రంజన్ మహాపాత్ర, సంజయ్ భట్టాచార్య, బండా సురేందర్ రెడ్డి, అమరేష్ కుమార్, మోహన్ నంది, గోవింద్ రాయ్, జి.ఆర్. శివశంకర్, బివాస్ చక్రవర్తిలతోపాటు 65 మంది జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైయ్యారు.

వినాయక స్వామి చతుర్థి వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-వనస్థలిపురం

హైకోర్టు కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి చతుర్థి వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాస్కర్ సాగర్, ప్రధాన కార్యదర్శి యానాల కృష్ణా రెడ్డి, అనంతుల రాజిరెడ్డి, చైర్మెన్ బాదం శ్రీనివాస్, ప్రెసిడెంట్ వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ మూర్తి, నాగరాజు, మురళి, చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సింహారెడ్డి కమిటీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన డ్రయినేజీ - పూర్తిగా ధ్వంసమైన బీటీ రోడ్డు

నవతెలంగాణ-హయత్‌నగర్

ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న కార్ షో రూమ్ వద్ద డ్రయినేజి నీరు వచ్చి బీటీ రోడ్‌పై పోతుండడంతో అక్కడ భారీగా గుంటలు పడ్డాయి. అది గమనించని వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నామని చెబుతున్నారు. వెంటనే అక్కడ పొంగిపొర్లు తున్న డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని కోరుతున్నారు.



'బుద్ధపూర్ణిమ'లో జీఓ నెం.60కు తూట్లు

టెండర్ రద్దు చేయాలని కార్మికుల డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీఓ నెం.60కి విరుద్ధంగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోని బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు టెండరు ఫైనల్ చేశారు. ఎక్కడైనా ఉద్యోగులు, కార్మికుల వేతనాలు పెరిగిన సందర్భాలే ఎక్కువ. కాని బీపీపీలో మాత్రం అందుకు విరుద్ధంగా కార్మికుల వేతనాలకు భారీగా కోత పెడుతూ టెండర్ పిలవడంతోపాటు ఫైనల్, ఏజెన్సీకి పనులు కూడా అప్పగించారు. బీపీపీ పరిధిలో ఎన్‌టీఆర్ గార్డెన్, నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్యపార్కు, ట్యాంకుబండ్ పరిసర ప్రాంతాల్లో హౌస్‌కీపింగ్ సేవలను నిర్వహించడానికి టెండర్ పిలిచారు.

జీఓ నెం.60 ప్రకారం బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు పరిధిలో ఎన్‌టీఆర్ గార్డెన్, నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్యపార్కు, ట్యాంకుబండ్ పరిసర ప్రాంతాల్లో 170 మందితో పనిచేయించడానికి టెండర్ ఫైనల్ చేశారు. జనవరి 2021 నుంచి మార్చి 2021 వరకు ఒక్కో కార్మికుడు/కార్మికురాలుకు రూ.12,946.70 వేతనం చెల్లించాలని నిర్ణయించారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీఓ నెం. 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఏప్రిల్ 2021 నుంచి జనవరి 2023 వరకు బేసిక్‌తోపాటు ఈఎస్ఐ, పీఎఫ్, ఇతరములతో కలిపి రూ.18,135 నిర్ణయించారు. కార్మికులకు



మాత్రం అన్ని కటింగ్ పోను రూ.13,611 వస్తుంది.

సర్కార్ ఆదేశాలు బేఖాతర్

అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు వర్కర్స్‌కు జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సర్కార్ నిర్ణయించింది. నాలుగో తరగతి ఉద్యోగులు, కార్మికులకు (హౌస్‌కీపింగ్, శానిటేషన్) జీఓ నెం.60 అమలు చేయాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్ (డీఎంఈ) సర్క్యులర్ కూడ జారీచేశారు. ఇప్పటికే బీపీపీలోని సెక్యూరిటీ గార్డులు, ఆఫీసు స్టాఫ్‌కు అమలు చేస్తున్నారు. కానీ బీపీపీలో కొత్తగా పిలిచిన టెండర్‌లో మాత్రం కార్మికులకు రూ.12,424.80 ఇవ్వాలని నిర్ణయించారు. పైగా గతంలో ఇచ్చింది తప్పు, ఇపుడు జీఓనెం.11 ప్రకారం నిర్ణయించామని అధికారులు చెబుతున్నారు. దీని ప్రకారం అయితే ఒక్కో కార్మికునికి రూ.9,400 మాత్రమే రానుంది. దీంతో కార్మికునికి రూ.4,211 వేతనం తగ్గనుంది. గతంలో 170 మంది కార్మికులతో పనులు చేయిస్తే ఇప్పుడు 140 మందితో చేయించాలని నిర్ణయించారు. స్వీపింగ్, క్లీనింగ్ అవసరమైన సామాగ్రిలోనూ భారీగా కోత విధించారు. కొత్త ఏజెన్సీకి ఈ నెల 21 నుంచి పనులు అప్పగించడానికి హెచ్‌ఎండీఏ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ వేతనాలను ఎట్టి పరిస్థితుల్లో తగ్గించడానికి వీల్లేదని పాత వేతనాలే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీపీపీలో జీఓ నెం.60 అమలు చేయాలి

బీపీపీలో కార్మికులకు జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలి. బీపీపీకి సంబంధించిన పనులకు హెచ్‌ఎండీఏ టెండర్ పిలవడమెందుకు. దీంతోపాటు ఒకే కాంట్రాక్టు ఏజెన్సీకి మూడు, నాలుగు పనులు అప్పగించడంలో అంతర్యమేంటి? ఇప్పటికైనా టెండర్ రద్దు చేసి కొత్త టెండర్ పిలువాలి.

సీఐటీయూ నగర అధ్యక్షులు జె.కుమారస్వామి

నవ సమాజ నిర్మాణం కోసం కృషి చేయండి

- అంబేద్కర్ అశయ సాధన సమితి అధ్యక్షుడు నత్తి మైసయ్య

నవతెలంగాణ-బోడుప్పల్

ఈ దేశంలో ఎనభై శాతంగా ఉన్న దళిత బహుజను లందరూ ఏకమై అంబేద్కర్ కలలు కన్న నవ భారత నిర్మాణం కోసం పని చేయాలని అంబేద్కర్ అసాయ సాధన సమితి అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతి ఆదివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని పూలమాల అలంకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ తన జీవితం మొత్తాన్ని త్యాగం చేశాడని, అందుకే బహుజన వర్గాలు అంబేద్కర్ ఆశించిన నవ సమాజ నిర్మాణం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చాడు. దేశ జనాభాలో 80శాతం పైగా ఉన్న దళిత, బహుజనులు స్వార్థ రాజకీయ నాయకుల వలలో పడకుండా బహుజనుల అభ్యున్నతి కోసం అందరం ఐక్యంగా ఉండి బహుజనుల అభ్యున్నతి కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ప్రీతి ఆత్మహత్య యత్నం



చేసుకోవడానికి కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు మళ్లీమళ్లీ జరగకుండా ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు రూపొందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మనోహర్, బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, మందుల సూర్య కిరణ్,సగ్గు నరసింహ, బండారి సాయి, శ్రీహరి చారి, నాసిక్ ప్రభాకర్,అజయ్ తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి



బోడుప్పల్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

పేద ప్రజలకు అవసరమైన వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి యొక్క ఎంతగానో ఉపయోగపడుతుందని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం నాడు వీరారెడ్డి నగర్ కాలనీకి చెందిన దత్తత్రి అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకోవడం జరిగిందని శస్త్రచికిత్స వైద్యం కోసం అర్థిక ఇబ్బందులు రావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా సీఎంఆర్ఎఫ్ నుండి రూ.లక్ష రూపాయల చెక్కును బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పేద మహిళకు కార్పొరేటర్ ఆర్థిక సహాయం



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేద్కర్ సర్కిల్ విస్తరణలో తన ఇఖ్లును కోల్పోయిన ఓ మహిళకు ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచాడు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5 వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి. వివరాల్లోకి వెళితే బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో నివాసం ఉంటున్న కొత్త రజిని బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగం చేస్తుంది. అంబేద్కర్ విగ్రహం వద్ద గతంలో రోడ్డు విస్తరణలో తన ఇల్లును కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో రజిని కుటుంబం రోడ్డున పడింది. ఈ సంఘటన చూసి చలించిన బోడుప్పల్ 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి మానవతా దృక్పధంతో రజినీ కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా రజనీ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ భర్తను కోల్పోయి అనారోగ్యంతో చిన్న ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నానని, తమపై దాతృత్వంతో సహాయం చేసిన సింగిరెడ్డి పద్మా రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామని రజిని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హోం మంత్రి మహ్మమూద్ అలీ, బీఆర్ఎస్ యూత్ లీడర్ అజం అలీ

నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని హోం మంత్రి మహ్మమూద్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అజమ్ అలీ అన్నారు, ఆదివారం మలక్ పేట నియోజకవర్గం సైదాబాద్ డివిజన్ పరిధిలోని సంకేశ్వరం బజార్ పెట్రోల్ పంపు ఎదురుగా మస్జిద్ వద్ద సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఈస్ట్ జోన్ అండ్ సౌత్ ఈస్ట్ జోన్ అల్ జోన్ జనరల్ సెక్రెటరీ శ్రీకిషన్ శర్మ, ఈస్ట్ జోన్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, సెంట్రల్ జోన్ ప్రెసిడెంట్ శశికాంత్ అగర్వాల్, సౌత్ జోన్ ప్రెసిడెంట్ ఘజివుద్దిన్, సౌత్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ తోషినివాల్, ఈస్ట్ జోన్ సెక్రెటరీ డాక్టర్ మజార్ లాలాజీ డాక్టర్ జేనుల, గోపాల్ దాస్ శరత్ శ్యామ్, సంతోష్ నగర్, కంచాన్ బాగ్, మాదన్నపేట్ సౌత్ జోన్ పీస్ కమిటీ సభ్యులు చింతల శ్రీనివాస్, మహమ్మద్ సలీం కాజా ఆధ్వర్యంలో హైదరాబాద్ మలకపేట యశోద ఆసుపత్రి వారి ఉచిత వైద్య శిబిరం నేతృత్వంలో వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరాన్ని చేపట్టారు ఉచిత వైద్య సేవలు సౌజన్య తో నియోజకవర్గం పేద ప్రజలు కాలనీ లో ఉచిత వైద్యం శిబిరాన్ని అధ్యక్షులు నారాయణరెడ్డి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర హెూమ్ మంత్రి తో కలిసి



శిబిరాన్ని ప్రారంభించారు, ఆయన అనంతరం ఆయనకు మర్యాదపూర్వక కలిసి పూలమాలలు వేసి శాలువతో ఘనంగా సన్మానించారు. శిబిరంలో స్థానిక ప్రజలు కోసం హెల్త్ క్యాంప్ నిర్వహించి తదితర, వైద్య పలు రోగాలకు, కళ్ళద్దాలు, బిపి షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీస్ కమిటీ ఊహించుకుంటూ ఇటీవల కార్యక్రమం చేసిన ఏమిటి దీని వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు, సమాజ సేవలో భాగంగా ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమనన్నారు, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు రావాలని కోరారు, ఈ కార్యక్రమంలో స్థానికులు నాయకులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఇంద్రారెడ్డి కాలనీ సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మాజీ సర్పంచ్ కట్టెల రాములు.మహేశ్వరం నియోజక వర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న ఇంద్రారెడ్డి కాలనీ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డిని బీఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భూషణ్,విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కలసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భం గా మాజీ సర్పంచ్ రాములు మాట్లాడుతూ కాలనీ ఏర్పడి ఎన్నో సంత్సరాలుగా గడుస్తున్న నేటికీ కాలనీలో చిన్నారుల కోసం అంగన్ వాడి కేంద్రం,రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు,తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.అందుకు



మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

లైఫ్ స్టైల్ సమ్మర్ కలెక్షన్స్

నవతెలంగాణ-హైదరాబాద్

లైఫ్ స్టైల్, లేటెస్ట్ ట్రెండ్ కోసం భారతదేశంలోని ప్రముఖ ఫ్యాషన్ హౌస్, స్టైలిష్ కొత్త కలెక్షను లాంచ్ చేసింది, ఇది మీ సమ్మర్ వార్డ్ రోబ్కు సరైన ఎంపికగా మారుతుంది. పూల ప్రింట్లు, ప్రకాశవంతమైన రంగులు లేదా పాస్టెల్ టోన్లను ధరించడానికి వేసవి మరియు వసంతకాలం అనువైన కాలం. అక్కడ ఉన్న ఆధునాతన మహిళలందరికీ, అల్లం మృదువైన ప్యాలెట్లలో పాప్ రంగు యొక్క సూచనతో చిక్ సిల్హౌట్లను కలిగి ఉంది. బూట కట్ కో-ఆర్డ్ సెట్లు స్నేహితులతో బ్రంచ్ ఔటింగ్ కోసం సరైన ఎంపికను చేస్తాయి. బకెట్-లిస్ట్ చేయబడిన బీచ్ హాలిడే కోసం మీరు క్రమబద్ధీకరించిన ఘనపదార్థాలు మరియు బహుళ రంగు ప్రింట్లలో షిఫ్ట్ మరియు కార్సెట్ డ్రెస్లు కూడా ఉన్నాయి. మరియు వారి డేట్ని చమత్కరించాలని చూస్తున్న వారి కోసం, బోల్డ్ అబ్స్ట్రాక్ట్ స్ట్రిప్స్ పుచ్సియా పింక్ - బ్రైట్ బ్లూ కలర్ కాంబోలు అప్రయత్నంగా స్టైలిష్ ఇంప్రెషన్ను అందించే వన్-షోల్డర్లతో కూడిన కో-ఆర్డ్ సెట్లు ఉన్నాయి.

పరిశుభ్రత పరిరక్షణ సమస్య తలెత్తకుండా చూడాలి

నవతెలంగాణ-సంతోష్‌నగర్

ప్రజల సమస్యల పరిష్కారానికి అభివృద్ధి లక్ష్యంగా, సంక్షేమ ఫలాన్ని అందించి యాకత్పురా నియోజకవర్గ ఈదీ బజర్ డివిజన్ జై కన్నా కాలనీ సిపిఐ హైదరాబాద్ సిటీ కౌన్సిల్ మెంబర్ అసిస్టెంట్ సెక్రటరీ మహమ్మద్ ఆరీఫ్ ఖాన్ పేర్కొన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది అధికారులతో కాలనీ పరిసరాల ప్రాంతాల్లో డ్రైనేజీ, మంచినీరు సరఫరా, సీసీ రోడ్డు రవాణా స్థానిక సమస్యలు తలెత్తకుండా చూడవలసిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అని సూచించారు. కాలనీ పరిసరాల ప్రాంతాల్లో పెరిగిన చెట్ల కొమ్మను తీయించారు. విద్యుత్ వైర్, చీకటిలో వెలుగు కనిపీయ డానికి వాహనదారులకు అడ్డంగా రాకుండా, రోడ్డు పక్కన ఎలాంటి సమస్య తల్లెత్తుకుండా ఉండేందుకు, రోడ్ల కాలనీ నివాస ప్రాంతాల్లో చెత్త తొలగించాలని, పరిశుభ్రత పరిరక్షణ కల్పించడమే బాధ్యతగా తీసుకొని నీట్ అండ్ క్లీన్ చేయించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరిశుభ్రత పరిరక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



ఆయన మాట్లాడుతూ... స్థానిక సమస్యలు తలెత్తకుండా చూడవలసిన బాధ్యత పారిశుద్ధ్య సిబ్బంది అధికారులు సూచనల మేరకు తగు జాగ్రత్తలు పాటించి వర్షాకాలంలో డ్రైనేజీ మరమ్మతులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తేవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు, సీనియర్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటికి సీఐటీయూకి ఏరకమైన సంబంధం లేదు



జీహెచ్ఎంసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

నవతెలంగాణ-వనస్థలిపురం

జీహెచ్ఎంసి ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ కు సంబంధం లేకుండానే బహిష్కరించబడిన మదిలేటి అని వ్యక్తి సిఐటియు పేరు చెప్పి జీహెచ్ఎంసి కార్మికుల వద్దకు వచ్చి సభ్యత్వం ఇవ్వమని అడిగితే ఎవరు ఇవ్వవద్దని సంఘానికి అతనికి సంబంధం లేదు, మద్దిలేటి కి సిఐటియు కి సంబంధం లేదు అతనినీ సిఐటియు పేరు చెప్పి డబ్బులు అడిగితే కార్మికులు ఎవరు ఇవ్వద్దని అతని కార్మికులు నిలదీయాలని, అతని మాటలకు మోసపోవద్దని కార్మికులకు సిఐటియు విజ్ఞప్తి జిహెచ్ఎంసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య తీవ్రంగా మండిపడ్డారు. గతంలో అతను యూనియన్ కార్యకర్తలకు భిన్నంగా వ్యవహరించినం దుననే సిఐటియు నుండి బహిష్కరించడం . అతనికి సిఐటీకీ ఎలాంటి సంబంధం లేదు అనే కార్మిక వర్గానికి తెలియజేస్తున్నాం .

కన్స్యూమర్ మార్కెట్లో ప్రవేశించిన టోరెంట్ ఫార్మా

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశంలో సుప్రసిద్ధ ఫార్మా బ్రాండ్లలో ఒకటైన టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ఇటీవలనే తమ మొట్టమొ దటి, 12 వారాల పాటు జరిగే సుదీర్ఘమైన ప్రచారాన్ని టీవీ, డిజిటల్ మీడియా కోసం విడుదల చేసింది. ఈ ప్రచారం, బీషెల్కాల్ స్ట్రాంగ్ ద్వారా ఈ ఫార్మా సంస్థ తమ బ్రాండ్ షెల్కాల్ 500 మార్కెట్ లీడర్గా వెలుగొందడం గురించి చెప్పడంతో పాటుగా డాక్టర్లు సూచించిన నెంబర్ 1 కాల్షియం సప్లిమెంట్ - ఓవర్ ద కౌంటర్ (ఓటీసీ) కాల్షియం సప్లిమెంట్‌గా మారడాన్ని వెల్లడిస్తుంది. ఈసందర్భంగా టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమన్ మెహతా మాట్లాడుతూ... ఓటీసీలోకి షెల్కాల్ ప్రవేశంతో ఈ బ్రాండ్ ఇప్పుడు అతిపెద్ద కాల్షియం సప్లిమెంట్ బ్రాండ్ భారతదేశంలో నిలువాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ ప్రచారం ప్రారంభించడంతో వినియోగదారులను క్రమం తప్పకుండా కాల్షియం సప్లిమెంట్ తీసుకోవాల్సిందిగా కోరుతున్నామన్నారు. తద్వారా వారు తమ డైటరీలోపాలను అధిగమించగలరని తెలిపారు. టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ లిమిటె డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమల్ కేల్షికర్ మాట్లాడుతూ... డాటా వెల్లడించే దాని ప్రకారం, భారతీయుల్లో 40.6శాతం మంది కాల్షియం లోపంతో బాధపడుతున్నారన్నారు. అలాగే 79శాతం మంది విటమిన్ డీ లోపంతో బాధపడుతున్నార న్నారు. వినియోగదారులు, ఆరోగ్యవంతమైన, చురుకైన జీవనశైలి మధ్య అంతరాన్ని తగ్గించడానికి టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ చురుగ్గా ప్రయత్నిస్తోందని అన్నారు.

శ్రీ రామ అయోధ్య నగర్ కాలనీ నూతన కార్యవర్గం

నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినా పురం డివిజన్ పరిధిలోని శ్రీ రామ అయోధ్య నగర్ కాలనీ అధ్యక్షుడు గా, డి.ప్రభాకర్ రెడ్డి,ని కాలని వాసులు ఎన్నుకోవడం జరిగింది.జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులు మరియు ప్రజాప్రతినిధులతో చర్చించి వారి సహకారంతో డివిజన్‌ను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తామని అన్నారు. కాలనీప్రధాన కార్యదర్శి గా టి. శ్రీనివాస్ రెడ్డి,కోశాధికారిగా పి.సుదర్శన్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు గా ఏ. వెంకట చారి, ఉపాధ్యక్షులుగా కె.నవీన్, జి. వెంకట్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా బి.దుర్గయ్య, ఎన్‌విఆర్ చౌదరి,ఆర్గనైజింగ్ సెక్రటరీ లుగా ఎన్.నర్సింహ,పి.సురేష్, యూ.శ్రీశైలం,కార్యవర్గ సభ్యులు గా యూ. రాము, కే. జంగా



రెడ్డి,వి. జంగయ్య,కే.జంగయ్య లను ఎన్నుకున్నారని వారు తెలిపారు. డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న కాలనీ వాసులకు కాలనీ ప్రతినిధుల తరుపున ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

క్రీడాకారులను సన్మానించిన సర్పంచ్

నవ తెలంగాణ-శామీర్ పేట

ఇటీవల కీసర బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసర గుట్టపై నిర్వహించిన క్రీడాపోటీల్లో జగన్ గుడా గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులుకు వాలీబాల్ పోటీలో ద్వితీయ బహుమతి రావడం జరిగింది. ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద క్రీడాకారులను గ్రామ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్ రెడ్డి శాలువాలతో పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్ర మంలో ఉపసర్పంచ్ బుద్ధి శ్రీనివాస్,వార్డు సభ్యులు తోకల అనిల్ రెడ్డి,మురళి, మ హేష్,నాయకులు ఎల్ల.కుమార్, క్రీడాకా రులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరా మారంలో శ్రీరేణుకఎల్లమ్మ జాతర, దుండిగల్ గ్రామంలో జరిగిన పెద్దమ్మతల్లి బోనాల ఉత్సవాలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బీఅర్ఎస్ పార్టీ యువ నాయకుడు రాజేష్ భవానీలు తన కుమార్తె బృందన్వి మొదటి పుట్టిన రోజు సందర్భంగా అనాథ బాలల కోసం పీర్జాదీగూడలోని అమ్మ ఒడి అనాథ శరణాలయంలో అవసరమైన నిత్యావసర వస్తువులను అందించడంతో పాటు ఒక ఏడాది పాటు ఒక విద్యార్థికి సరిపడా స్కూల్ ఫీజు చెక్కును అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సాంబమూర్తి, స్వరూప లు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో దారుణం

- అసభ్యకరంగా మాట్లాడాడని స్నేహితుడి దారుణ హత్య,
- 13 రోజుల క్రితమే హత్య, లాస్ట్ కాలే నిందితున్ని పట్టించిన వైనం
- మృతుడికి ఐదు నెలల క్రితమే పెండ్లి, భార్య గర్భవతి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన.....అసభ్యకరంగా మాట్లాడడన్న నెపంతో స్నేహితుడిని కట్టెతో దాడి చేసి, బండరాయితో మోది అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఆదివారం ఇన్స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం..లాస్ట్ కాల్ ఆధారంగా 13రోజుల అనంతరం మొహమ్మద్ షా ఫైసల్ హత్యోదంతం వెలుగులోకి వచ్చిందన్నారు. వివరాల లోకి వెళితే....బాలాపూర్ మండలం, వెంకటాపురం గ్రామం ఉస్మాన్ నగర్‌కు చెందిన మొహమ్మద్ జాఫర్ కుమారుడు మొహమ్మద్ షా ఫైసల్ (25) మదినా దగ్గర బట్టల దుకాణంలో పనిచేసేవాడని, ఐదు నెలల క్రితం మొహమ్మద్ షా ఫైసల్‌కు స్థానిక యువతితో వివాహం జరిగిందని, ప్రస్తుతం అతని భార్య గర్భవతి. ఈ నెల 12వ తేదీన రాత్రి 8గంటలకు మొహమ్మద్ షా ఫైసల్ ఫోన్ వస్తే మాట్లాడుకుంటూ ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రాత్రి 8.05 గంటలకు తండ్రి మొహమ్మద్ జాఫర్ నేను ఆసుపత్రికి వెళ్తున్నాను... ఇంట్లో మీ తల్లి ఒంటరిగా ఉన్నదని ... త్వరగా వెళు అని తన కొడుకుకు ఫైసల్‌కు ఫోన్ చేసి చెప్పాడు. తాను ఉస్మానియా హోటల్ వద్దనే ఉన్నానని, వెంటనే ఇంటికి వెళ్తానని తండ్రితో చెప్పాడని, 8.30గంటల వరకు కుమారుడు ఫైసల్ ఇంటికి చేరుకోక పోవడంతో మరోమారు తండ్రి ఫోన్ చేయడంతో స్విచ్ ఆఫ్ వచ్చింది. అతని ఆచూకీ కోసం చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ప్రయోజనం కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తండ్రి తన కుమారుడు ఫైసల్ కనిపించడం లేదని ఈనెల 13వ తేదీన బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును నమోదు చేసుకున్న బాలాపూర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



కాల్ వస్తే మాట్లాడుకుంటు వెళ్ళి ఇప్పటి వరకు తిరిగి ఇంటికి రాలేదని పోలీసుల ముందు బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో బాలాపూర్ పోలీసులు ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో ఫైసల్ కాల్ లిస్ట్ ఆధారంగా లాస్ట్ కాల్ చేసిన యువకుని ఫోన్ నెంబర్‌ను పోలీసులు గుర్తించారు. అతనికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో కథ మళ్ళీ మొదటికి వచ్చింది. కాగా పోలీసులకు సదరు యువకుడి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అతనిపై మరింత అనుమానం పెరిగింది.

దీంతో ఐఎం ఇ నెంబర్ ఆధారంగా మరో సిమ్?ను వాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ నెంబర్? ను ట్రేస్? చేసి సదరు యువకున్ని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా, 12వ తేదీ రాత్రి మినార్ కాలనీలోని నిర్మాణష్య ప్రదేశంలో మొహమ్మద్ షా ఫైసల్ తనపై అసభ్యకరంగా మాట్లాడినందుకే, క్షణికావేశంలో అతనిపై కట్టె, బండరాయితో మోది హతమార్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడయినట్లు విశ్వసనీయ సమచారం. దీంతో హుటాహుటిన బాలాపూర్ పోలీసులు మినార్ కాలనీలోని ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఫైసల్ స్నేహితుడే హత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు బాలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ.భాస్కర్ తెలిపారు.

నవతెలంగాణ
మల్కాజిగిరి
సోమవారం 27 ఫిబ్రవరి 2023

బీఆర్ఎస్ నేతకు మాజీ మేయర్ పరామర్శ



నవతెలంగాణ-కాప్రా

బీఆర్ఎస్ యూత్ నాయకులు భానుకు రోడ్డు ప్రమాదంలో మోకాలికి తీవ్ర గాయమైంది. ఈవిషయం తెలుసుకున్న మాజీ మేయర్ బొంతూ రామ్మోహన్, కార్పొరేటర్ బొంతూ శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ గోళ్ళూరి అంజయ్య బీఆర్ఎస్ నాయకులు బాల్ రెడ్డి కనకరాజ్ గౌడ్ , నారెడ్డి రాజేశ్వర్ రెడ్డి , సిద్దూ హరి, మల్లేష్ యాదవ్, స్వామి, కష్ణరెడ్డి, బంకు శ్రీను, లక్ష్మణ్ గౌడ్, వెంకటేష్ యాదవ్ తదితరులు శుభోదయకాలనీ ఫేజ్-3 భానును స్వయంగా శుభోదయ కాలనీ ఫేజ్-3లో ఇంటికి వెళ్లి పరామర్శించారు.

రాజన్నను అభినందించిన సోమశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నాచారం

కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి నూతనంగా నియమితులైన ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజన్నను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తే రాబోయే కాలంలో కాంగ్రెస్ తప్పకుండా అధికారంలోకి వస్తుందని అన్నారు. అందుకు పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, నాయకులు పిడిమూర్తి, సోఫీ, కార్తీక్, అక్బర్, లింభాజీ,రాము తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- కనీసం వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి
- బీజేపీ ఏజెంట్‌గా మారిన తీన్మార్ మల్లన్న
- సీఐటీయూపై ఆరోపణలు చేయడం సరికాదు
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్.వీరయ్య



నవతెలంగాణ-కాప్రా

కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య డిమాండ్ చేశారు. చర్లపల్లి ప్రాంతంలో కార్మికులకు కనీసం వేతనాలు రూ. 26000 ఇవ్వాలని కోరుతూ ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ వీరయ్య, కార్యదర్శి జే. చంద్రశేఖర్ హాజరై ప్రసంగించారు. ఎస్. వీరయ్య మాట్లాడుతూ చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వలస కార్మికులకు, ఇతర కార్మికులకు రూ. 26 వేల కనీసం వేతనం ఇవ్వాలని సీఐటీయూ న్యాయమైన డిమాండ్ పెట్టిందన్నారు. అదేవిధంగా ప్రస్తుతం టెక్నాలజీ అభివద్ధి చెందుతున్న దశలో వారానికి ఐదు రోజులు పని దినాలు ఉండాలని, రోజూ ఏడు గంటలు పనిగంటలు ఉండాలని తెలిపారు. నిరంతరం కార్మిక సమస్యలపైన పోరాడుతున్న సీఐటీయూ మీద బీజేపీ ఏజెంట్‌గా మారిన తీన్మార్ మల్లన్న తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తీన్మార్ మల్లన్న కార్మిక ప్రయోజనాల కోసం కాకుండా యజమానుల ప్రయోజనాల కోసం మాట్లాడుతున్నారని అన్నారు. సీఐటీయూ అనేక పోరాటాలు చేయడం వల్ల 5 రంగాలలో రూ. 18 వేల కనీస వేతనం కార్మిక శాఖ నిర్ణయించింది కానీ గెజిట్ చేయకుండా యజమానుల సంఘాలు ఆపేసిందన్నారు. వెంటనే ఆ జీవో లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పటి నుంచి 73 షెడ్యూల్ పరిశ్రమలు జీవోలను సవరించే విడుదల చేయకపోవడం వలన కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.కార్మికుడికి రోజుకు రూ.178 తక్కువగా ఉండడానికి వీల్లేదని, 178 రూపాయలకి తక్కువగా ఇచ్చిన వారిపై చర్యలు తీసుకుంటామని మోడీ గొప్పలు చెబుతున్నాడు అంటే ఈ లెక్కన చూస్తే నెలకు 4628 రూపాయలు మాత్రమే కనీస వేతనం ఉండాలని నరేంద్ర మోడీ చెబుతున్నారన్నారు. రూ. 4628తో ఒక కుటుంబం ఎలా బతుకుతుందని ప్రశ్నించారు. అదే వేతనంలో నరేంద్ర మోడీ గానీ ,మంత్రులు, ఎమ్మెల్యేలు కానీ బతుకుతారా అని ప్రశ్నించారు. నిత్యం పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ ,గ్యాస్ ,నిత్యావసర ధరలను అదుపు చేయడం లేదన్నారు. కార్మికులు ఆర్థికంగా మానసికంగా దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. అందుకని కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటూ రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోరాటాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కావున ఈ నెల 1వ తేదీన జరిగే కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరిగే జంతర్ మంతర్ వద్ద జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలన్నారు.

చంద్రశేఖర్ మాట్లాడుతూ 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, వారికి పాసుబుక్కు ఇవ్వాలని అన్నారు. చర్లపల్లి ఇండస్ట్రీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసులు మాట్లాడుతూ చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపైన సర్వే నిర్వహించడం జరిగిందన్నారు .ఈ సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. కాంట్రాక్టు వలస కార్మికులు ఉద్యోగ భద్రత లేకుండా పది, పన్నెండు గంటలు పనిచేస్తున్నారని, వారి శ్రమకు తగిన ఫలితం లేకుండా పోతుందని అన్నారు. అదేవిధంగా కార్మికులను కంపెనీలో నిర్మించిన షెడ్లలో 10 నుంచి 15 మందిని ఉంచుతూ కొంతమంది యజమానులు పని చేయించుకుంటున్నారని సర్వే సందర్భంగా నాయకుల దష్టికి వచ్చిందని తెలిపారు. అదే విధంగా రాత్రిపూట పని చేసి ఇంటికి వెళుతున్న క్రమంలో కార్మికులకు పోలీసులు, ఇతరుల నుంచి వేధింపులు ఎక్కువ అవుతున్నాయనానరు. ఈ సమస్యల పరిష్కారం కోసం చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం దష్టికి తీసుకుని వెళ్లి వలస కార్మికులకు గుర్తింపు కార్డులు, పాస్‌బుక్కులు ఇచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని, పరిష్కరించే విధంగా యజమానులపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. సదస్సులో వివిధ కంపెనీల కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సదస్సులో నాయకులు టీ నరసింహ, రసూల్, జే. వెంకటేష్, ఆదామ్, సంతోష్, ఎస్. శివ ,బాలరాజు, బాబురావు, కరుణాకర్ సుభాష్, మరియమ్మ మణికంత, ,చారి బీమా తదితరులు పాల్గొన్నారు.

వినాయకనగర్‌లో వీధి కుక్కల బెడద



- చికెన్ సెంటర్ల వద్ద మకాం వేస్తున్న శునకాలు
- భయాందోళనలో స్థానికులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక నగర్ డివిజన్ పరిధిలోని వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రధానంగా కాకతీయ నగర్, వినోబా నగర్‌లో కుక్కల వీరంగం చూస్తుంటే పిల్లలు పెద్దలు భయాందోళనకు గురవుతున్నారు. ఒకే చోట 10 నుంచి 20 కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై సంచరిస్తున్నాయి. చిన్నపిల్లలు రోడ్డు మీద నడవాలంటే జంకుతున్నారు. చికెన్ సెంటర్‌ల వద్ద కోళ్ల వ్యర్థ పదార్థాలు వేయడంతో కుక్కలు వాటి కోసం అక్కడే మకాం వేసి ఉంటున్నాయి. సమూహంగా ఏర్పడి రాత్రి పగలు అనే తేడా లేకుండా ప్రధాన రహదారిపైనే సంచరిస్తున్నాయి. ఈ కుక్కలను చూసి స్థానికులు బెంబేలేత్తుతున్నారు. ఇటీవల హైదరాబాదులో కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి ఘటన అందరినీ కలచివేసింది. అయినా కుక్కలను నివారించేందుకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

ఉర్సు ఉత్సవాలు మత సామరస్యతకు ప్రతీకగా నిలుస్తాయి

- ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-నేరేడ్ మెట్

ఉర్సు ఉత్సవాలు మత సామరస్యత ప్రతీకగా నిలుస్తాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్ శైలీ గార్డెన్స్ వద్ద ఉన్న దర్గాలో ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక ప్రార్థనలలో ఎమ్మెల్యే తో పాటు డివిజన్ కార్పొరేటర్ మీనా, బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, అనిల్ కిషోర్ గౌడ్, నాయకులు గోకుల్ చిత్ర, మహత్యచెన్నారెడ్డి, శివ,శ్రీనివాస్ రావు, మహేష్, రవీందర్, జయరాం, రమేష్, మోహన్, ముఖేష్, కిషోర్, ఉత్తమ్ రెడ్డి, లోహిత్,గోపి, ఆంజనేలు, నవీన్, నవనీత, విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి



నవతెలంగాణ-నాచారం

యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో కొమరవెల్లి మల్లన్న దేవస్థానం పాలకమండలి సభ్యుడుగా ఎర్రగొల్ల మల్లేష్ యాదవ్ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ గత నలభై సంవత్సరాలుగా నమ్మిన సిద్ధాంతం కోసం నమ్మకంతో బండారి కుటుంబంతో అవినాభావ సంబంధం కొనసాగిస్తున్న యాదవులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, యాదవ సంఘం ప్రతినిధులు అల్లాడి కష్ణ యాదవ్, విఠల్ యాదవ్, బిక్షపతి యాదవ్, శ్రీశైలం యాదవ్, సాయిలుయాదవ్, సంపత్ యాదవ్, జనార్ధన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మెడికో ప్రీతీ ఆడియో కలకలం

- సైఫ్ వేధింపులు మితిమీరిపోతున్నాయని ఆవేదన

నవతెలంగాణ-హైదరాబాద్

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ఆత్మహత్యకు యత్నించి నిమ్స్ ఆస్పత్రిలో గత ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న మెడికల్ విద్యార్థి ప్రీతి మృతి చెందింది. అయితే ఆత్మహత్యకు అంతకు ముందు రోజు ప్రీతి తన తల్లితో మాట్లాడిన ఆడియో కలకలం రేపింది. ఫోన్ కాల్‌లో ప్రీతి తన బాధను తన తల్లితో చెప్పుకుంది. 'సైఫ్ నాతో పాటు చాలా మంది జూనియర్‌లని వేధిస్తున్నాడు. సీనియర్లు అంతా ఒకటేనని తెలిపింది. ప్రీతి తండ్రి పోలీసులతో ఫోన్ చేయించినా లాభం లేకుండా పోయింది. సైఫ్ వేధింపులు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని తల్లితో బాధపడుతూ ప్రీతి కుమిలిపోయింది. ఒక వేళ నేను సైఫ్‌పై ఫిర్యాదు చేస్తే సీనియర్లందరూ ఒకటైపోయి నన్ను దూరం పెడతారని ఆవేదన వ్యక్తం చేసింది. సైఫ్‌తో మాట్లాడి ఇబ్బంది లేకుం డా చేస్తాను అని చెప్పి ప్రీతి తల్లీ నచ్చజెప్పింది. అయినా హెచ్ఓడీ నాగార్జున రెడ్డి ఏదైనా ఉంటే నా దగ్గరికి రావాలి కానీ ప్రిన్సిపాల్‌కు ఎందుకు ఫిర్యాదు చేశారని తనపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు ప్రీతి తన తల్లితో చెప్పింది.

సోనియా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-కాప్రా

సోనియా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఫేస్-3) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ సమస్యల పరిష్కారం కోసం, అలాగే ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్ గౌడ్, సోనియా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్య క్షుడు రాజారత్నం, జనరల్ సెక్రెటరీ ముత్యాల కరుణాకర్, కోశాధికారి చెరుకు వెంకటేష్ ,ఉపాధ్యక్షులు మురళి, సంయుక్త కార్యదర్శి ఎస్ విక్రమ్, గౌరవ అధ్యక్షులు కొండ సత్యనారాయణ గౌడ్, నాసగోని పరశురాం గౌడ్, ముఖ్య సలహాదారులు జగన్ నాయక్, సురేందర్ రెడ్డి, శ్రీపాల్ ,మల్లేష్, వెంకటేష్ వివిధ కాలనీ అధ్యక్షులు , అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చర్లపల్లి డివిజన్ విద్యమారుతినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, సోనియా గాంధీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫేజ్-3 నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ , చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌లు హాజరై వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోళ్ళురి అంజయ్య , చర్లపల్లి డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కౌన్సిల్‌కు మేధావులను పంపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులది

- టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

శాసన మండలికి మేధావులను పంపాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రొఫెసర్ ఏ.వినయ బాబును మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం నగరంలోని జీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జీహెచ్ఎస్ సీతాఫల్ మండి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జీహెచ్ఎస్ నల్లకుంట, జీహెచ్ఎస్ జమిస్తాన్‌పూర్, జీహెచ్ఎస్ కవాడిగూడ సందర్శించారు. ఈ సందర్భంగా ముత్యాల రవీందర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ వ్యవస్థ ఉపాధ్యాయులకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి తగిన సూచనలు చేయకపోవడం వల్ల నేడు విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందన్నారు. కాబట్టి ఉపాధ్యాయులందరూ విజ్ఞులుగా ఆలోచించి ఎలాంటి రాజకీయాలతో సంబంధం లేని అభ్యుదయ వాది, విద్యావేత్త, స్వతంత్ర అభ్యర్థి ప్రొఫెసర్ వినయ బాబుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. 2015 నుంచి పదోన్నతులు ఇవ్వకపోవడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా నాణ్యమైన విద్య అందక పేద విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ వినయ బాబు మాట్లాడుతూ విద్యారంగంలోని అన్ని స్థాయిల విద్యాపైన సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తిగా తనను కౌన్సిల్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, జిల్లా కౌన్సిలర్ జి.సురేష్, సీహెచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ మహాసభకు హాజరైన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ ఫేజ్ 1 ప్లే గ్రౌండ్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, ఉప్పల్, కాప్రా సర్కిల్ ప్రాంతీయ మహాసభల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, సభాధ్యక్షులు వై. పున్నారావు, ఈపీఎఫ్ పెన్షనర్స్ కోఆర్డినేషన్ అధ్యక్షులు ఎం.ఎస్.రెడ్డి, పాలకుర్తి కృష్ణమూర్తి, మచ్చ రంగయ్య, పి నారాయణరెడ్డి, రాఘవరావు, నాగేశ్వర్ రావు, వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గరిక సుధాకర్, గడ్డం రవికుమార్, లేతకుల రఘు పతి రెడ్డి, బాలరాజు, రామకృష్ణ, చంద్రశేఖర్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో నిరంతర మెడికల్ క్యాంపు అభినందనీయం



నవతెలంగాణ-కాప్రా

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిరంతరం నిర్వహించడం అభినందనీయమని సేవ్ వాటర్, సేఫ్ వాటర్ ఫౌండేషన్, ఫౌండర్ పద్మాన్ అన్నారు. ఆదివారం చర్లపల్లి డివిజన్ చక్రిపురం చౌరస్తాలోని చక్రి విద్యా నికేతన్ హై స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక, కాప్రా, కీసర, మల్కాజిగిరి మండలాల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును ఆదివారం వారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 82 నెలలుగా బీపీ షుగర్ బాధితులకు మెడికల్ క్యాంపును నిరంతరంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు, ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తూ రిటైర్డ్ అయిన వారు స్వచ్ఛందంగా పని చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జేవీఎకే రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు పి.నాగరాజు, ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, మెడికల్ క్యాంపు ఆర్గనైజర్ కర్ణకర్ రెడ్డి, డాక్టర్లు రమణ, డాక్టర్ విద్యాసాగర్, జయరాజ్, వాలంటీర్లు సోమయ్య చారి, దుర్గాచారి, శేషు, నాగేశ్వరరావు, వెంకటరమణ, శివ ప్రసాద్, శివ శంకర్ రెడ్డి, బసవ పున్నయ్య, సంజన తదితరులు పాల్గొన్నారు.

మధురానుభూతులు నెమరేసుకున్న మదర్స మైనార్టీ పిల్లలు

- రాగిడి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-నాచారం

మదర్సా మైనారిటీ బడి పిల్లల మధురానుభూతులు నెమర వేసుకున్నారని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. నాచారం డివిజన్ పరిధిలోని మదర్స 11వ వార్షికోత్సవం వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మైనారిటీ పిల్లలకు మదర్సా విద్యాబుద్ధులు నేర్పిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు. ప్రతిభ కలిగిన మైనారిటీ విద్యార్థులను అభినందనలు తెలిపి వారికి అన్ని విధాలుగా మధురా చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడల మల్లికార్జున్ గౌడ్, అబ్దుల్ రషీద్ (ఆశు), ప్రభాకర్, గ్యార కిరణ్, టోనీ ఫ్రాన్సిస్, సాయి రెడ్డి, యూసుఫ్, సన్నీ గౌడ్, సంతోష్, మదర్సా నిర్వాహకుడు ఆఫీస్ ఖురాన్, తదితరులు పాల్గొన్నారు.



కాలు విరిగిన సూర్య నారాయణకు ఆర్థిక సహాయం అందించిన సజ్జా రామ తులసి ,సుదర్శన్ రావు, లయన్ మదుల. ఈ కార్యక్రమంలో బాబురావు, డాక్టర్ సందీప్ , మేరి, సూర్య నారాయణ పాల్గొన్నారు.
నవతెలంగాణ-కాప్రా

ఎర్రగొల్ల మల్లేష్ యాదవ్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-నాచారం

నాచారం యాదవ సంఘం అధ్యక్షులు, కొమరవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా ఎన్నికైన ఎర్రగొల్ల మల్లేష్ యాదవ్‌కు నాచారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆత్మీయ సన్మానం చేసినట్టు యాదవ సంఘం ప్రతినిధులు గడ్డం నరసింహ యాదవ్, బిక్షపతి యాదవ్, గడ్డం రమేష్ యాదవ్ తెలిపారు. నాచారం భద్ర గార్డెన్ వైద కన్వెన్షన్ హాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు.కొమరవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పాలకమండలి సభ్యుడుగా ఎన్నిక కావడం అభినందనీయమని అన్నారు. మల్లికార్జున స్వామి ఆశీస్సులతో భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులను పొందాలని నాచారం యాదవ సంఘం మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. సంఘం ప్రతిని ధులు విఠల్ యాదవ్, మల్లేష్ యాదవ్, గడ్డం రాజు యాదవ్, బిక్షపతి యాదవ్, మహేష్ యాద వ్, శ్రీకాంత్ యాదవ్, మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే ఆనందం ఉంది

- రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ చైర్మెన్ పెద్ది శంకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదలకు సేవ చేయడంలోనే ఆనందం ఉందని, సమాజ సేవ చేయాలనే సంకల్పంతోనే పలు కార్యక్రమాలు చేస్తున్నామని, ఇలాంటికి ఇంకా ఎనో చేస్తూనే ఉంటామని సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ , కోఆర్డినటర్ ప్రకాష్ మాట్లాడుతూ రెడి టూ సర్వ్ ఫౌండేషన్ ద్వారా వనస్థలిపురంలో ఒక 20 బడ్‌లతో ఓల్డ్ ఏజ్ హోమ్ కూడా రన్ చేస్తున్నాం అన్నారు అన్నీ దానాలలో కల్లా అన్నదానం ఎంతో గొప్పదని చెబుతూ ఉంటారని... రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఇలాంటి ఎన్నో గొప్ప కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. అన్నదానం అంటే ప్రాణాన్ని దానం చేయడమేనని అన్నదానాన్ని ఒక యజ్ఞంలా భావించి చేసేవారు చాలా అరుదు అని.. ఆ లిస్టులో రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఉండడం విశేషమని అన్నారు. బీఆర్ఎస్ లీడర్, భోగు వరపు వరుణ్ మాట్లాడుతూ ఈ రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ద్వారా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఈ రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ సేవలో పాలు పంచుకోవాలని అనుకునేవారు ఈ నంబరు 9701295527ను సంప్రదించి మీకు చేతనైన సహాయం చేయవచ్చు అన్నారు. కార్యక్రమంలో శివ చైతన్య ప్రశాంత్, పి ఆర్వో లక్ష్మణ్, నవీన్, ప్రవీణ్, రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ వాలెంటరీస్ నవీన్, రాజు, శివ, నితిన్ తదితరులు పాల్గొన్నారు



వస్త్రాలంకరణకు హాజరైన మాజీ మేయర్

నవతెలంగాణ-కాప్రా

హెచ్‌బీ కాలనీ దూసరి నవీన్ గౌడ్ కూతురి వస్త్రాలంకరణ కార్యక్రమానికి నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య , డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

మార్చి 2 నుంచి ఫర్నిచర్ ఎక్స్‌పో

నవతెలంగాణ-హైదరాబాద్

గ్రేటర్ నోయిడా ఢిల్లీ లోని ఇండియా ఎక్స్పో మార్ట్ మార్చి 2 నుండి 5 వరకు ఢిల్లీ వుడ్ ప్రదర్శన షో జరగనుంది. రాబోయే ఢిల్లీ వుడ్ 7వ ఎడిషన్లో, చెక్క పని ఫర్నిచర్ తయారీ పరిశ్రమకు చెందిన వాటాదారులు, అనేక జాతీయ అంతర్జాతీయ నిర్ణయాధికారులు ఈ షోలో పాల్గొన నున్నారు. ఈ ప్రదర్శనలో లేటెస్ట్ ఫర్నీచర్ ప్రొడక్షన్ టెక్నాలజీస్, వుడ్ వర్కింగ్ మెష "నరీ, టూల్స్, ఫిట్టింగ్స్, యాక్సెసరీస్, రామెటీరియల్స్ మరియు ప్రొడక్ట్ మొదలైనవి ఉంటాయి. ఈ నాలెడ్జ్ షేరింగ్ ఫోరమ్, ఢిల్లీలో ప్రముఖ పరిశ్రమల సంఘాలు నిర్వహించే తాజా పోకడలు ఆవిష్కరణలపై బహుళ సెమినార్లు, అలాగే ఫర్నీచర్ అండ్ ఫిట్టింగ్స్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించే స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్లు ఉంటాయి. ఇండియా మ్యాట్రెస్టెక్ ప్లస్ అప్‌రీ లెరీ సప్లైస్ ఎక్స్పో, మ్యాట్రెస్ ప్రొడక్షన్ మెషినరీ సామాగ్రి, మ్యా ట్రెస్ ఫినిషింగ్ మెషినరీ, సామాగ్రి, ప్రొడక్షన్ టూల్స్ ఎక్విప్మెంట్, అప్ హెరీల్స్టరీ ప్రొడక్షన్ టెక్నాలజీ, మెషినరీ సామాగ్రి, బెడ్ సిస్టమ్స్, కొత్త మెటీరియల్స్, ట్రేడ్ అసోసియేషన్లు ప్రదర్శించ బడతాయి.

జమ్మిగడ్డలో జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డ బి.జె.ఆర్ కాలనీలో జ్ఞానమాల కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ చిత్రపటానికి లక్ష్మీనారాయణ నాయక్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో. బి.జె.ఆర్ కాలనీ అధ్యక్షులు రహీం, బి.ఆర్.ఎస్ డివిజన్ ఎస్సీ విభాగం ప్రెసిడెంట్ మాట్ల గిరి, జమ్మిగడ్డ వాసులు దయానంద్, నాగేష్, వెంకటయ్య, నరేందర్ రావు,అనిల్ పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-అడిక్‌మెట్

హైదరాబాద్ రోడ్ల పైన దయనీయస్థితిలో దుర్భర జీవితాన్ని గడుపుతున్న అనాథలు, అభాగ్యులకు స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 223 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ నటుడు గౌతమ్ రాజు హాజరై పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమములో ఫౌండేషన్ ప్రెసిడెంట్ వై.సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని, సభ్యులు బి.వర్షిత, దీపిక, శ్రీ వర్షిత రెడ్డి, శిరీష, ఇర్ఫాన్, శుభం, అఖిల్, హరీష్, సాయిరాం పాల్గొన్నారు.

'గరం బక్కిట్ బిర్యానీ' కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-ఓయూ

పద్మారావునగర్ ప్రాంతంలో బీఆర్ఎస్ బౌద్ధనగర్ డివిజన్ నాయకులు గంగాపురం ఆంజనేయులు గౌడ్ కొత్తగా నెలకొల్పిన 'గరం బక్కిట్ బిర్యానీ' సంస్థను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఖాతాదారుల అవసరాలకు అనుగుణంగా సేవలు అందించే కేంద్రాలకే గుర్తింపు లభిస్తుందన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా బిర్యానీ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, కుమారి సామల హేమ, బీఆర్ఎస్ నాయకులు ఎం.ఎన్.శ్రీనివాస్, గుర్రం పవన్ కుమార్ గౌడ్, కంది నారాయణ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇస్తలేరు..

జనవరి నుంచి ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
నిలిపేయడానికి కారణాలు తెలియదంటున్న సంబంధిత అధికారులు
వెంటనే ఇవ్వాలని ప్రజల వేడుకోలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయికి కిలో బియ్యం, ఒక్క మనిషికి 6 కిలోలు ఇస్తున్న బియ్యాన్ని పౌరసరఫరాల ద్వారా నిలిపివేశారు. ఖైరతాబాద్ సర్కిల్ సెవెన్ పరిధిలో 81 రేషన్ షాపులు ఉన్నాయి. ఎక్కడా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బియ్యం సరఫరా కావడం లేదు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిలిపేసిందో తమకు కూడా తెలియటం లేదని చెప్పడం గమనార్హం. డీలర్లకు ఒక కేజీ బియ్యానికి 70 పైసలు కమిషన్ మాత్రమే ఇస్తున్నారు. అవి సరిపోక డీలర్లు అడ్డదారులలో బియ్యాన్ని అమ్ముకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం మనిషికి 5 కిలోలు ఉచితంగా ఇచ్చే దొడ్డు బియ్యం మాత్రమే డీలర్ల వద్దకు చేరాయి. వాటిని కార్డు దారులకు ఇస్తున్నారు. ప్రతి రేషన్ షాపులో మోడీ ఫోటో పెట్టి కార్డుదారులకు అందిస్తున్నారు. అయితే రేషన్ కార్డుదారులకు ఇస్తున్న బియ్యం కేంద్రం ఇస్తుందో? రాష్ట్రం ఇస్తుందో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి ఉంది. కొంతమంది డీలర్లు మాత్రం ఇప్పుడు ఇస్తున్న బియ్యం కేంద్రం ఉచితంగా ఇస్తుందనీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి బియ్యం రావడం లేదు అని బహిరంగంగానే చెబుతున్నారు. రేషన్ కార్డు ఉన్నవారు ఇచ్చిన బియ్యం తీసుకుని వెళ్తున్నారు. కేంద్ర ప్రభుత్వం 2023 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఒక్కొక్కరికి ఐదు కిలోలు ఉచితంగా పంపిణీ చేయడానికి నిర్ణయించింది. ఈ ఏడాది మొత్తం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న బియ్యం మాత్రమే ఇస్తారా? లేక రాష్ట్ర ప్రభుత్వం కూడా కిలో రూపాయి చొప్పున ఒక్క మనిషికి ఆరు కిలోలు ఎప్పుడు ఇస్తుందో తెలియని పరిస్థితి ఉంది. అసలు రాష్ట్ర ప్రభుత్వం బియ్యం ఇవ్వటం లేదని కార్డు ఉన్నవారికి తెలియట్లేదు.. నాయకులకు కూడా తెలియదు. అందరూ అయోమయంలో ఉన్నారు. ఒకపక్క ప్రతిపక్షం నాయకులు రేషన్ షాపులలో సన్న బియ్యం ఇవ్వాలని సీఎంపై ఒత్తిడి తెస్తున్నారు. సన్న బియ్యం ఇవ్వలేక, ఇస్తున్న దొడ్డు బియ్యాన్ని కూడా నిలిపివేశారు అని ప్రజలు మండిపడుతున్నారు. దొడ్డు బియ్యాన్ని 50శాతం మంది కార్డుదారులు డీలర్ల వద్ద బియ్యం తీసుకోవడం లేదు. దానికి బదులుగా కేజీకి రూ.10 చొప్పున డబ్బులు తీసుకుంటున్నారు. కొంతమంది డీలర్లు బహిరంగంగానే బియ్యం కావాలా? డబ్బులు కావాలా? అని అడిగి మరీ ఇస్తున్నారు. ఇదంతా అధికారులు, నాయకులకు తెలుసు. అయినా పట్టించుకోవడం లేదు. డీలర్లు వారి వద్ద నిల్వ ఉన్న బియ్యాన్ని రూ.15కు బ్లాక్ మార్కెట్లో చీకటి దందా చేస్తూ అమ్ముతున్నారు. బియ్యం కొన్న దళారులు కొన్ని ప్రాంతాలు, చీకటి ప్రదేశాల్లో గోడౌన్లు ఏర్పాటు చేసుకుని సేకరించిన బియ్యాన్ని ఒకేసారి లారీలకు లోడ్ చేసి మిల్లులకు తరలిస్తున్నారు. అనేక సందర్భాల్లో మిల్లులకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసులు పెట్టిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. వెంటనే కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వం అయినా సన్న బియ్యం కార్డుదా రులకు ఇవ్వాలనీ, అందరూ తినేలా బియ్యం ఉండాలని కోరుతున్నారు.



వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బియ్యం ఇవ్వాలి



రేషన్ షాపులలో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వాటా బియ్యం ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇవ్వాలి. అసలు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని ఈ ఏడాది జనవరి నుంచి ఎందుకు ఇవ్వటం లేదు అనే విషయాన్ని బహిరంగంగా సీఎం కేసీఆర్ తెలియజే యాలి. లేదంటే కార్డు గల మహిళలతో అన్ని రేషన్ షాపుల వద్ద నిరసనలు తెలుపుతాం. మహిళలతో కలిసి ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం. అందరూ తినే సన్న బియ్యం ఇవ్వాలి.

సర్కిల్ 7 విజిలెన్స్ కమిటీ మెంబర్, ప్రజా సంఘాల నాయకులు సాయి శేషగిరిరావు

ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్, కల్యాణ్ నగర్ వెంచర్ త్రీ లో స్పీడ్ బ్రేకర్లను ఇష్టానుసారంగా, ఎక్కువ ఎత్తుతో, ఆరు అంగుళాల ఎత్తుతో వేయించారు. కనీసం అవగాహన లేకుండా అడ్డ మీద కూలీలతో తారు పోసి స్పీడ్ బ్రేకర్లు వేశారు. స్పీడు బేకర్లను స్ట్రీట్ లైట్లు లేని చీకటి ప్రదేశాల్లో వేశారు. స్ట్రీట్లై ట్లు లేని చోట స్పీడు బ్రేకర్లు వేయకూడదు అనే అవగాహన లేకుండా ఇష్టానుసారంగా కాలనీలోని అన్ని రోడ్లలో వేశారు. ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు.. జీబ్రా లైన్స్ లేవు.. రాత్రిపూట అనేకమంది ద్విచక్ర వాహనదారులు తెలియక స్పీడ్‌గా రావడంతో అనేక ప్రమాదాలు జరిగాయి. అసలు స్పీడ్ బ్రేకర్లు వేయించింది అధికారులా? లేక అవగాహన లేని కాంట్రాక్టర్లా అనే అనుమానాలు వస్తున్నాయి. అడ్డా మీద కూలీలతో తారును కుప్పలుగా ఎత్తుగా పోసి వెళ్లారు. వెంటనే జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు వేసిన స్పీడ్ బ్రేకర్లను పరిశీలించి, తొలగించి, రబ్బర్ స్పీడ్ బ్రేకర్లు వేయాలనీ, స్పీడ్ బ్రేకర్ వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టాలనీ, స్పీడ్ బ్రేకర్లపై రేడియం స్టిక్కర్లు వేయాలని కళ్యాణ్ నగర్ వెంచర్ త్రీ ప్రజలు కోరుతున్నారు. భార్గవి హాస్పటల్ లైన్‌లో మూడు స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. జైస్వాల్ హాస్పిటల్ ఎదుట మూడు స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా ఉన్నవి. కార్లు, బస్సులు కూడా ఎగిరి పడుతూ ప్రయాణికులు భయపడుతున్నారు. వెంటనే జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది, డిప్యూటీ కమిషనర్ కాలనీలో వేసిన స్పీడ్ బ్రేకర్లను పరిశీలించి ఎంత ప్రమాదకరంగా ఉన్నాయో తెలుసుకుని వాటిని తొలగించి, రబ్బర్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేదంటే ప్రజలే వాటిని తొలగించడానికి సిద్ధంగా ఉన్నారు. ముఖ్యంగా రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు అనేకమంది కింద పడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మోడీ ఫాసిస్ట్ మతోన్మాద జాతీయవాదం దేశానికి ప్రమాదకరం



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రధాని మోడీ ఫాసిస్ట్ మతోన్మాద జాతీయవాదం దేశానికి ప్రమాదకరం అని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ 19 వ జాతీయ మహాసభ ఆందోళన వ్యక్తం చేసింది. భవిష్యత్తులో ఫార్వర్డ్ బ్లాక్ కలసివచ్చే వామపక్ష, ప్రజాస్వామ్య, ప్రగతిశీల పార్టీలతో కలసి మోడీ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా భారీ ఎత్తున ఉద్యమాలు నిర్మించాలని మహాసభ నిర్ణయించింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ 19 వ జాతీయ మహాసభలు ముగిశాయి. ఈ మహాసభలలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నూతన జాతీయ కార్యదర్శి జి.దేవరాజన్ ఏకగ్రీవంగా ఎన్నికకాగా ఆయనతోపాటు పార్టీ జాతీయ చైర్మన్‌గా నరేన్ చటర్జీ, వైస్ చైర్మన్‌గా పి.వి.కతిరవన్, కేంద్ర కార్యదర్శులుగా అసిమ్ సిన్హా, దాలిరం, జ్యోతి రంజన్ మహాపాత్ర, సంజయ్ భట్టాచార్య, బండా సురేందర్ రెడ్డి, అమరేష్ కుమార్, మోహన్ నంది, గోవింద్ రాయ్, జి.ఆర్. శివశంకర్, బివాస్ చక్రవర్తి లతో పాటు 65 మంది జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ కార్యదర్శి జి.దేవరాజన్ మాట్లాడుతూ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ మహాసభలు ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ కమిటీ హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించిందని అభినందించారు. ఈ మహాసభలలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 84 మంది ప్రతినిధులు దేశ సామజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై చర్చించారని తెలిపారు. మోడీ ప్రభుత్వం వచ్చాక దేశంలో మితవాద దాడికి తెరలేచిందనీ, మితవాద నయా-ఉదారవాద ఆర్థిక విధానాల కలయిక, హిందూత్వ ఎజెండా దాడులు దేశ పురోగతికి ప్రమాదకరమనీ, ఈ దాడిని ఎలా ఎదుర్కోవాలి అనే దానిపై దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులతో కలసి ఎదుర్కోవాలని సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంతర అబద్ధాలు, భారీ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి జాతీయ భద్రతా సమస్యను విరక్తంగా ఉపయోగించుకోవడాన్ని తిప్పికొట్టాలన్నారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ ఆస్తులని అదానీ, అంబానీ లాంటి మోసగాళ్లకు కారుచౌకగా అమ్ముకుంటుందని ఆరోపించారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలకు అడ్డు, అదుపు లేకుండా పోయిందన్నారు. సామాన్య ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. రోజురోజుకూ దూసుకుపోతున్న నిరుద్యోగ సమస్యను మోడీ గాలిలోకి వదలేసాడనీ, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్న మోడీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. భయం, అభద్రతా వాతావరణం అన్నింటిలోనూ ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, విద్యావేత్తలు, రచయితలు ఉన్నారనీ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఓబీసీలు, మైనారిటీల కోసం ఉన్న రాజ్యాంగపరమైన రక్షణలపై ఉద్దేశపూర్వకంగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఫాసిజం, ద్వేషం, విభజన ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీను ఓడించడానికి అన్ని వామపక్ష, ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు ఏకమై బీజేపీ ప్రభుత్వాన్ని బట్టబయలు చేసేందుకు తమ శక్తియుక్తులను వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.వి.ప్రసాద్, ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి, మహాసభల ఆహ్వాన సంఘం సభ్యులు సుందర రామరాజు, కె.తేజదీప్ రెడ్డి, బి.రాములు యాదవ్, జి.వంశీధర్ రెడ్డి, కొమ్మూరి వెంకటేష్ యాదవ్, ఆవుల శ్రీకాంత్ యాదవ్, సయ్యిద్ తౌఫిక్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

మొదటి ప్రీ ఫైనల్ 27 నుంచి మార్చి 13 వరకు
మార్చి 14 నుంచి 29 వరకు రెండో ప్రీ ఫైనల్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి విద్యార్థులకు నేటి నుంచి మార్చి 13వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. రెండో విడుత ప్రీ ఫైనల్-2 పరీక్షలు మార్చి 14వ తేదీ నుంచి మార్చి 29 వరకు నిర్వహించనున్నారు. వెనుకబడిన వారిని గుర్తించి పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు వీలుగా మరోసారి ప్రతి సబ్జెక్ట్‌లో ఆరు ప్రత్యేక ప్రశ్నాపత్రాలు రూపొందించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వార్షిక పరీక్షల తరహాలోనే సమగ్ర మూల్యాంకణ చేయనున్నారు. పది వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధించేందుకు కృషి చేస్తున్నామని డీఈవో ఆర్.రోహిణి తెలిపారు. విద్యాశాఖ ప్రణాళికలను అమలుపరుస్తూ.. ప్రధానోపాధ్యాయులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలనీ, ప్రీ ఫైనల్ పరీక్షలు బాగా రాస్తే ఫైనల్ పరీక్షల్లోనూ మెరుగ్గా రాస్తారని తెలిపారు.



దేశ సమగ్రతను కాపాడటానికే హాత్ సే హాత్ జోడో యాత్ర

నవతెలంగాణ-అంబర్‌పేట

దేశ సమగ్రతను లౌకికత్వాన్ని కాపాడానికే హాత్ సే హాత్ జోడో యాత్ర ఉపయోగపడుతుందని రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షులు నూజివీడు శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ పరిధిలోని హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి విచ్ఛినం చేస్తున్నాయన్నారు. దేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ సంపన్నులకు దేశ సంపాదన దోచిపెడుతూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. పేదల పైన అనేక రకాలు పనులు వేసి వచ్చిన ఆదాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ కుల మతాల పేరుతో దేశాన్ని విడగొడుతున్నారన్నారు. అనంతరం బీజేపీ మైనార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ కో-ఆర్డినేటర్ రంగా ప్రదీప్‌గౌడ్, హైదరాబాద్ మైనార్టీ కన్వీనర్ సోహెల్, సంపత్, సర్వరాజు, సాయి పాల్గొన్నారు.

ముగిసిన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 24,053 మంది అభ్యర్థులకు నగరంలో పలు ప్రాంతాల్లో 51 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షను ఉదయం 9.45 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు రెండు పేపర్లుగా నిర్వహించారు. మొత్తం 24,056 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఉదయం 14,426 మంది (69 శాతం), మధ్యాహ్నం 14,150 మంది (69.90 శాతం) హాజరయ్యారు. అన్ని పరీక్షల కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు ఉదయం 9గంటల నుంచి లోపలికి అనుమతించారు. అంతకుమందు సుమారు ఉదయం 7 గంటలకే అదనపు కలెక్టర్ పేపర్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకుని.. పోలీసుల బందోబస్తు మధ్య పేపర్లను ఆయా కేంద్రాలకు పంపించారు.

విద్యార్థుల మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలి

గురుకుల పాఠశాలల్లో పౌష్టికాహారం అందించాలి
బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
ఇందిరా పార్కు దర్నా చౌక్ వద్ద ధర్నా



నవతెలంగాణ-అడిక్‌మెట్

పెరిగిన ధరల ప్రకారం రాష్టంలోని 8 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్, గురుకుల పాఠశాల కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్‌లు పెంచాలని బీసీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వందలాదిమంది విద్యార్థులతో కలిసి ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సంద్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఏండ్ల క్రితం ఆనాటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్‌చార్జీలు, స్కాలర్ షిప్‌లనే నేటికీ కొనసాగిస్తున్నారన్నారు. ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగడంతో హాస్టల్ "మెను" పాటించడానికి డబ్బులు సరిపోవడం లేదన్నారు. గుడ్లు, పండ్లు తగ్గించారని చెప్పారు హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన ప్రభుత్వానికి రాకపోవడం దుర్మార్గం అన్నారు. సంబంధిత మంత్రులు, కమిషనర్లు ఒక్క నాడు కూడా హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల సాదక బాధకాలు తెలుసుకోలేదన్నారు. పోరాడకపోతే హాస్టళ్ళ పరిస్థితి మెరుగుపడే అవకాశం లేదన్నారు. ఉద్యోగుల జీతాలు రెండు సార్లు పెంచారనీ, శాసనసభ్యులు, మంత్రుల జీతాలు మూడురెట్లు,వృద్ధాప్య పెన్షన్లను ఐదు రెట్లు పెంచారనీ, ఎస్సీ/ఎస్టీ/మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, మెస్ చార్జీలు మాత్రం పెంచలేదన్నారు. రాష్టంలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాల లకు ఒక్క దానికి కూడా సొంత భవనం లేదన్నారు. కేటా యించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అధికారులు లంచాలు తిని దారదత్తం చేస్తున్నారన్నారు. బీసీ కాలేజీ హాస్టళ్లకు, గురుకుల పాటశాలలకు స్వంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటే ష్, జీలపల్లి అంజి, వేముల రామకృష్ణ, రాజ్ కుమార్, గూజ సత్యం, అనంతయ్య, రాందేవ్ మోడీ, నిఖిల్, అరవింద్, అన్నపూర్ణ, కోటేశ్వరి, చందన, ఉమాదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

దుర్భర జీవితాలు గడుపుతున్న మాజీ సైనికులు

హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్
ఇందిరా పార్కు వద్ద మాజీ సైనికుల ధర్నా



నవతెలంగాణ-అడిక్‌మెట్

రాష్ట్రంలో మాజీ సైనికుల సంక్షేమం కోసం అనేక పథకాలు ఉన్నా ఒక్క సైనికుడు కూడా లబ్ది పొందలేదనీ, దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మాజీ సైనికుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఈటల రాజేందర్ మాట్లాడారు. దేశ రక్షణ కోసం అహర్నిశలు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా నిరంతరం పోరాడుతున్న సైనికులకు రాష్ట్రంలో కనీసం సంక్షేమ పథకాలు కూడా అందడం లేదన్నారు. పక్క రాష్ట్రాల్లో మాజీ సైనికులకు ఉద్యోగాలు అమలు చేస్తున్నా మన రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రతి పోటీ పరీక్షల్లో వేరువేరు పద్ధతులు పాటించడం వల్ల మాజీ సైనికులు అర్హత సాధించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పోటీ పరీక్షల్లో మాజీ సైనికులకు ఫీజు రాయితీ ఉన్న నోటిఫికేషన్‌లకు సాధారణ అభ్యర్థుల లాగే ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మాజీ సైనికుల సంక్షేమం కోసం అనేక పథకాలు ఉన్నా బీఆర్ఎస్ ఏర్పడినప్పటి నుంచి ఒక్క మాజీ సైనికునికి కూడా లబ్ది పొందలేదన్నారు. ప్రభుత్వం రైతు వేదికలు, జిల్లాల్లో కమ్యూనిటీ హాల్స్ నిర్మించిన విధంగా మాజీ సైనికులకు కూడా ప్రతి జిల్లాలో కమ్యూనిటీ హాలు నిర్మించి రాష్ట్ర సైనిక బోర్డ్ డైరెక్టర్ బాధ్యత తీసుకోవాలని కోరారు. దేశ రక్షణలో అమరులైన అమర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించడానికి ప్రతి జిల్లాలో ప్రభుత్వ అమరవీరుల స్థూపాన్ని నిర్మించి విజయ దివాస్ ఆర్మీ నేవీ ఐరిఫోర్స్ లాంటి గొప్ప గొప్ప కార్యక్రమాలని అధికారిక లాంచనాలతో జరిపేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఈ ధర్నాలో తెలంగాణ మాజీ సైనిక్ ప్రెసిడెంట్ శ్యాం కుమార్, ఉపాధ్యక్షులు శాతిరి గంగరాజు, మహబూబ్ నగర్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రెడ్డి, భూపాల్ పల్లి ప్రెసిడెంట్ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోజ్ బడ్స్ హై స్కూల్-వైజ్ఞానిక ప్రదర్శన



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట మల్లికార్జున నగర్‌లో గల రోజ్ బడ్స్ పాఠశాలలో 'వైజ్ఞానిక ప్రదర్శన' ఈ నెల 25, 26వ తేదీల్లో నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభా పాఠలను, తెలుగు భాష, సంస్కృతులను కళల రూపంలో ప్రదర్శించారు. 'శాస్త్ర-సాంకేతిక, వైజ్ఞానిక' రంగాలకు సంబంధించి దాదాపుగా మూడు వందల ఎగ్జిబిట్స్, వర్కింగ్ మోడల్స్ తల్లిదండ్రులను, సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాటిలో ముఖ్యంగా వ్యర్థ పదార్థాలతో కరెంటు ఉత్పత్తి, వర్షపు నీటితో విద్యుత్తు ఉత్పత్తి" "సహజ పద్ధతిలో నీటిని శుద్ధి చేయుట, 'హైడ్రాలిక్ పవర్ (జె.సి.బి), 'రాకెట్' ప్రయోగం ముఖ్యమైనవి. డైరెక్టర్ కె.కాశిక్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి 'వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, అవగాహనను వెలికి తీయడం వల్ల వారి భవిష్యత్తుకు పునాదులు బలంగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్ రెడ్డి, అకాడమిక్ కో-ఆర్డినేటర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉన్మాదంతో కూడిన బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగులు

బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుండ్రాతి శారదా గౌడ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీజేపీ నిర్వహించే స్ట్రీట్ కార్నర్ మీటింగులు ఉన్మాదంతో కూడిన మాటలతో ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయనీ, దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ లేదని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకురాలు, బీసీ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుండ్రాతి శారదాగౌడ్ అన్నారు. ఆదివారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శారదా గౌడ్ మాట్లాడుతూ కనీస ప్రజాస్వామ్య విలువలు పాటించకుండా స్ట్రీట్ కార్నర్ మీటింగుల్లో స్థానిక అధికార ప్రజా నాయకులపై ఇష్టం వచ్చినట్టు టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎన్ని వేల స్ట్రీట్ కార్నర్ మీటింగులు నిర్వహించినా రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి ఒక్క సీటు కూడా రాదన్నారు. బీసీ సమాజం బీజేపీని క్షమించదన్నారు. బీజేపీ నాయకులు ప్రజలను రెచ్చగొట్టడం తప్ప కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, బీసీ రాజకీయ రిజర్వేషన్లు, బీసీ జనగణన, బీసీ బిల్లు, మహిళా బిల్లు వంటి వాటిపై మాట్లాడరనీ, కేవలం వాళ్ల రాజకీయ ప్రయోజనం తప్ప మీటింగుల్లో ఏమీ ఉండదన్నారు. తాను బీసీ అని చెప్పుకునే ప్రధాని మోడీ బీసీ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఏనాడూ మాట్లాడలేదన్నారు. అదానీ వ్యవహారంతో దేశాన్ని సత్తురోలు చేశారనీ, ప్రపంచం దృష్టిలో దేశ ప్రతిష్టతను దిగజార్చరన్నారు. దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల్లో అభద్రతా భావం పెరిగిపోయిందన్నారు. భేటీ పడావో భేటీ బచావో అనేది పై మాటలే తప్ప ఎక్కడా మహిళా సాధికారత, సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ భద్రత మోడీ పాలనలో లేదన్నారు. ప్రతి సామాజిక వర్గం అసంతృప్తితో బతుకుతుందన్నారు. బీజేపీ ఎన్ని స్ట్రీట్ కార్నర్ మీటింగులు నిర్వహించినా అది వ్యర్థమనీ, ఈ దేశ ప్రజలను మభ్యపెట్టలేరనీ, ఇది బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ గుర్తు పెట్టుకోవాలన్నారు. స్ట్రీట్ కార్నర్ మీటింగులలో అధికార స్థానిక ప్రజా నాయకులను టార్గెట్ చేస్తూ ఇష్టం వచ్చినట్టు కామెంట్లు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

బీఆర్ఎస్‌తోనే సంక్షేమం : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

భారత రాష్ట్ర సమితితోనే సంక్షేమం సాధ్యమవుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ పరిధిలో ఏకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 500 మంది బీజేపీ నాయకులు గులాబీ గూటిలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. పనిచేసే వారికే పట్టం కట్టాలనీ, ఎన్నికల ముందు వచ్చి దండాలు పెట్టే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, చంద్రమోహన్, ఆర్కే బాబు, బి.నర్సింగ్ యాదవ్, ఈఎస్ ధనంజయ, కనివేట నర్సింగ్ రావు, శ్రీనివాస్, బాలరాజ్, భూపతి లక్ష్మణ్, మన్నె శ్రీనివాస్ యాదవ్, గాజుల గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ అంబర్ పేట నియోజకవర్గ జనరల్ సెక్రెటరీగా నరేందర్ చారి



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆలిండియా శ్రీ విరాట్ విశ్వకర్మ ఉమెన్ అండ్ యూత్ ఫెడరేషన్ అంబర్ పేట నియోజకవర్గ జనరల్ సెక్రెటరీగా పటేల్ నగర్‌కు చెందిన సింగోజి నరేందర్ చారి నియమితులయ్యారు. ఆదివారం ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫెడరేషన్ తెలంగాణ ఇన్‌చార్జి శ్రీశైలం, శ్రీనివాస్ చారి, హైదరాబాద్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బ్రహ్మోజీ లక్ష్మీనాచారి, ఆంజనేయులు చారి, రవీంద్ర చారి, వెంకటేష్ చారి, జైన్ కుమార్ చారి, వినయ్ కుమార్ చారి, శ్రీనివాస్ చారి, మహేంద్ర చారి, కిషన్ చారి, సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగోజి నరేందర్ చారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు. విశ్వకర్మల ఐక్యత, వారి అభివృద్ధి కోసం పాటు పడతానని తెలిపారు. తనకు సహకరించిన సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయవాది, సంఘ సంస్కర్త శ్రీ వినాయక్ దామోదర్ సావర్కర్ వర్ధంతి సందర్భంగా కార్వాన్ గుడిమల్కాపూర్‌లో స్వతంత్ర వీర్ సావర్కర్ అసోసియేషన్ సభ్యులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ ఉద్యోగులకు సత్కరించారు. నవతెలంగాణ-ధూల్‌పేట్

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన శంభీపూర్ క్రిష్ణ



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాల్టీ పరిధి మల్లంపేట్‌లోని ప్రనీత్ లీఫ్‌లో ఉస్మానియా జనరల్ హాస్పిటల్, బ్లడ్ సెంటర్ వారి సౌజన్యంతో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. కాలనీ వైస్ ప్రెసిడెంట్ మధు, సెక్రెటరీ కృష్ణమూర్తి, సభ్యులు అశోక్, సతీష్, వివేక్, రవి, క్రిష్ణ, డాక్టర్లు మదుల, విశాలాక్షి, తదితరుల పాల్గొన్నారు..

మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళ్లు

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ రాజకీయ పితామహులు దివంగత కేఎం పాండు మిత్రులు, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ఎర్రవల్లి శ్రీనివాస్ రెడ్డి భౌతికకాయానికి ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద మేడ్చల్ డబిల్ పూర్ గ్రామంలోని ఆయన నివాసం వద్ద సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజ మల్లారెడ్డి , భాగ్యరెడ్డి, విశ్వం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలకు అంతం లేదా..?



- అనుమతులు రెండంతస్తులకు.. నిర్మాణాలు నాలుగంతస్తులు
- విధులు నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్ పల్లి సర్కిల్‌లో అక్రమనిర్మాణాలను అడ్డుకోలేని అచేతన దీనావస్థలో సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారంటూ విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఆ సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి, వివేకానంద నగర్, ఆల్విన్ కాలనీ డివిజన్‌లలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, అనుమతులు రెండంతస్తులు కానీ మూడు , నాలుగంతస్తుల నిర్మాణం చేపడుతున్నారని స్థానికుల ఆరోపిస్తున్నారు. ఇలా నిర్మించడానికి కారణం, స్థానిక ప్రజా ప్రతినిధులు,అధికారుల అండ వారి ప్రోత్సహం వల్లనే అని వారంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రజావసరాలైన మౌలిక వసతుల కల్పనలో సమస్యలు ఎదుర్కోక తప్పదని పలువురు వాపోతున్నారు. అంతే కాకుండా అక్రమ నిర్మాణదారులతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకోవడం వల్లనే భవన నిర్మాణం పూర్తిస్థాయిలో నిర్మించకముందే నిర్మాణం బయట తెల్ల రంగు పూయించి లోపలపని చేసుకునేలా సలహాలు ఇస్తున్నారు అనే ఒక అపవాదు సైతం అధికారులు మూటగట్టుకున్నారని కొందరు చెబుతున్నారు. ముడుపులు ముట్టడం వల్లనే ఇలాంటి చర్యలు చేస్తున్నారని, అధికారులకు ఫిర్యాదులు అందిన ప్పటికి, చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

అక్రమ నిర్మాణాలను అధికారులు అడ్డుకోవాలి



గత నెలలో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోయి ముగ్గురు కార్మికులు మతి చెందారు. ఇంత జరిగినా సర్కిల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణదారులు నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా అధికారులు ఏ మాత్రం అడ్డుకొకపోవడం చూస్తుంటే కార్మికుల ప్రాణాలకు ఎంత విలువ ఇస్తున్నారో తెలుస్తున్నది. ఇకనైనా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం అధికారులు ఆపాలి.

బీఆర్ఎస్ నాయకుడు సిల్వర్ మనీష్



కనీస వేతనాలు అమలు చేయాలని ర్యాలీ

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం షాపూర్ నగర్ హమాలి అడ్డ నుంచి షాపూర్ నగర్ బస్ స్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా సహాయ కార్యదర్శి కె. బీరప్ప, జిల్లా కమిటీ సభ్యులు పసుల అంజయ్య, జిల్లా నాయకులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 73 షెడ్యూల్... కనీస వేతనాల జీవోలను సవరించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతీ కార్మికుడికి, కార్మికురాలికి కనీస వేతనం రూ 26000 ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అడ్డాల మీద పనిచేసే అసంఘటిత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను ఉపసంహరించుకోవాలని, కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. వలస కార్మికులకు 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం అమలు చేయాలని లేనిచో కార్మికులందరినీ ఐక్యం చేసి ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. మార్చి 1వ తేదీన మేడ్చల్ కలెక్టర్ ఆఫీస్ దగ్గర ధర్నా కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేవదానం,మల్లారెడ్డి , కర్బాకర్, భాష, సాదుల్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, నియోజకవర్గం కార్పొరేటర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, సెక్రటరీలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా వచ్చే నెల 3వ తేదీ నుంచి కార్యకర్తలు, బూత్ స్థాయి కన్వీనర్లతో ప్రతీ డివిజన్‌లో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, దీనికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వేలకోట్ల రూపాయల అభివద్ధిని చేశామని, దీనిని ప్రజల్లోకి ఏ విధంగా తీసుకెళ్లాలనే అంశంపై సూచనలు తెలియజేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలు రాష్ట్రం ఏర్పడిన తర్వాత, కేవలం 9 ఏండ్లల్లో సాధించామని ఇవన్నీ కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలో మంత్రి కేటీఆర్ రోజూ వేలకోట్ల రూపాయల పరిశ్రమలను తీసుకొచ్చి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు సష్టిస్తున్నారని ఇవన్నీ కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

ఫతేనగర్ మాదిగ సంక్షేమ సంఘం నూతన చైర్మెన్‌గా సతీష్



నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ మాదిగ సంక్షేమ సంఘం సమావేశం ఆదివారం ఫతేనగర్‌లోని కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి సంఘం ప్రధాన కార్యదర్శి జీడిమడ్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఫతేనగర్ మాదిగల అభివృద్ధి కోసం డివిజన్ స్థాయి మాదిగ సంక్షేమ సంఘం 2014లో స్థాపన చేయడం జరిగిందని మాదిగ సంక్షేమ సంఘం సలహాదారులు కామ్రేడ్ సత్యం, అధ్యక్షులు జిలకర యాదగిరి మరణానంతరం కమిటీని ఎన్నుకోలేదన్నారు. కావున నూతన కమిటీని ఎన్నుకోవాలని మాదిగ ప్రజలు, వారి కుటుంబాలు నూతన కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సంఘ సభ్యులు అందరూ కలిసి గతంలో ఉన్న సంఘాన్ని రద్దు చేసి నూతన చైర్మెన్ గా గోల్కొండ సతీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో మాదిగ సంక్షేమ సంఘానికి చైర్మెన్‌గా ఎన్నుకున్నందుకు ఫతేనగర్ మాదిగ ప్రజలకు కతజ్ఞతలు తెలియజేశారు. మాదిగల అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రావలసిన సంక్షేమ పథకాలను పీడిత వర్గాలకు అందే విధంగా కషి చేస్తానని, మాదిగలు పారిశ్రామికంగా, విద్యాపరంగా, ఉద్యోగ పరంగా వారి భవిష్యత్తును అభివృద్ధి పథంలో నడిపించడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం నుంచి రావలసిన సంక్షేమ పథకాలన్నీ మాదిగలకందే విధంగా అనేకమైన అభివద్ధి కార్యక్రమాలను చేపడతానని తెలియజేస్తున్నాను. అనం తరం పూర్తి కమిటీని ప్రకటించారు. చైర్మెన్‌గా గోల్కొండ సతీష్, సభ్యులుగా మర్రి కిషన్ మెంబర్, జీడిమడ్ల సత్యనారాయణ, సదానంద్, ఎం కిరణ్ (హరిజన బస్తీ అధ్యక్షులు), చిటకోరు నరేష్, హరిబాబు, ఎల్లం, శివ, దత్తు, యాదగిరి, కిరణ్, మధు, ప్రవీణ్, శ్రీనివాస్, మల్లేష్, నగేష్, బాలరాజ్, శివ ఉన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన మేడ్చల్ విద్యార్థులు

నవతెలంగాణ-మేడ్చల్

సిద్దిపేట పట్టణంలో జరుగుతున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 2023 జాతీయస్థాయి కరాటే పోటీలలో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 కరాటే విద్యార్థులు వివిధ విభాగాలలో గోల్డ్ మెడల్ బహుమ తులు సాధించారు. ఇందులో అండర్ 10 ఇయర్స్ కటాస్ విభాగంలో వినీషా, విజేత, తన్విక, అక్షిత గోల్డ్ మెడల్ గెలుపొందారు. అండర్ 12 ఇయర్స్ కుమ్మితే విభాగంలో జి వరుణ్ తేజ్, తబ్రేజ్, అభిరామ్, చైతన్య, మణికత్, అర్జున్ గోల్డ్ మెడల్స్ సాధించగా సాయి జశ్వంత్ సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. అండర్ 14 ఇయర్స్ కుమ్మితే విభాగంలో బిట్టు,షానా రోజ్లిన్ గోల్డ్ మెడల్ గెలుపొందగా కిట్టు సిల్వర్ మెడల్ సాధించాడు. అండర్ 16 ఇయర్స్ కుమ్మితే విభాగంలో ఇన్నోక్షణ్, అనిల్, జాహ్నవి,మున్నా కుమార్ గోల్డ్ మెడల్ గెలుపొందగా అనుప్ రాజ్, మేఘన, వైష్ణవి సిల్వర్ మెడల్ సాధించారు. వీరందరిని మార్చి 28, 29వ తేదీలలో గోవాలో నిర్వహించే ఇంటర్నేషనల్ కరాటే పోటీలకు తీసుకెళ్లడం జరుగుతుందని యూనివర్సల్ 369 కరాటే ఫౌండర్ ఇండియా చీఫ్ గడ్డం సాయికుమార్ తెలిపారు. మేడ్చల్ పట్టణానికి వన్నె తీసుకు వచ్చినటువంటి విద్యార్థులకు గడ్డం సాయికుమార్, కోచ్ లు జి అక్షయ, జి మంజుశ్రీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పాన్సర్స్ ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో ఛాంపియన్ షిప్ తీసుకువస్తామని తెలిపారు.



సమస్యలు పరిష్కరించాలి

- ఇందిరమ్మ కాలనీ ప్రజలు

నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్2 ప్రజలు ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ప్రసాద్‌తో కలిసి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలను గోపాల్ రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ సమస్యలు పుష్కరించాలని కోరారు. ఈ మేరకు వారు స్పందించి సమస్యలను పరిష్కరించడానికి కషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, జనరల్ సెక్రటరీ బట్ట మురళి, 9వ డివిజన్ ఎస్సి సెల్ ప్రెసిడెంట్ గోపి, కమిటీ సభ్యులు చంద్రమౌళి, గోల్కొండ శ్రీను, సురేష్ బాలరాజు, రాము, లడ్డు రాజు, పుండరి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు..

డ్రయినేజీ సమస్యను సత్వరమే పరిష్కరించేలా చూస్తా

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసినగర్ కాలనీలో రోడ్లు, డ్రయినేజీ సమస్యలు ఉన్నాయని స్థానిక ప్రజలు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకు రాగా, కార్పొరేటర్ తులసినగర్ కాలనీలో పాదయాత్ర చేసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. తులసినగర్ కాలనీలో డ్రయినేజీ వ్యవస్థ చిన్నగా ఉండడంతో నిత్యం నిండిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కాలనీలో నివాసాలు పెరిగినందున ప్రజల అవసరాల దష్ట్యా కాలనీలోని ప్రతి వీధిలో నూతన డ్రయినేజీ నిర్మాణం కోసం కొలతలు తీసుకుని అంచనా వ్యయాన్ని వేసి ఇవ్వాలని జల మండలి అధికారులతో కార్పొరేటర్ ఫోన్లో మాట్లాడి సూచించారు. అలాగే సీసీ రోడ్లకు కూడా ఎస్టిమేషన్ వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీలోని ఒక వీధిలో రోడ్డు మీదకు పొంగుతున్న డ్రయినేజీ సమస్యను అత్యవసర పనుల్లో చేర్చి త్వరగా పరిష్కరించే విధంగా చూస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, రాజా నరేందర్ రెడ్డి, సుందు యాదగిరి, యడ్ల సత్యనారాయణ, అంకాల రాజు, బాలరాజు, సత్యనారాయణ, శేఖర్, అనిల్, శ్రీనివాసరావు, గోపాల్ యాదవ్, మధుబాబు, కేశవ్, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేర శోధనలో నిఘా నేత్రాలు ఎంతగానో తోడ్పడతాయి



- ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి

నేర శోధన, నేర నివారణలో నిఘా నేత్రాలు ఎంతగానో తోడ్పడతాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్య నగర్‌లో సీడీపీ ఫండ్స్, కాలనీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మూడు లక్షల అరవై మూడు వేల నిధుల రూపాయల అంచనా వ్యయంతో ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు వెంకట పాపయ్య నగర్ కాలనీ వాసులు ముందుకు రావడం చాలా అభినందనీయం, స్ఫూర్తిదాయకం అన్నారు. ఇతర బస్తీ, కాలనీ వాసులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అవసరమైతే అదనపు కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి తన వంతు ఆర్థిక సహాయం చేస్తానని, దూరదష్టితో బస్తీలలో సైతం భద్రత, ప్రజల రక్షణ ధ్యేయంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని చెప్పారు. శాంతి భద్రతలు కాపాడటానికి పోలీస్ అధికారులు ఎంతగానో కషి చేస్తున్నారని ,సీసీ కెమెరాల ఏర్పాటుపై కాలనీ వాసులకు విస్తత ప్రచారంతో అవగాహన కలిపిస్తున్నారని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలిసులతో సమానమని అన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు తనవంతు కషి గా ఎమ్మెల్యే ఫండ్ (సీడీపీ) ద్వారా రూ. 1 కోటి కేటాయించడం జరిగిందని తెలిపారు. 24 గంటల పాటు నిరంతరం పనిచేసే నిఘా నేత్రలను ప్రతి కాలనీ, బస్తీలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే కాలనీలో ప్లాస్టిక్ నిషేధించాలని, బెస్ట్ కాలనీ అవార్డ్ వచ్చేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షులు అనిల్ రెడ్డి ,మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్, నాయకులు దొడ్ల రామకష్ణ గౌడ్, కాశినాథ్ యాదవ్, శివరాజ్ గౌడ్,వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, వెంకటేష్ గౌడ్, రమేష్ గౌడ్, నరసింహ, రాములుగౌడ్, సాయి గౌడ్, కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామదాసు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మతసామరస్యాల ప్రతీక గ్యార్వి ఉత్సవాలు

- సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మతసామరస్యాలకు ప్రతీకగా గ్యార్వి ఉత్సవాలు నిలుస్తాయని సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ శివాజీ చౌక్ రంగారెడ్డి నగర్ అడ్డా హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన గ్యార్వి ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లింలు సోదర భావంతో మెలుగుతూ ఐక్యతను చాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు వి. హరనాథ్ రావు ,ఏఐటీయూసీ జిల్లా నాయకులు నాగప్ప,హమాలి యూనియన్ నాయకులు సోమయ్య, మహబూబ్, సీపీఐ రంగారెడ్డి నగర్ శాఖ నాయకులు జావేద్,సామెల్, యాదయ్య శాఖ సభ్యులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి

- బీఎస్పీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి జంగయ్య



నవ తెలంగాణ-శామీర్‌పేట

పార్టీ బలోపేతం లక్ష్యంగా పని చేయాలని బీఎస్పీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ జంగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శామీర్ పేట మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి ఆదివారం బీఎస్పీ శ్రేణులు సుమారు 50 బైకులతో ర్యాలీని నిర్వహించారు. కాగా మేడ్చల్ నియోజకవర్గ బిఎస్పీ పార్టీ ఇన్‌చార్జి బొడ జంగయ్య పార్టీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఉమ్మడి శామీర్ పేట మండల వ్యాప్తంగా నిర్వహించిన బైక్ ర్యాలీతో జై బీఎస్పీ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ నాయక్, మహమ్మద్ అహ్మద్ ఖాన్, ప్రశాంత్, కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కైరా గణేష్, నీరుడి నర్సిం హ, బండారి రమేష్ పాల్గొన్నారు.



ఛత్తీస్‌గడ్, రాయ్‌పూర్‌లో జరుగుతున్న ఏఐసీసీ 85వ ప్లీనరీ సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ ప్రతినిధి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నర్సింహరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహరెడ్డి ఇంజనీరింగ్ కళాశా లలో ఆదివారం బహుళ జాతీయ సంస్థ జోహో ఆధ్వ ర్యంలో (క్యాంపస్ ప్లేస్మెంట్స్) ప్రాంగణ నియామకాలు నిర్వహించారు, ఈ నియామకాలలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా ఇంటర్వ్యూలను నాలుగు దశలు నిర్వహించారు. అన్ని దశలలో ఇంటర్వ్యూల కు విజయవంతంగా పూర్తిచేసిన ముగ్గురు విద్యార్థులను జోహో సంస్థ ఎంపిక చేసింది. ఈ ముగ్గురు విద్యార్థులలో ఇద్దరు విద్యార్థులు నరసింహారెడ్డి కళాశాలకు చెందిన విద్యా ర్థులు కావడం విశేషమని కళాశాల చైర్మెన్ జె. నర్సింహరెడ్డి తెలిపారు. జోహో సంస్థకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించి సన్మానించింది. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జె. త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా. ఏ. మోహన్ బాబు, కళాశాల ప్రిన్సిపల్ డా. ఆర్. లోకనాథం, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై మురళీధర్
- హాస్టల్ విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ- మేడ్చల్

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తతో ఉండాలని మేడ్చల్ ఎస్సై మురళీధర్ అన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు సైబర్ నేరాలపై మేడ్చల్ పోలీస్‌ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, గూగుల్ కస్టమర్ కేర్ నెంబర్ ఫ్రాడ్, క్రిప్టో కరెన్సీ ఫ్రాడ్, న్యూడ్ వీడియో కాల్ ఫ్రాడ్, రెంటల్ యాప్ ఫ్రాడ్, క్వీక్ సపోర్ట్ డెస్క్ రిమోట్ అప్ డౌన్ లోడ్ ఫ్రాడ్, క్యూ ఆర్ కోడ్ ఫ్రాడ్, కేబీసీ లాటరీ ఫ్రాడ్ వంటి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే విద్యార్థులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ,వెహికల్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ర్యాష్ డ్రైవింగ్,ట్రిబుల్ రైడింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు.

జేఎన్‌టీయూహెచ్‌లో ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సద్గురు శ్రీ శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి ఉత్సవాలను జేఎన్టీయూహెచ్ వర్సిటీలో వర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు వైస్ చాన్స్ లర్ కట్ట నరసింహారెడ్డి, రిజిస్ట్రార్ మంజూరు హుస్సేన్, రెక్టార్ ఎ.గోవర్ధన్, ప్రిన్సిపల్ జయ లక్ష్మి యాదద్రి టెంపుల్ ఆర్కిటెకట్ మోతీలాల్ నాయక్ హాజరై సంత్ సేవాలాల్ కి భోగ్ బండరో నిర్వహించి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ త్యాగానికి యావత్ బంజారా సమాజం రుణపడి ఉంటుందన్నారు. ప్రజల మేలు కోసం సేవాలాల్ మహారాజ్ అనేక ఉద్యమాలు చేశారని,ఆదర్శవంతమైన ఆయన జీవితాన్ని అందరూ యువతి యువకులు ఆచరించాలన్నారు. నిస్వార్థంగా సమాజ హితమే లక్ష్యంగా జీవితాంతం సేవాలాల్ పనిచేశారని చెప్పారు. బంజారా యువతులు బంజారా సంప్రదాయ డ్రెస్ ధరించి డాన్స్ చేశారు. కార్యక్రమానికి బంజారా దుస్తులు ధరించిన యువతులు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్ బాలు నాయక్, రుప్సింగ్ నాయక్, రంజీ,నరసింహ, సైదా, బలరాం నాయక్, సమ్ములాల్, విద్యార్థులు భాను ప్రకాష్ నాయక్, సభావత్ శ్రీను నాయక్, కరణ్ రాహుల్,ప్రణీత,రంజనా, తేజస్విని, రాము, శ్రీనివాస్, భరత్, హారిక, సానియా, పూజా తదితర విద్యార్థులు, పాల్గొన్నారు.



In the Court of the
HON'BLE IV ADDL.SENIOR CIVIL JUDGE, R.R. DISTRICT,
AT L.B.NAGAR
I.A.No. 23 OF 2020
IN
O.S.No. 960 OF 2017

Between:-
Smt.Neeredi Peddalakshmi ... Petitioner/Defendant
And
Sutthari Bala Kishan ...Respondent/Plaintiff

NOTICE

To
Sutthari Bala Kishan, S/o.Sutthari Jaganatham, Aged about 54 years, Occ:Business, R/o.H.No.5-141, Ghandhinagar, Meerpet, Saroornagar Mandal, R.R.District.

WHEREAS the above-named petitioner filed the above petition i.e. I.A.No. 23 of 2020 in O.S.No. 960 of 2017, under section 5 of limitation Act, to condone the delay for set aside the exparte decree passed against the petitioner on 15.04.2019.

PLEASE take notice that the petition i.e., I.A.No. 23 of 2020 in O.S.No. 960 of 2017 stands posted to 16.03.2023 for your appearance. You are required to appear before the Hon'ble Court on 16.03.2023 at 10-30 AM in person or through an Advocate, failing which, the matter will be heard and decided in your absence.

// BY ORDER OF THE COURT //

Sd/-.
R.NARAYAN REDDY
CH. VENKAT REDDY
Advocates,
#1048, Janapriya Apartments,
Mohan Nagar, Kothapet,
Hyderabad-35.
9396693690

IN THE COURT OF THE HON'BLE 1 ADDL. JUNIOR CIVIL JUDGE CUM : V ADDL METROPOLIGTAN MAGISTRATE MEDCHAL- MALKAJGIRI DISTRICT:
AT : L.B.NAGAR
O.S.No. 35 of 2023

Between :
1. Madigela Pushpalatha W/o. Late M.Narsing Rao, Aged about 65 years, Occ: Housewife,
2. Madigela Satish Kumar, S/o. Late M.Narsing Rao, Aged about 41 years, Occ: Private Employee,
3. Madigela Shravan Kumar, D/o. Late M.Narsing Rao, Aged about 37 years, Occ: Private Employee,

All are R/o.H.No.3-5-171/189, Krishna Nagar, Moulali, Uppal (M), Medchal-Malkajgiri District - 500040 .....Plaintiffs

And

1. The Tahsildar, Uppal Mandal, Medchal-Malkajgiri District.
2. All concerned ....Defendants

COURT NOTICE

Please take notice that the plaintiffs have filed the present suit for declaration of Legal Heirs of the deceased Sri. MADIGELA. NARSING RAO against 1.The Tahsildar, Uppal Mandal, Medchal Malkajgiri District 2.All concerned. This is to inform you that the above case is posted on 03.03.2023 for your appearance at 10.30 AM. Any person having any sort of objection for the same may be present in the court on the above mentioned date and time in person or through a duly instructed counsel and in absence of the same the case shall be decided ex-parte.

SUIT SCHEDULE PROPERTY

All that the piece and parcel of house constructed on Plot No.189 in Sy.No.22, 23,7,8,9 admeasuring 133 Sq.Yds., or 111.19 consisting of G+1 Floors situated at Krishna Nagar, Mallapur Village, under GHMC Kapra Circle, Uppal (M) Ranga Reddy District, now under GHMC, Kapra Circle, Uppal Mandal, Medchal- Malkajgiri District and bounded by: (under Block no.5), NORTH : 20'-0" WIDE ROAD, SOUTH : PLOT NO. 182, EAST : PLOT NO.190., WEST : PLOT NO.188.

(BY ORDER OF THE HON'BLE COURT)

Sd/-
O.ANITHA,
Advocate
Flat No.B-314, Paradise Homes,
CSR Nagar, Hayathnagar,
Hyderabad 501505. Cell:8008002101.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE: CHEVELLA
AT : RANGA REDDY DISTRICT
O.S.NO. 150 OF 2010

BETWEEN:
Smt. : P. Swarupa W/o, Chandra Reddy, Aged 47years, Occ: House wife, R/o. Saisadamam Apartments Flat. No 102, Malkapur Village, Kondapur Mandal, Sanga Reddy District. .....Plaintiff

And

1. Sri. Parma Reddy (died) S/o, P, Venkat, Reddy, Aged 65 years, Occ: Agriculture, R/o. Singapuram Village, Shankarpally Mandal, Rangy Reddy District & 8 others.

To.
8. Sri. Ch. Venkateshwara Varma, S/o.Buddavataram Raju, Aged about, 55 years, Occ: Business, R/o, H.No. 8-3-168/6/2/57 to 60, Flat No. 501, Tharanga Raju Tower, Rajeeve nagar, Yousufguda, Hyderabad - 500 045.
9. Sri. K. Chandrashekar Reddy, S/o. Sri. K. Narasimha Reddy , Aged 54 Years, Occ: Business, R/o. Flat No. 102, Venkata Padmavati Residency, Barkatpura, Hyderabad. ....Defendants

It is informed to you both that my client Smt: Swarupa, who is the Plaintiff have filed a suit for Partition and Possession of suit schedule properties all that the Agricultural lands bearing Sy.No.31/A, 31 /AA, 138/A, 138/AA, 162/A 162/AA, 200/E extent of Ac.0-24, 0-12, 2-08, 2-06, 0-11, 0-21, 6-09 Gts, respectively situated at Singapuram Village of Shankarpally Mandal, Ranga Reddy District total to an extent of Ac 12-11 gts and the Hon'ble Court impleaded you both in the above suit to contest and to appear through your counsel in the above suit and directed my client to take steps in the above case.

Take Notice that the above suit is posted 06-03-2023 at 10.30 AM for your both appearance and for, filing answer in the above suit or else the suit will be decided expartee against your both or will be decided in accordance with law.

By order of Court
V.K.SHIVA SHANKAR
ADVOCATE
H.No.5-9-22/8/A, Opp. New MLA Qrts,
Adarsh Nagar Colony, Hyderabad.
Cell: 9440603604, 7842185182



సర్ఫరాజ్ ఔట్

రెస్టాఫ్ ఇండియాకు మయాంక్ సారథ్యం
మధ్యప్రదేశ్‌తో ఇరానీ కప్ 2023

ముంబయి : దేశవాళీ సర్క్యూట్‌లో పరుగుల మోత మోగిస్తూ జాతీయ జట్టులో చోటు కోసం ఎదురు చూస్తున్న యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ఇరానీ కప్‌కు దూరమయ్యాడు. చేతి వేలికి గాయంతో సర్ఫరాజ్ ఖాన్‌కు 8-10 రోజులు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. డివై పాటిల్ టీ20 చాంపియన్‌షిప్‌లో సర్ఫరాజ్ ఖాన్ గాయపడ్డాడు. దీంతో కీలక ఇరానీ కప్ మ్యాచ్‌కు అతడు దూరం అయ్యాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన మయాంక్ అగర్వాల్ రెస్టాఫ్ ఇండియాకు సారథ్యం వహించనున్నాడు. గత ఏడాది భారత టెస్టు జట్టులో చోటు కోల్పోయిన మయాంక్ అగర్వాల్ ఇరానీ కప్‌లో రాణించి సెలక్టర్ల మెప్పు పొందేందుకు ఎదురు చూస్తున్నాడు. ఆదిత్య శ్రీవాత్సవ గైర్హాజరీలో మధ్యప్రదేశ్ జట్టుకు హిమాన్షు మంత్రి కెప్టెన్సీ వహించనున్నాడు. 2021-22 రంజీ చాంపియన్ మధ్యప్రదేశ్ గత ఏడాది ఇరానీ కప్ ఆడాలి. కానీ 2019-20 చాంపియన్ సౌరాష్ట్ర కోవిడ్-19 పరిస్థితుల్లో ఇరానీ కప్ ఆడలేదు. దీంతో నిరుడు సౌరాష్ట్ర ఇరానీ కప్ ఆడింది. ఈ ఏడాది ఇరానీ కప్ అవకాశం మధ్యప్రదేశ్‌కు అందించారు. ఈ ఏడాది రంజీ చాంపియన్‌గా మళ్లీ సౌరాష్ట్ర నిలిచిన సంగతి తెలిసిందే. ఇరానీ కప్ మ్యాచ్ మార్చి 1 నుంచి గ్వాలియర్‌లో జరుగనుంది. తొలుత ఈ మ్యాచ్‌ను ఇండోర్‌కు కేటాయించినా.. భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు నేపథ్యంలో వేదికను గ్వాలియర్‌కు మార్చారు.

రెస్టాఫ్ ఇండియా : మయాంక్ అగర్వాల్ (కెప్టెన్), సుదీప్ కుమార్, యశస్వి జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, హార్విక్ దేశాయ్, ముఖేశ్ కుమార్, అటిట్ సేతు, చేతన్ సకారియ, నవదీప్ సైని, ఉపేంద్ర యాదవ్ (వికెట్ కీపర్), మయాంక్ మార్కండె, సౌరభ్ కుమార్, ఆకాశ్ దీప్, బి. ఇంద్రజిత్, నారంగ్, యశ్ ధుల్.

మధ్యప్రదేశ్ జట్టు : హిమాన్షు మంత్రి (కెప్టెన్), రజత్ పటీదార్, యశ్ దూబె, హర్ష్ గాప్లీ, శుభం శర్మ, వెంకటేశ్ అయ్యర్, రఘువంశీ, ఆమన్ సోలంకి, కుమార్ కార్తికేయ, శరణ్ జైన్, అవేశ్ ఖాన్, అంకిత్ కుశ్వా, గౌరవ్ యాదవ్, అనుభవ్ అగర్వాల్, మిహిర్ హిర్వాని.

జాతీయ క్రీడా సంఘాల్లో రాజకీయాలు, కుమ్ములాటలు నిత్యకృత్యం. అందుకు జాతీయ హ్యాండ్‌బాల్ అతీతం కాదు. కానీ, అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య, ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్యల గుర్తింపు దక్కినా.. ఇక్కడి రాజకీయాలతో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) మరో సంఘాన్ని ఎన్ఎస్ఎఫ్‌గా గుర్తించింది. అంతర్జాతీయ సమాఖ్య గుర్తింపు పొందిన సంఘం కాకుండా మరో సమాఖ్య హ్యాండ్‌బాల్ వ్యవహారాలు పర్యవేక్షిస్తే.. భారత్‌లో హ్యాండ్‌బాల్‌పై నిషేధం విధిస్తామని ఇటీవల అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య తీవ్రంగా హెచ్చరించింది. ఈ నేపథ్యంలో భారత హ్యాండ్‌బాల్‌లో చోటుచేసుకున్న రాజకీయాలు, కుట్రలను భారత హ్యాండ్‌బాల్ సంఘం (ప్రపంచ, ఆసియా గుర్తింపు పొందినది) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు మీడియా సమావేశంలో వెల్లడించారు.

సర్వ హక్కులూ మాకే!

- భారత్‌లో హ్యాండ్‌బాల్‌పై హెచ్ఏఐ అధ్యక్షుడు జగన్
- అంతర్జాతీయ, ఆసియా సమాఖ్యల గుర్తింపు
- త్వరలోనే ఐఓఏ నుంచీ సానుకూల స్పందన

నవతెలంగాణ-హైదరాబాద్



జాతీయ హ్యాండ్‌బాల్‌లో గత కొంతకాలంగా చోటుచేసుకున్న సందిగ్ధత, రాజకీయాలు, కుట్రలకు శాశ్వతంగా ముగింపు పలికామని భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్ఏఐ) అర్శనపల్లి జగన్‌మోహన్ రావు తెలిపారు. అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య, ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్యలు హెచ్ఏఐకు భారత్‌లో జాతీయ క్రీడా సమాఖ్య గుర్తింపు అందించాయని, ఇక్కడ హ్యాండ్‌బాల్ నిర్వహణ, అభివృద్ధిపై సర్వ హక్కులూ హెచ్ఏఐ సొంతమని జగన్‌మోహన్ రావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మేరకు అంతర్జాతీయ, ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్యలు భారత ఒలింపిక్ సంఘానికి పంపిన లేఖల ప్రతులను చూపించారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఏఐ) కాకుండా.. మరే ఇతర సంఘం హ్యాండ్‌బాల్‌లో జోక్యం చేసుకున్నా తక్షణమే భారత్‌లో హ్యాండ్‌బాల్‌పై నిషేధం విధిస్తామని అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య ఇటీవల ఐఓఏకు రాసిన లేఖను సైతం జగన్‌మోహన్ రావు విలేకరుల సమావేశంలో బయటపెట్టారు.

మూడేండ్లలో రెండు టైటిళ్లు

'ఒలింపిక్ క్రీడల్లో ఓ జాతీయ సంఘానికి అధ్యక్షత వహించటం ఆషామాషీ విషయం కాదు. ఎన్నో సవాళ్లతో కూడిన వ్యవహారం. అనతికాలంలోనే రాష్ట్ర అధ్యక్షుడి నుంచి జాతీయ అధ్యక్షుడిగా ఎదిగాను. ఈ ప్రస్థానంలో జాతీయ హ్యాండ్‌బాల్‌లో పలు విజయాలు సొంతం చేసుకున్నాం. ఎటువంటి సిఫారసులకు తలొగ్గకుండా ఉత్తమ జట్లను ఎంపిక చేశాం. హిమాచల్ ప్రదేశ్‌లో ఆధునాతన అకాడమీలో శిక్షణ అందించాం. ఫలితంగా, 2022 ఆసియా జూనియర్ మహిళల యూత్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌తో పాటు అదే ఏడాది ఆసియా మహిళల యూత్ బీచ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచాం. 2023 ఆసియా మహిళల ప్రెసిడెంట్ కప్ విజయంతో సరికొత్త చరిత్ర సృష్టించాం. 2023 ఆసియా క్రీడలకు భారత మహిళల జట్టు అర్హత సాధించింది. అధ్యక్షుడిగా మూడేండ్ల కాలంలో భారత హ్యాండ్‌బాల్ మునుపెన్నడూ చూడని విజయాలను సాధించి చూపించాను' అని జగన్‌మోహన్ రావు తెలిపారు.

హెచ్ఏఐకే మా గుర్తింపు

భారత్‌లో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఏఐ)కి మాత్రమే అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ (ఐహెచ్ఎఫ్) గుర్తింపు ఉంది. మరే ఇతర సంఘం హ్యాండ్‌బాల్‌లో జోక్యం చేసుకోరాదు. హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (హెచ్ఎఫ్ఐ) హ్యాండ్‌బాల్ నిర్వహణలో కొనసాగకుండా కట్టడి చేయండి. హెచ్ఎఫ్ఐను అదుపు చేయలేని పరిస్థితులు ఉంటే అదే విషయాన్ని మాకు తెలియజేయండి. ఆ పరిస్థితుల్లో భారత్‌లో హ్యాండ్‌బాల్ నిషేధం విధించేందుకు వెనుకాడమని ఐహెచ్ఎఫ్ హెచ్చరించింది.

ఇతరులకు అనుమతి లేదు

భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్ఏఐ)కి మాత్రమే ఐహెచ్ఎఫ్, ఆసియా హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ గుర్తింపు ఉన్నాయి. ఐహెచ్ఎఫ్, ఏహెచ్ఎఫ్ పేరు, లోగో ఇతరులు వినియోగించేందుకు అనుమతి లేదు. ఇతర సంఘాలు లోగోలను వినియోగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. హెచ్ఏఐకి మాత్రమే భారత్‌లో హ్యాండ్‌బాల్‌పై హక్కులు ఉన్నాయని ఆసియా హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ షఫిఖ్ ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

ఇక తగ్గేది లేదు

'అంతర్జాతీయ స్థాయిలో భారత హ్యాండ్‌బాల్ విజయాలు కొందరికి రుచించలేదు. అక్రమాలు, అవినీతికి అవకాశం ఇవ్వటం లేదని కుట్రలకు తెరతీశారు. దక్షిణాది, ఓ తెలుగు రాష్ట్రానికి చెందిన వ్యక్తి జాతీయ సమాఖ్య అధ్యక్ష పగ్గాలు చేపట్టడం వారికి నచ్చలేదు. అధ్యక్ష పీఠం నుంచి తొలగించేందుకు కుట్ర చేశారు. ఇంత చేసినా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చాం. దేశంలో హ్యాండ్‌బాల్ కార్యకలాపాలను హెచ్ఏఐ మాత్రమే నిర్వహించేలా భారత ఒలింపిక్ సంఘానికి అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య లేఖ రాసింది. అడ్డంకులు సృష్టిస్తున్న సంఘాలు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలి. దేశంలో ఒలింపిక్ క్రీడ హ్యాండ్‌బాల్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు హెచ్ఏఐతో కలిసి పని చేయాలి. ఇక, హ్యాండ్‌బాల్ అభివృద్ధిలో ఎక్కడా తగ్గేది లేదు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో త్వరలోనే హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి హ్యాండ్‌బాల్ అకాడమీ ఏర్పాటు చేస్తామని' జగన్ వెల్లడించారు.

రెండు మెగా టోర్నీలు

'ఈ ఏడాది రెండు మెగా టోర్నీలు నిర్వహిస్తున్నాం. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ తొలి సీజన్ పోటీలను జూన్‌లో నిర్వహించనున్నాం. జూన్ 8 నుంచి 25 వరకు ఈ పోటీలు జరుగుతాయి. జులైలో ఆసియా మహిళల యూత్ చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాం. న్యూఢిల్లీ వేదికగా జులై 15 నుంచి 24 వరకు ఈ టోర్నీ ఉంటుంది. జపాన్, చైనా, చైనీస్ తైపీ, ఇరాన్ సహా పది దేశాలు ఈ టోర్నీలో పోటీపడనున్నాయి. గత ఏడాది హైదరాబాద్ వేదికగా ఆసియా మెన్స్ క్లబ్ చాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించటంతో ఆసియా యూత్ టోర్నీ ఆతిథ్య హక్కులు దక్కాయని' అని జగన్ అన్నారు.

మిషన్ ఒలింపిక్స్

'2028 ఒలింపిక్స్‌లో భారత హ్యాండ్‌బాల్ జట్టు పోటీపడాలనేది నా స్వప్నం. అందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా ముందు కెళ్తున్నాం. మిషన్ ఒలింపిక్స్‌ను సాకారం చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశాం. ప్రతిభాన్వేషణతో మేటి క్రీడాకారులను వెలికితీసి అత్యుత్తమ శిక్షణ అందించనున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తోడు ఐఓఏ, సాయ్ సహకారం అవసరమని' జగన్‌మోహన్ రావు పేర్కొన్నారు.



ఆసీస్ సిక్సర్

- ఐసీసీ టీ20 ప్రపంచకప్ సొంతం
- ఫైనల్లో దక్షిణాఫ్రికాకు భంగపాటు

కేప్‌టౌన్ : ఆస్ట్రేలియా సిక్సర్. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో అందరూ ఊహించిన జట్టునే విజయం వరించింది. ఆతిథ్య దక్షిణాఫ్రికా మహిళలు దేశ క్రికెట్ చరిత్రలో నవ శకానికి నాంది పలికేందుకు టైటిల్ పోరులో పోరాడినా.. చివరకు భంగపాటు తప్పలేదు. టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా 19 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. రికార్డు స్థాయిలో ఆరోసారి పొట్టి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. బెత్ మూనీ (74 నాటౌట్, 53 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులతో తొలుత ఆస్ట్రేలియా 156/6 పరుగులు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా ఓపెనర్ లారా (61, 48 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) కదం తొక్కినా సఫారీలు 20 ఓవర్లలో 7 వికెట్లకు 137 పరుగులే చేశారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి ఫైనల్లో పోటీపడిన దక్షిణాఫ్రికా అమ్మాయిలు సొంత అభిమానుల నడుమ కల చెదరటంతో కన్నీటి పర్యంతమయ్యారు. బెత్ మూనీ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.



లారా పోరాడినా : ప్రపంచకప్ ఫైనల్లో 157 పరుగుల లక్ష్యం పెద్దదే. కానీ ఓపెనర్ లారా (61) అర్ధ సెంచరీతో సఫారీ ఛేదనలో దూసుకెళ్లింది. ఆమెకు సహచర బ్యాటర్ల నుంచి సహకారం దక్కలేదు. ఓ ఎండ్‌లో లారా దంచికొట్టినా.. మరో ఎండ్‌లో కట్టడి చేసిన కంగారూ బౌలర్లు.. అంతిమంగా ఒత్తిడి పెంచగలిగారు. బ్రిట్స్ (10), మరిజానె (11), సునె లుస్ (2), నదినె (8 నాటౌట్), బాచ్ (1) విఫలమయ్యారు. లారా నిష్క్రమణతో సఫారీ ఛేదనలో పస తగ్గింది. 137 పరుగులే చేసిన దక్షిణాఫ్రికా 19 పరుగుల తేడాతో ప్రపంచకప్ టైటిల్‌ను చేజార్చుకుంది.

మూనీ మెరుపుల్ : తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాకు ఓపెనర్ బెత్ మూనీ (74 నాటౌట్) మెరుపు ఆరంభాన్ని అందించింది. అలీసా హీలే (18)తో కలిసి తొలి వికెట్‌కు 36 పరుగులు జోడించిన మూనీ.. చివరి వరకు క్రీజులో నిలిచింది. 9 ఫోర్లు, ఓ సిక్సర్‌తో ధనాధన్ మోత మోగించింది. మిడిల్ ఆర్డర్‌ను కట్టడి చేసిన సఫారీ బౌలర్లు ఆసీస్ భారీ స్కోరు చేయకుండా నిలువరించారు. గార్డ్‌నర్ (29) మరోసారి ఆకట్టుకుంది. హారిస్ (10), మెగ్ లానింగ్ (10), పెర్రీ (7)లు స్వల్ప స్కోర్లకే వికెట్ పారేసుకున్నారు. సఫారీ బౌలర్లలో షబ్నిం, మరిజానె రెండేసి వికెట్లు పడగొట్టారు. మూనీ మెరుపులతో ఆసీస్ తొలుత 156 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా మహిళలు : 156/6 (బెత్ మూనీ 74, గార్డ్‌నర్ 29, షబ్నిం 2/26, మరిజానె 2/35)

దక్షిణాఫ్రికా మహిళలు : 137/6 (లారా 61, ట్రయాన్ 25, స్కాట్ 1/23, జొనాసెన్ 1/21)



కె.విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి కన్నుమూత


దిగ్గజ దర్శకుడు, కళా తపస్వి కె.విశ్వనాథ్ ఇకలేరనే వార్తను తెలుగు ప్రేక్షకులు ఇంకా పూర్తిగా జీర్ణించుకోకముందే ఆయన ఇంట మరో విషాదం చోటు చేసుకుంది. కె.విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి (86) కన్నుమూశారు. ఆదివారం ఆమె తీవ్ర అస్వస్థతకు లోనై గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అపోలో హాస్పిటల్‌కి తరలించారు. హాస్పిటల్‌కి తరలించిన కొద్దిసేపటికే ఆమె చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.
ఈనెల 2న దిగ్దర్శకుడు కె.విశ్వనాథ్ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన చనిపోయిన 24 రోజులకే జయలక్ష్మి కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. విశ్వనాథ్, జయలక్ష్మి దంపతులకు కూతురు పద్మావతివిశ్వనాథ్, కొడుకులు నాగేంద్రనాథ్ విశ్వనాథ్, రవీంద్రనాథ్ విశ్వనాథ్ ఉన్నారు. జయలక్ష్మి మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా ద్వారా తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

సూపర్ యాక్షన్ థ్రిల్లర్

విన్ను మద్దిపాటి, స్మిరితరాణిబోర, కాలికేయ ప్రభాకర్, కాశీవిశ్వనాథ్, డా.భద్రం, సోనియాచదరి నటీనటులుగా రూపొందుతున్న చిత్రం 'గ్రంథాలయం'. వైష్ణవి శ్రీ క్రియేషన్స్ పతాకం పై సాయిశివన్ జంపాన దర్శకత్వంలో ఎస్. వైష్ణవి శ్రీ నిర్మిస్తున్న కమర్షియల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని మార్చి 3న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇటీవల చిత్ర ట్రైలర్‌ను ప్రసాద్ ల్యాబ్‌లో గ్రాండ్‌గా లాంచ్ చేశారు.
'ఈ ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ఉంది. ఆద్యంతం సినిమాపై మంచి ఆసక్తిని రేకెత్తించేలా ట్రైలర్‌ను కట్ చేశారు. మర్చిపోలేని జ్ఞాపకాలను గుర్తుచేసుకుని మళ్ళీ మళ్ళీ మాట్లాడుకునే కథ కాదు నాది.. లాంటి డైలాగ్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. ఫైట్స్ సీక్వెన్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. దీంతో ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ట్రైలర్ డిస్ట్రిబ్యూటర్స్ వాట్సాప్‌లలో వైరల్‌గా మారింది. ట్రేడ్ వర్గాల్లో కూడా ఈ సినిమాకి మంచి బిజినెస్ జరుగుతుంది' అని చిత్ర యూనిట్ తెలిపింది.
చిత్ర దర్శకుడు సాయి శివన్ మాట్లాడుతూ,'కల చెప్పిన కథే ఈ 'గ్రంథాలయం'. నాకొచ్చిన కలను కథగా రాసుకున్నాను. సూపర్ యాక్షన్ థ్రిల్లర్‌గా వస్తున్న ఈ సినిమా ఒక సస్పెన్స్ కాన్సెప్ట్‌ను కమర్షియల్‌గా ఫస్ట్ టైం ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం. ఇందులో మాస్‌కి కావలసిన అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి.
ఇలాంటి మంచి సినిమా చేసే అవకాశం కల్పించిన నిర్మాతలకు రుణపడి ఉంటాను. మ్యూజిక్ డైరెక్టర్ ఈ సినిమాకు చాలా మంచి పాటలు ఇచ్చారు. ప్రేక్షకుల ముందుకు వస్తున్న మా చిత్రాన్ని ఆదరిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని చెప్పారు.



స్మిరితరాణిబోర, విన్ను మద్దిపాటి



రావణాసురుడి లక్ష్యం ఏంటి?

రవితేజ, సుధీర్ వర్మ కాంబినేషన్‌లో అభిషేక్ పిక్చర్స్, ఆర్టీ టీమ్‌వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న హై-ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర'. ఈ సినిమా షూటింగ్ ఆదివారంతో పూర్తి అయ్యింది. ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో వేసిన భారీ సెట్‌లో శేఖర్ మాస్టర్ పర్యవేక్షణలో హీరో, హీరోయిన్లపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం వేసవిలో విడుదలయ్యే క్రేజీ ప్రాజెక్ట్‌లలో ఒకటి. ఫస్ట్ గ్లింప్స్ రవితేజ పాత్రని విభిన్న షేడ్స్‌లో చూపించగా, థీమ్ సెంబర్, రెండవ సింగిల్‌కి కూడా అద్భుతమైన స్పందన వచ్చింది. సుశాంత్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో అనుఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నాగర్కర్, పూజిత పొన్నాడ కథానాయికలుగా నటిస్తున్నారు. శ్రీకాంత్ విస్సా ఈ చిత్రానికి సరికొత్త కథని అందించారు. సుధీర్ వర్మ తన మార్క్ టేకింగ్‌తో ఈ చిత్రాన్ని కథనంలో ఊహించని మలుపులతో స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది ఈ చిత్రానికి నిర్మాతలు: అభిషేక్ నామా, రవితేజ.

వేసవిలో భువన విజయమ్



వెన్నెలకిషోర్, సునీల్

సునీల్, శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల కిషోర్, ధనరాజ్ ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న చిత్రం 'భువన విజయమ్'. నూతన దర్శకుడు యలమంద చరణ్ దర్శకత్వంలో హిమాలయ స్టూడియో మాన్షన్స్, మిర్త్ మీడియా బ్యానర్స్ పై కిరణ్, వివిస్కే నిర్మిస్తున్న కామెడీ డ్రామా చిత్రమిది. వేసవిలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ని దర్శకుడు వేణు ఉడుగుల విడుదల చేశారు. పోస్టర్‌లో ప్రధాన తారాగణం సునీల్, శ్రీనివాస్ రెడ్డి, వెన్నెల కిషోర్, వైవా హర్ష, బిగ్‌బాస్ వాసంతి, థర్టీ ఇయర్స్ పృథ్వీ, ధనరాజ్ మిగతా నటులు సీరియస్ లుక్‌లో కనిపించడం క్యూరియాసిటీని పెంచింది. శ్రీమతి లక్ష్మీ సమర్పిస్తున్న ఈ చిత్రంలో గోపరాజు రమణ, రాజ్ తిరందాసు, జబర్దస్త్ రాఘవ, అనంత్ , సోనియా చౌదరి, స్నేహల్ కామత్, షేకింగ్ శేషు, సత్తి పండు ఇతర తారాగణం. చిత్రానికి రచన, దర్శకత్వం: యలమంద చరణ్, సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపీ: సాయి.


నవచిత్రం

డబ్బు చుట్టూ తిరిగే కథ



ప్రణవ్‌చంద్ర, మాళవిక సతీషన్, హరీష్‌శంకర్, శివ నాగేశ్వరరావు

ఐక్యూ క్రియేషన్స్ బ్యానర్ పై ప్రణవ్‌చంద్ర, మాళవిక సతీషన్, అజయ్ గోష్, బిత్తిరి సత్తి, మాస్టర్ చక్రి, జెమిని సురేష్ నటీనటులుగా శివ నాగేశ్వరావు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'దోచేవారెవరురా'. బొడ్డు కోటేశ్వరరావు నిర్మాత. సరికొత్త కామెడీ థ్రిల్లర్‌గా నిర్మితమైన ఈ చిత్రం మార్చి 11న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు హరీష్ శంకర్ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు.
దర్శకులు హరీష్ శంకర్ మాట్లాడుతూ, 'శివ నాగేశ్వరావు చాలా సెన్సాఫ్ హ్యూమర్ ఉన్న వ్యక్తి. తనకున్న సెన్సాఫ్ హ్యూమర్ మాకు కూడా లేదు. తను ఎన్నో మంచి సినిమాలు ప్రేక్షకులకు అందించారు. మళ్ళీ ఇప్పుడు మంచి కథతో వస్తున్న ఈ సినిమా ట్రైలర్, పాటలు బాగున్నాయి. ఇందులో నటించిన నటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ఈ సినిమా బిగ్ హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని తెలిపారు.
'ఈ కథ మొత్తం డబ్బుకి సంబంధించిన అంశం చుట్టూ జరుగుతుంది. ప్రస్తుత సమాజంలో ఇంటినుండి బయటికి వచ్చిన తరువాత మనల్ని రకరకాలుగా దోచుకుంటున్నారు. ఇంతకు ముందు ఎవర్ని దోచుకోవాలో సెలెక్ట్ చేసుకొని వారిని దోచుకొనే వారు. ప్రస్తుతం మనల్ని ఎవరు దోచుకోవాలో వారిని మనమే సెలెక్ట్ చేసుకుంటున్నాం. ఇందులో అన్ని రకాల ఎమోషన్స్‌తో పాటు ఫుల్ అవుట్ అండ్ కామెడీ థ్రిల్లర్ కూడా ఉంటుంది' అని దర్శకుడు శివ నాగేశ్వరావు అన్నారు.
నిర్మాత బొడ్డు కోటేశ్వరరావు మాట్లాడుతూ, 'శివ నాగేశ్వరరావు సినిమాలలో ఉన్న కామెడీ, వినోదాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. ఇప్పుడు మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న మా సినిమా కూడా అంతే ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందని నమ్ముతున్నాను' అని చెప్పారు.



'బిగ్ స్నేక్ కింగ్'లో ఒక దృశ్యం

ఏ ప్రాణికైనా హాని చేస్తే..?

ఏలూరు సురేంద్ర రెడ్డి సమర్పణలో బుద్ధ భగవాన్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై వస్తున్న సినిమా 'బిగ్ స్నేక్ కింగ్' ఇటీవల రిలీజైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. మార్చి 3న ఈ సినిమా అన్ని భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమైంది.
ఈ సందర్భంగా ఏలూరు సురేంద్ర రెడ్డి, 'తెలుగులో నేను రిలీజ్ చేస్తున్నాను. కథ విషయానికి వస్తే, చైనాలోని ఒక గ్రామానికి చెందిన లీ, కొంతమంది గ్రామస్థులను అక్రమ తవ్వకాల కోసం ఒక గుహ దగ్గరకు తీసుకెళ్తాడు. అయితే వారి కారణంగా వందేళ్లుగా నిద్రపోతున్న అతి పెద్ద పాము నిద్ర లేస్తుంది. దీని నుంచి తప్పించుకునే సమయంలో లీ మాత్రమే బతికి బయటపడతాడు. కొన్ని రోజుల తర్వాత దానిని తరిమి కొట్టడానికి గ్రామస్థులు యాగాలు చేయడం ప్రారంభిస్తారు. మహారాజు కుమారుడు చింగ్ చాంగ్ వచ్చి ఆ గ్రామానికి సాయం చేస్తాడు. లీ కుమార్తె మింగ్ యు అతనితో కలిసి గ్రామస్థులను దూరంగా పంపి ఆ పెద్ద పామును డైనమైట్ బాంబ్‌తో పేల్చి చంపేస్తారు. చివరిగా భూమి పై ఏ ప్రాణికి హాని చేయకూడదని గ్రామస్థులు ప్రతిజ్ఞ చేస్తారు. ఈ సిరీస్‌లో వాళ్ళు దాదాపు 10 సినిమాలు చేశారు. వాటిని కూడా నేనే నెలకి ఒకటి చొప్పున రిలీజ్ చేస్తున్నాను. ఫైట్ మాస్టర్ యువన్ హిందీలో దాదాపు 5 సినిమాలు, తెలుగులో ఒక సినిమా చేశారు. హీరోలు లికస్ దాదాపు 100 సినిమాలు పైనే చేశారు. మార్చి3న తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని చూసి ఆదరించడం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.